

చదువు
రూ॥ 180/-
పేజీలు: 210
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



ప్రజాస్వామ్య ముసుగు కప్పుకొన్న అమెరికా ఉగ్రవాదం


అల్‌ఖైదా అనుబంధ సంస్థకు చెందినషామా పర్వీన్ అరెస్టు

నిమిషప్రియ మరణశిక్ష రద్దు అవాస్తవం

లోపలి పేజీల్లో



సంపుటి 28, సంచిక: 41 | గురువారం | 31-07-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

‘గొర్రెల’ స్కామ్

## కళ్యాణ్‌కుమార్ ఇంటిపై ఇడి దాడులు

- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వద్ద ఒఎస్‌డిగా పనిచేసిన కళ్యాణ్ కుమార్
- భారీగా నగదు పట్టుకున్న అధికారులు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో చోటుచేసుకున్న గొర్రెల కుంభకోణంలో డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు దూకుడు పెంచారు. ఈ క్రమంలోనే బుధవారం బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దగ్గర గతంలో ఒఎస్‌డిగా పనిచేసిన కళ్యాణ్‌కుమార్ ఇంటిపై ఇడి అధికారులు దాడి చేశారు. ఈ సందర్భంగా భారీగా నగదు బయటపడినట్లు సమాచారం. ప్రత్యేకంగా కౌంటింగ్ మిషన్లను తెప్పించి నగదును ఇడి అధికారులు లెక్కించారు. ఈ సందర్భంగా మాజీ ఒఎస్‌డి కళ్యాణ్ కుమార్‌ను ఇడి అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గొర్రెల పంపిణీ స్కీంలో రూ. 700 కోట్ల కుంభకోణం జరిగినట్లు ఎసిబి నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఇడి అధికారులు కళ్యాణ్ ఇంటితో సహా హైదరాబాద్‌లోనిని ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో పలు కీలక డాక్యుమెంట్లు, భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. కళ్యాణ్‌ను సుమారు 7 గంటల పాటు విచారించినట్లు సమాచారం. ఈ కేసు గత ప్రభుత్వం హయాంలో అమలు చేసిన గొర్రెల పంపిణీ స్కీంలో జరిగిన ఆర్థిక అక్రమాలకు సంబంధించినది కాగా... ఈ స్కీంలో రూ. 700 కోట్ల నిధులు దుర్వినియోగం అయినట్లు ఎసిబి తరువాయి 2లో

# 25% భారత్‌పై సుంకం

- జరిమానా విధించిన అమెరికా
- రేపటినుండే అమల్లోకి
- రష్యాతో వాణిజ్యాన్ని తప్పుపట్టిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- మరోసారి భారత్–పాక్ యుద్ధ ప్రస్తావన
- సుంకాల ప్రభావంపై అధ్యయనం చేస్తున్నాం : భారత్



**వాషింగ్టన్ :** ‘డియర్ ఫ్రెండ్ భారత్’పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 25 శాతం సుంకాలు విధించారు. రష్యాతో భారత్ వాణిజ్య భాగస్వామ్యాన్ని తప్పుపట్టారు. భారత్ తమ మిత్రదేశమని చెబుతూనే విమర్శలు చేశారు. రెండు దేశాలమధ్యా వాణిజ్య చర్చలు స్తంభించాయని వార్తలు వచ్చిన నేపథ్యంలో ట్రంప్ ప్రకటన వెలువడింది. భారత్ నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై శుక్రవారం (ఆగస్టు 1వ తేదీ) నుండీ పెంచిన సుంకాలు అమలులోకి వస్తాయనీ, 25 శాతం సుంకాలతోపాటు పెనాల్టీని భారత్ చెల్లించాల్సి ఉంటుందని ట్రంప్ చెప్పారు. అమెరికా చాలా తక్కువ వాణిజ్యం చేసినాగానీ భారత్‌తో తమ దేశానికి సామూహికంగా భారీ వాణిజ్యలోటు ఏర్పడిందన్నారు. ట్రంప్ విధించిన గడువు ఆగస్టు ఒకటోతేదీతో ముగుస్తుంది. ఈ లోపు వాణిజ్య ఒప్పందాలు చేసుకోని దేశాలపై భారీగా సుంకాలు విధిస్తామని ట్రంప్ మొదట్లోనే స్పష్టం చేశారు. ప్రపంచంలో అందరికంటే చాలా ఎక్కువగా భారతదేశం తమ దిగుమతులపై సుంకాలు వసూలు చేస్తోందని, తమ రెండు దేశాలమధ్యా సుంకాలలో సమతౌల్యం లేదని, భారత్‌తో అమెరికా వాణిజ్యలోటు చాలా తరువాయి 2లో

### మోదీ మౌన ఫలితమే

**సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా ధ్వజం**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశాన్ని రాజకీయంగా, ఆర్థికంగా, నైతికంగా లక్ష్యంగా చేసుకుంటున్నా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజల విషయంలో గానీ, పార్లమెంట్ విషయంలో గానీ నిజాయితీగా లేకపోవడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆక్షేపించింది. రష్యా నుండి చమురు దిగుమతులపై పెనాల్టీలు సహా భారత్‌పై 25శాతం సుంకాలు విధిస్తున్నామని తరువాయి 2లో

### ట్రంప్ మోదీ మధ్యనున్న ‘తారిఫ్’ కొద్దిగే అర్థమయ్యింది

కాంగ్రెస్ ఎద్దేవా


అమెరికా అధ్యక్షుడితో తన స్నేహం పెద్దగా అర్థం కాదని చెప్పిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై బుధవారం కాంగ్రెస్ తీవ్రస్థాయి విమర్శలు చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశంపై 25శాతం సుంకాలు, జరిమానాలు విధించిన అనంతరం కాంగ్రెస్ స్పందించింది. మాజీ తరువాయి 2లో

# రష్యా తీరంలో భారీ భూకంపం

రిక్టర్ స్కేలుపై 8.8 తీవ్రత




- పసిఫిక్ సముద్రంలో అనేక దేశాలకు సునామీ భయం
- కమ్చట్కాలో బద్దలవుతున్న అగ్నిపర్వతం
- సెవెరో–కురిల్స్క్ పట్టణ ప్రజల తరలింపు
- అనేక దేశాలకు సునామీ హెచ్చరిక
- 20 లక్షలమంది ప్రజలను అప్రమత్తం చేసిన జపాన్
- మెల్లిగా అనేకచోట్ల హెచ్చరికలు ఉపసంహరణ





**మాస్కో:** రష్యా తీరంలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 8.8 తీవ్రతతో నమోదైన ఈ భూకంపంవల్ల పసిఫిక్ సముద్రంలో రష్యా, హవాయ్ దీవులకు సునామీ ప్రమాదం ముంచుకొచ్చింది. అనేకమంది గాయపడినప్పటికీ తీవ్రత లేదు. ప్రాథమిక సమాచారం ప్రకారం భారీనష్టాలు జరగలేదు. ప్రజలు ఎత్తైన పర్వత ప్రాంతాలకు చేరుకోవాలని ప్రభుత్వం హెచ్చరించింది. రష్యా, జపాన్ సహా అనేక దేశాలలో సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. తర్వాత వాటిని మెల్లిగా ఉపసంహరించారు. రష్యా కామ్చాట్కా తీరంలో 15 మీటర్ల ఎత్తు వరకూ అలలు ఎగసిపడి ప్రజలను భయభ్రాంతులు చేశాయి. ప్రజలు ఆ ప్రాంతాలు ఖాళీ చేశారు. ఐతే కామ్చాట్కా ద్వీపకల్పంలో సు నామీ హెచ్చరికలు రద్దుచేసినట్లు రష్యా అధికారు లు ప్రకటించారు. కామ్చాట్కాలో తర్వాత అనేకసా ర్లు భూమి కంపించింది. ఈ ఏడాది జులైనెలలో తొలుత కామ్చాట్కా ప్రాంతంలో ఐదు సార్లు 7.4 తీవ్రంతతో భూకంపాలు సంభవించాయి. ఉత్తర అమెరికా,దక్షిణ అమెరికా, ఓసియానా (ఆస్ట్రేలియాఖండం), ఆసియాలలో సునామీ అలల తీవ్రతను బట్టి ప్రజలకు హెచ్చరికలు, అప్రమత్తతలు, సలహాలు జారీ చేశారు. 73 సంవత్సరాల తర్వాత రష్యాలో సంభవించిన అతిభారీ భూకంపం ఇదే. రష్యాలో కామ్చాట్కా ద్వీపకల్పం, సఖలిన్ ద్వీపం, ఉత్తర కురిల్ దీవులలోని సెవెరో కురిల్స్క్ పట్టణాన్ని అప్రమత్తంచేసి తక్షణ సహాయ చర్యలు చేపట్టారు. కమ్చాట్కా,జపాన్ మధ్య ప్రాంతంలో ఉన్న కురిల్స్ ప్రాంత ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. ఇళ్ళలోంచి బయటకు పరుగులు తీశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అనేక భవంతులు దెబ్బతిన్నాయి. తమ కళ్ళ ఎదుటే బరువైన సామాన్లు కదలిపోయి కిందపడిపోతూ ఉండటాన్ని తాము చూసి చావు తప్పదని భయపడ్డామని కొందరు చెప్పారు. ఐతే బుధవారం రాత్రినాటికి అనేక ప్రాంతాలలో సునామీ హెచ్చరికలను, సలహాలను ఉపసంహరించారు. ఫ్రెంచ్ పోలినేసియా తీరంలో సుమానీ ప్రమాదం పొంచి ఉందని, అధికారులు, సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సోషల్ మీడియాలో తొలుత పోస్టింగ్ పెట్టారు. 1952 తర్వాత ఇంత భారీ భూకంపం రావడం మళ్ళీ ఇదే మొదటిసారి తరువాయి 2లో



# నింగిలోకి నిసార్

- జిఎస్ఎల్‌వి ఎఫ్- 16 రాకెట్ ప్రయోగం ఘన విజయం
- షార్ నుండి అద్భుత ప్రయోగం

**సూళ్లూరుపేట:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి బుధవారం జిఎస్ఎల్‌వి ఎఫ్16 రాకెట్ ద్వారా నిసార్ ఉపగ్రహాన్ని శాస్త్రవేత్తలు బుధవారం సాయంత్రం 5.40 గంటలకు నింగిలోకి పంపారు. 18 నిమిషాల 40 సెకండ్లలో నిసార్ ఉపగ్రహం నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో, నాసా శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఇది ఇస్రో శాస్త్రవేత్తల ఘనవిజయమని చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. ఇస్రో ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు చైర్మన్ అభినందనలు తెలిపారు. శ్రీహరికోట నుండి మరిన్ని భారీ ప్రయోగాలు ప్రయోగించనున్నామని తెలిపారు. శాస్త్రవేత్తలు భూ పరిభ్రమణంలో వస్తున్న మార్పులు, భూగోళంలో ఏమి జరుగుతుందో ప్రతి రోజూ ఒకసారి స్కానర్‌లో సమగ్ర సమాచారాన్ని అరచేతిలో పెట్టేందుకు రూపకల్పన చేసిన ఓ అద్భుత రాకెట్ ప్రయోగానికి ఇస్రో, నాసా రూపకల్పన చేసిన నిస్సార్ ఉపగ్రహ ప్రయోగ ఘన విజయం సాధించింది. నిసార్ డ్యూయెల్ రాడార్ సిస్టమ్ను కలిగి ఉంది. ఎస్ బ్యాండ్ సిథటిక్ ఎపర్చర్ రాడారు తరువాయి 2లో



## మోదీ... ట్రంప్‌ను నిలదీయగలరా?

- యుద్ధాన్ని అర్థాంతరంగా ఎందుకు ఆపారు?
- రాజ్యసభలో సిపిఐ ఎంపి సందోశ్ కుమార్ ప్రశ్నలు
- అగ్నివీర్ పథకం ఉపసంహరణకు డిమాండ్

**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌ను అర్థాంతరంగా ఎందుకు ఆపారో కేంద్రం సమాధానం ఇవ్వాలని రాజ్యసభలో సిపిఐ ఎంపి సందోశ్ కుమార్ డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల ఫ్యాక్టరీగా ఉన్న పాకిస్థాన్ నుంచి ఫోన్ రాగానే దాడులు ఆపేయడం ఎందుకని ప్రశ్నించారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషించే పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చినట్లు గొప్పలు పోయే సర్కారు.... ఆ దేశం నుంచి ఫోన్ కోసమే వేచివున్నట్లుగా అది జరిగిన మరుక్షణం దాడులు ఆపేసిందని విమర్శించారు. కాల్పుల విరమణ ప్రకటించడం కోసం వారిని ఒత్తిడి చేసినదేమిటని ప్రశ్నించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత నైతిక సార్వభౌమాధికారాన్ని అవమానిస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రధాని మోదీని సిపిఐ ఎంపి ప్రశ్నించారు. ప్రముఖ సామాజిక మాధ్యమం ‘ఎక్స్’లో అత్యధిక మంది ఫాలోవర్లు కలిగిన నాలుగో వ్యక్తిగా ఉన్న నరేంద్ర మోదీ.... ట్రంప్‌ను నిలదీస్తూ కనీసం ఒక్క పోస్టు పెట్టగలరా అంటూ సందోశ్ కుమార్ సవాల్ విసిరారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆపరేషన్ సైలెన్స్‌ను మోదీ చేపట్టారని ఎద్దేవా చేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా ఉంటే, జాతీయ ఐక్యతను రాజకీయ గుత్తాధిపత్యంగా మార్చే ప్రయత్నాన్నీ బిజెపి చేసిందని సందోశ్ కుమార్ తరువాయి 2లో



## ఫీల్డ్ అసిస్టెంట్లకు సమాన వేతనం

- ఉపాధి హామీలో కొనసాగుతున్న 7111 మందిని ఒకే కేటగిరిలో చేర్చాలి
- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం
- ఫీల్డ్ అసిస్టెంట్లను బదిలీ చేయనున్నట్లు ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉపాధి హామీ పథకంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న 7111 మంది ఫీల్డ్ అసిస్టెంట్లకు సమానవేతనం అమలు చేయాలని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ సీతక్క అధికారులకు ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్ అందరినీ ఒకే కేటగిరిలో చేర్చి, ఒకే రకమైన వేతనాన్ని అమలు చేయాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల బదిలీల చేయనున్నట్టు ప్రకటించారు.గ్రూప్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్, హెల్త్ కార్డులు కూడా మంజూరు చేస్తామని, ఫీల్డ్ అసిస్టెంట్ల ఎక్స్‌గ్రేషియా రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు పెంపు, ఉపాధి కూలీల హాజరు నమోదు తరువాయి 12లో



## పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి పక్కా ఇండ్లు నిర్మించాలి

- కమ్యూనిస్టులుగా ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం
- వరంగల్ జిల్లా ద్వితీయ మహాసభల్లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/ వరంగల్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలను ఆదుకోవాలని, పేదలు వేసుకున్న గుడిసెలకు, ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి, పక్కా ఇళ్లు నిర్మించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. నిరంతరం పేదల, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడే కమ్యూనిస్టులుగా తాము ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని చెప్పారు. రానున్న రోజులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలుచేయాలని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బుధవారం వరంగల్ జిల్లా సిపిఐ ద్వితీయ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక అబ్బాస్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా చాడ వెంకట్ రెడ్డి హాజరై ప్రసంగించారు. కార్పొరేట్ వర్గాలకు తరువాయి 12లో



## మరో కొత్త డిస్కమ్

వ్యవసాయానికి, ప్రభుత్వ విద్యాసంస్థలకు, గృహజ్యోతి పథకానికి ఇచ్చే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొత్త డిస్కమ్ పరిధిలోకి తీసుకురావాలి : సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రంలో విద్యుత్ విభాగాన్ని ప్రక్షాళన చేసేందుకు అవసరమైన సంస్కరణలు అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీచేశారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో కొత్తగా మరోక విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్)ను ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తరువాయి 12లో

## ట్రంప్ వ్యాఖ్యలు అబద్ధమని మోదీ ఎందుకు చెప్పట్లేదు

ప్రధాని తన బండారం బయటపడుతుందని జంకుతున్నారు : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 30 సార్లు చెప్పినప్పటికీ, అది అబద్ధమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పలేకపోతున్నారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలు నిస్సందేహంగా తిరస్కరించడానికి నిరాకరిస్తున్నారన్నారు. ఎందుకంటే ట్రంప్ సత్యాన్ని బయటపెడుతారని తరువాయి 12లో

## 42 శాతం బిసి కోటాపై ఢిల్లీలో ఉద్యమం

- 5న పార్లమెంటు ఉభయ సభల్లో ఎంపిల వాయిదా తీర్మానం, చర్చకు పట్టు
- టిపిసిసి నిర్ణయం
- మూడు రోజుల ఉద్యమ కార్యాచరణ పకడ్బందీగా ప్రణాళికా రూపకల్పన
- ప్రత్యేక రైలులో రాష్ట్రం నుంచి కాంగ్రెస్ నాయకులు, బిసి శ్రేణుల తరలింపు



ప్రజాపక్షం/ హైదరాబాద్

తెలంగాణలో 42 శాతం బిసి రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం ఢిల్లీలో ప్రతిష్ఠాత్మకంగా బిసి ఉద్యమాన్ని చేపట్టాలని, ఆగస్టు 5న పార్లమెంటు ఉభయ సభల్లో ఎంపిల వాయిదా తీర్మానం, చర్చకు పట్టుబట్టాలని టిపిసిసి నిర్ణయించింది. ఢిల్లీకి ప్రత్యేక రైలులో పెద్దఎత్తున తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిసి శ్రేణులను తరలించి మూడు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## పాలస్తీనా గుర్తింపు కోసం 'న్యూయార్క్ కాల్' పేరుతో 15 దేశాల పిలుపు

**న్యూయార్క్ :** పాలస్తీనా దేశ స్వయంప్రతిపత్తిని గుర్తించాలని ఫ్రాన్స్ మరో 14దేశాలు పిలుపు ఇచ్చాయి. ఐక్యరాజ్యసమితి నిర్వహించిన ప్రత్యేక సదస్సు సందర్భంగా ఈ 15 దేశాలూ "న్యూయార్క్ కాల్" పేరుతో ప్రపంచదేశాలకు ఒక ప్రగాఢమైన విజ్ఞప్తి చేశాయి. జులై 20–30 తేదీలలో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం న్యూయార్క్‌లో సదస్సు అనంతరం 15 దేశాల నాయకులూ బుధవారంనాడు ఈ "న్యూయార్క్ కాల్" ఇచ్చారు. పాలస్తీనా స్వయంప్రత్తి సాధనకు, ఆ దేశాన్ని గుర్తించేందుకు ప్రపంచంలోని అన్ని దేశాలూ పూనుకోవాలని పిలుపు ఇచ్చారు. ఫ్రాన్స్, సౌదీ అరేబియా దేశాల ప్రధాన ప్రోద్బలంతో ఐక్యరాజ్యసమితి ఈ ప్రత్యేక సదస్సు నిర్వహించింది. అండొర్రా, ఆస్ట్రేలియా,కెనడా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, ఐస్‌లాండ్, ఐర్లాండ్, లగ్జెంబర్గ్, మాల్టా, న్యూజిలాండ్, నార్వే, పోర్చుగల్, శాన్ మారినో, స్లొవేనియా,స్పెయిన్ దేశాలు ఈ "న్యూయార్క్ కాల్" ఇచ్చాయి.

## థాయ్–కాంబోడియా మధ్య చైనా ఎంట్రీ

### షాంఘైలో త్రైపాక్షిక సమావేశం
### కాల్పుల విరమణ పునరుద్ఘాటన



**బీజింగ్ :** ట్రంప్ మధ్యవర్తిత్వం తర్వాత కూడా కాంబోడియా–థాయ్‌లాండ్ దేశాలమధ్య పరస్పర దాడుల ఆరోపణలు సర్దుమణగకపోవడంతో ఆసియాలో బాధ్యతగల పొరుగుదేశంగా చైనా జోక్యం చేసుకుంది. ఈ మూడు దేశాలమధ్యా షాంఘైలో బుధవారంనాడు త్రైపాక్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంబోడియా–థాయ్‌లాండ్ దేశాలు కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటామని చైనాకు పునరుద్ఘాటించాయి. బుధవారం మధ్యాహ్నం త్రైపాక్షిక సమావేశం తర్వాత రెండు దేశాల ప్రతినిధులు నవ్వు ముఖాలతో మీడియా ఎదుట ఫొటోలు తీయించుకున్నారు. చైనా ఉపమంత్రి సన వైడాంగ్ ఈ సమావేశంలో మధ్యవర్తిగా పాల్గొన్నారు. డోనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకుని వాణిజ్యాన్ని అడ్డుపెట్టి ఒప్పందం కుదిర్చిన తర్వాత కూడా, కాంబోడియా తమ సరిహద్దుల్లో దాడులు కొనసాగిస్తోందని, మలేసియా నగరం పుత్రజయలో కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించిందని థాయ్‌లాండ్ ఆరోపించింది. ఈ విషయంపై బీజింగ్‌లో చైనా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గుయో జియాకున్ బుధవారంనాడు మీడియాతో మాట్లాడుతూ, రెండు దేశాలకూ బాధ్యతగల ఒక పొరుగుదేశంగా చైనా ఈ త్రైపాక్షిక సమావేశం నిర్వహించిందన్నారు. కాంబోడియా–థాయ్‌లాండ్ విదేశాంగమంత్రులతో చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ వేరువేరుగా సమావేశాలు నిర్వహించారు. రెండు దేశాల మధ్యా ఉద్రిక్తతలను సడలింపజేసేందుకు చైనా తనదైన శైలిలో మధ్యవర్తిత్వం చేసిందని వాంగ్ యీ చెప్పారు. మలేసియా నగరం పుత్రజయలో జులై 21న "ఏసియన్" (ఆగ్నేయ ఆసియా దేశాల సంఘం) అధినేత, మలేసియా ప్రధాన మంత్రి అన్వర్ ఇబ్రహీం మధ్యవర్తిగా కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ కాంబోడియా కాల్పుల విరమణను ఉల్లంఘించిందని థాయ్‌లాండ్ ఆరోపణలు చేస్తోంది. ఈ రెండూ "ఏసియన్"ల సభ్యదేశాలే. రెండు దేశాలమధ్యా సరిహద్దు ఘర్షణలు మొదలయ్యాక జులై 19వ తేదీ రాత్రి పొద్దుపోయాక థాయ్–కాంబోడియా నాయకులతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఫోన్ సంభాషణలు చేశారు. రెండు దేశాలూ శత్రుత్వం కొనసాగిస్తే వారితో వాణిజ్యం చేసే ప్రసక్తే లేదని బెదిరించారు. దీంతో రెండు దేశాలు బేషరతుగా కాల్పుల విరమణపై చర్చలకు సుముఖత వ్యక్తం చేశాయి. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ట్రంప్ ప్రకటించిన తర్వాత కూడా ఆ మాటను ఉల్లంఘించి రెండు దేశాలూ పోరాటాన్ని కొనసాగించాయి.

1907లో కాంబోడియా తమ వలస కేంద్రంగా ఉన్నకాలంలో ఆనాటి ఫ్రెంచ్ ప్రభుత్వం సరిహద్దులు నిర్దేశించి ఒక పటాన్ని రూపొందించింది. దీనిని థాయ్‌లాండ్ వ్యతిరేకిస్తోంది. ఈ రెండు దేశాలమధ్యా 817కి.మీ సరిహద్దు ప్రాంతం ఉంది. ఫ్రాన్స్ నిర్దేశించిన ఈ సరిహద్దులలో అనేకచోట్ల దశాబ్దాలుగా వివాదం కొనసాగుతోంది. తమ దేశానికి చెందిన అనేక చారిత్రక ప్రదేశాలు కాంబోడియాలోకి వెళ్ళాయని థాయ్‌లాండ్ ప్రతిఘటిస్తున్నది.

## సమస్య పరిష్కారంపైనే దృష్టి సారిద్దాం

### ఇజ్రాయెల్–పాలస్తీనాపై భారత్ పునరుద్ఘాటన



**న్యూయార్క్:** ఇజ్రాయెల్–పాలస్తీనా రెండు దేశాల పరిష్కారానికే భారత్ కట్టుబడి ఉందని, ప్రపంచం ఇప్పుడు దీనిమీదే దృష్టిసారించాలని ఐక్యరాజ్యసమితి రాయబార కార్యాలయంలో మనదేశ శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పునరుద్ఘాటించారు. పాలస్తీనాపై న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి సదస్సు రెండు దేశాల పరిష్కార సాధనకు ఒక గొప్ప అవకాశమని బుధవారం ఆయన చెప్పారు. ఉపయుక్తమైన చర్చల ప్రక్రియ, దౌత్యమార్గాల ద్వారా ఏ విధంగా ఈ సమస్యను పరిష్కరించాలన్న విషయంమీదే భారతదేశం ఇప్పుడు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించిందని ఆయన అన్నారు. ఇప్పుడు మనం అందరం ఆ విషయంపైనే దృష్టి సారించి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. రెండు దేశాల పరిష్కారం తప్ప దీనికి మరో ప్రత్యామ్నాయం లేదని ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ ప్రగాఢంగా విశ్వసిస్తున్నాయని అన్నారు.

(జులై 28–30)న్యూయార్క్‌లో సదస్సు కూడా ఇదే విషయాన్ని బలంగా ఉద్ఘాటించింది. కాగితాలపై కసరత్తుచేస్తే ఉపయోగం లేదని, ఆచరణాత్మకంగా ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.

ఈ రెండు రోజుల సదస్సులో చేసిన తీర్మానం ప్రకారం 25 పేజీల ఒక నివేదికను రూపొందించారు. "పాలస్తీనా సమస్య–రెండు దేశాల సాధనకు శాంతియుత పరిష్కారం–న్యూయార్క్ ప్రకటన" అనే శీర్షికతో ఐక్యరాజ్యసమితి సదస్సు తీర్మానం వెలువడింది. ఈ నివేదిక ప్రకారం గాజాలో తక్షణం యుద్ధాన్ని విరమింపజేయాల్సిన అవసరం ఉందని, హమాస్ సంస్థ అనివార్యంగా గాజాలో తన పరిపాలనకు తెర దించాలని, తన ఆయుధాలను పాలస్తీనా అథారిటీకి స్వాధీనం చేయాలని ఈ తీర్మానపత్రం ప్రకటించింది. హమాస్ తన అధికారం నుండి వైదొలగిన తర్వాత తక్షణం ఒక పరివర్తనదశ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కూడా తీర్మానం పేర్కొంది. ఈ చర్యల కంటే మరో ఉత్తమ ప్రత్యామ్నాయం లేనే లేదని పర్వతనేని హరీశ్ చెప్పారు.

## ఒప్పందం లేకుండానే ముగిసిన అమెరికా–చైనా వాణిజ్య చర్చలు



**స్టాక్‌హోం:** స్వీడన్ నగరం స్టాక్‌హోంలో చైనా–అమెరికా మధ్య జరిగిన ఉన్నతస్థాయి వాణిజ్య చర్చలు ఏ ఒప్పందం లేకుండానే ముగిశాయి. నాలుగోవిడత చర్చలు తదుపరి జరిగే అవకాశం ఉంది. రెండు దేశాల ఉన్నత స్థాయి ప్రతినిధులు భారీ టారిఫ్‌లకు సంబంధించిన గడువు తేదీని పొడిగించుకునే విషయంపై కసరత్తు చేసేందుకు అంగీకరించారు. ఐతే అమెరికా కోశాగార మంత్రి స్కాట్ బెస్సెంట్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ, ఆగస్టు 12వ తేదీ నాటితో ముగిసే గడువు తేదీని పొడిగించాలా? వద్దా? అనే విషయంపై డోనాల్డ్ ట్రంప్‌తో చర్చిస్తామన్నారు. చైనా ఉప ప్రధానమంత్రి హే లీఫెంగ్ బుధవారం ఈ విషయం చెప్పారు. చైనాపై 24 శాతం టారిఫ్‌లు వేసేందుకు అమెరికా సిద్ధమైంది. అందుకు ప్రతిగా చైనా కూడా సుంకాలు భారీగా విధించేందుకు సిద్ధపడింది. ఐతే రెండు దేశాల మధ్యా ఉన్న అపోహలు తొలగించుకుని, సహకారాన్ని వృద్ధి చేసుకునే దిశగా ముమ్మర ప్రయత్నాలు కొనసాగించాలని స్టాక్‌హోం చర్చల్లో పాల్గొన్న లీ ఫెంగ్, స్కాట్ బెస్సెంట్ ఒక అంగీకారానికి వచ్చారు. ప్రపంచదేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడంతో చైనా ప్రభుత్వం ట్రంప్‌కు ఒక అతిపెద్ద సవాలుగా మారింది. అమెరికాతో సమానంగా చైనా కూడా గౌరవాన్ని కోరు కుంటూ పరస్పర మర్యాదపూర్వకమైన, పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందం ఉండాలని చెబుతున్న మాటలు ట్రంప్‌కు మింగుడు పడటం లేదు. కాగా బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గుయో జియాకున్ మీడియాతో మాట్లాడుతూ.. రెండు దేశాల అగ్ర నాయకులు వ్యక్తం చేసిన ఏకాభిప్రాయం దిశగా కింది స్థాయీ యంత్రాంగం పరిష్కారాల సాధనకు కృషి చేస్తాయన్నారు.

## ఇమ్రాన్‌ఖాన్ బెయిల్ నిరాకరణ పిటిషన్లపై విచారణ 13 రోజులు వాయిదా



**ఇస్లామాబాద్:** పలు కేసుల్లో బెయిలు నిరాకరించిన లాహోర్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్‌ఖాన్ దాఖలు చేసిన పలు పిటిషన్లను ఆ దేశ సుప్రీంకోర్టు ఆగస్టు 12వ తేదీకి వాయిదా వేసింది. 2023 మే 9వ తేదీన పాకిస్థాన్ వ్యాప్తంగా పెద్ద ఎత్తున హింసాత్మక అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లలో ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పిటిఐ పార్టీ ప్రధానపాత్ర పోషించింది.

పాకిస్థాన్ సంకీర్ణ ప్రభుత్వం మే తొమ్మిదో తేదీని బ్లాక్ డేగా అభివర్ణిస్తున్నది. దేశవ్యాప్తంగా పాకిస్థాన్ తెహ్రీక్ యే ఇన్సాఫ్ పార్టీ అల్లర్లవల్ల 1.98 బిలియన్ డాలర్ల మేరకు ఆస్తుల నష్టం వాటిల్లిందని, గృహదహనాలు, లూటీలు, హింస, విద్వేష చర్యలకు పిటిఐపార్టీ పాల్పడిందని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ఆరోపిస్తున్నది. దీనిపై అనేక కేసులు ఇమ్రాన్‌ఖాన్, వారి ప్రధాన కార్యకర్తలపై బనాయించారు. సైనిక వ్యవస్థ ఆస్తులను ధ్వంసం చేయడమే కాకుండా పోలీసు వ్యవస్థ ఆస్తులను కూడా పిటిఐ కార్యకర్తలు ధ్వంసం చేశారని ప్రభుత్వం పేర్కొంటున్నది. దీనికి సంబంధించి లాహోర్ హైకోర్టు ఇమ్రాన్‌ఖాన్‌పై విచారణ జరిపింది. తొమ్మిది కేసులలో ఆయనకు బెయిలు నిరాకరించింది. దీనిని ఇమ్రాన్ ఖాన్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ అల్లర్లు జరిగిన సమయం లో తాను జైలులో ఉన్నానని, అల్లర్లు జరిగితే తనపై కేసులు ఎలా పెడతారని ఇమ్రాన్ ఖాన్ ప్రశ్నిస్తున్నారు. లాహోర్‌లో పిఎంఎల్–ఎన్ పార్టీ కార్యాలయంపైన, షాద్మాన్ పోలీస్‌స్టేషన్‌పైన ఇతర ప్రాంతాల్లో దాడులు చేసిన ఘటనపై దాఖలైన ఎనిమిది కేసులలో ఉగ్రవాద వ్యతిరేక కోర్టు గత ఏడాది నవంబరులో ఇమ్రాన్‌ఖాన్‌కు ఇప్పటికే బెయిలు తిరస్కరించింది. రెండేళ్ళక్రితం పదవీచ్యుతుడైన తర్వాత నుండీ తనను రాజకీయంగా బలిచేసి తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారని దేశవ్యాప్తంగా భారీ ఎత్తున ప్రచారం చేసేందుకు పిటిఐ పార్టీ ప్రయత్నం చేస్తున్నది.

## నిలదీయగలరా?
(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. విద్వేష ప్రచారాలకు పరిమితమైందని, ఇందులో గోదీ మీడియా ప్రధాన పాత్ర పోషించిందని అన్నారు. యుద్ధోన్మాదాన్ని ప్రోత్సహించేలా 'గోదీ' మీడియా ప్రసారాలు చేసిందన్నారు. జాతీయవాదాన్ని వర్గీకరించే బిజెపి వైఖరిని ఆయన ఎండగట్టారు. కల్నల్ సోఫియా ఖురేషిని బిజెపి నాయకులు లక్ష్యంగా చేసుకోవడాన్ని ప్రస్తావించారు. ఉగ్రవాదం పేరిట ఓట్లు అడిగే చరిత్రగల బిజెపి తమకు జాతీయవాదం నేర్పాలనుకోవడం హాస్యాస్పదమన్నారు. బజరంగ్ దళ్ వంటి స్థానిక ఉగ్రవాద సంస్థలపైనా దృష్టి పెట్టాలంటూ... ఇటీవల చత్తీస్‌గఢ్‌లో సన్యాసినులు(నన్స్)పై దాడిని సందోశ్ కుమార్ గుర్తుచేశారు. 1965లో పాక్‌ను ఓడించినప్పుడు రామ్‌లీలా మైదానంలో అప్పటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ప్రసంగిస్తూ పాకిస్థాన్‌తో పోరు రాజకీయమైనదే తప్ప మతపరమైనది కాదని అన్నారని గుర్తుచేశారు. పాకిస్థాన్‌ను రాజకీయ విరోధిగా ఆయన వర్ణిస్తే... ప్రస్తుత ప్రభుత్వం ఇందుకు పూర్తి భిన్నంగా మతోన్మాదాన్ని పెంచిపోషిస్తూ, ప్రతి ఊరువాడలో ఇండోపాక్ పరిస్థితి సృష్టించేందుకు యత్నిస్తోందని సందోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. యుద్ధోన్మాదాన్ని ప్రోత్సహించే మీడియా ప్రసారాలు, నినాదాలను కట్టడి చేయాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ఏ రాజకీయ పార్టీ వ్యతిరేకించలేదని, సైనికులకు అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు ఇచ్చాయని తెలిపారు. ఉగ్రవాదం వ్యతిరేక చర్యకు మద్దతిచ్చాయని గుర్తుచేశారు. కేంద్ర విదేశాంగ మంత్రి గతంలో చెప్పిన మాటాలకు, ఇప్పుడు మాట్లాడేదానికి పొంతన లేదన్నారు. యుద్ధం ఏ సమస్యకు పరిష్కారం కాదని నమ్మే పార్టీకి సిపిఐ అని చెప్పారు. 2008లో ముంబై దాడులు జరిగినప్పుడు అప్పట్లో గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి నేరుగా ప్రధానిని బలహీనుడిగా విమర్శించడం ఆమోదయోగ్యమా అని ప్రశ్నించారు. ఉగ్రవాదం పేరిట రాజకీయం చేయడం బిజెపికే చెల్లిందని సందోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. అసలు అఖండ భారత సిద్ధాంతాన్ని ఆర్‌ఎస్‌ఎస్‌ను అనుసరించే వారు నిజంగా నమ్ముతారా అన్న సందేహాన్ని సిపిఐ ఎంపి వ్యక్తం చేశారు. దేశ ప్రజలను విభజించేందుకు ఇది సమయం కాదని నొక్కిచెప్పారు. నిజమైన దేశ భక్తి, లౌకికవాదం, ఐక్యత కోసం సిపిఐ కట్టుబడి ఉందని సందోశ్ కుమార్ తెలిపారు. తన ప్రసంగం ప్రారంభంలో అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకం ద్వారా సైనికులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. 'ఆపరేషన్ సిందూర్‌లో 3000 మంది అగ్నివీరులు పాల్గొన్నారని, వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అగ్నివీర్ మురళీనాయక్ ఒకరని చెప్పారు. మురళీనాయక్ కుటుంబానికి పింఛన్‌గానీ మరే ఇతర ప్రయోజనాలుగానీ అందలేదని తెలిపారు. సైనికులకు, వారి కుటుంబాలకు అక్కరకు రాని ఇలాంటి పథకాన్ని రద్దు చేయడానికి ఇదే సరైన సమయమని సంతోశ్ కుమార్ అన్నారు. ప్రస్తుతం సైన్యంలో లక్షకుపైగా ఖాళీలు ఉన్నాయని, వీటిని సాధ్యమైనంత త్వరగా భర్తీ చేయాలని సీపీఐ ఎంపీ కోరారు.

## భారీ భూకంపం
(మొదటి పేజీ తరువాయి)

అని, దీని ఫలితంగా కమ్చట్కాలోని క్లూచెవ్స్కా సోప్కా అగ్ని పర్వతం బద్దలవుతోందని రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో భూగర్భసేవల విభాగాన్ని ఉటంకిస్తూ టాస్ వార్తాసంస్థ ప్రకటించింది. అగ్ని పర్వతం బద్దలయ్యే విస్ఫోటన దృశ్యాన్ని కూడా అకాడమీ టెలిగ్రామ్ ఛానల్‌లో పోస్టు చేసింది. రష్యా కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 11.25 గంటలకు ఈ భూకంపం సంభవించింది. రష్యాలోని సెవెరో కురిల్స్క్ పట్టణాన్ని ప్రజలు ఖాళీ చేశారు. ఈ తీరప్రాంత పట్టణంలో ఉన్న ఓడరేవు మునిగిపోయింది. అలలు 13 అడుగుల ఎత్తుకు ఎగసిపడ్డాయి. ఈ ఓడరేవులో చేపలను శుద్ధిచేసి ప్రాసెసింగ్ ఫుడ్ తయారుచేసే విభాగాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న రెండువేల మంది ప్రజలను రష్యా సురక్షిత ప్రాంతాలకు తరలించింది. భారీ నష్టం వాటిల్లలేదని పోర్టు మేయర్ ప్రకటించారు. రష్యాలో ఇప్పటివరకూ సంభవించిన అతి శక్తిమంతమైన భూకంపాలలో ఇది ఆరో భూకంపమని అమెరికా భూగర్భ సర్వే విభాగం (యుఎస్‌జిఎస్) ప్రకటించింది. గతం లో 2011 మార్చినెలలో జపాన్ ఈశాన్యప్రాంతంలో 9.0 తీవ్రతతో అత్యంత బలమైన భూకంపం సంభవించింది. ఆ తర్వాత ఆ స్థాయీ భూకంపం రావడం మళ్ళీ ఇదే.

ఆసియాలో జపాన్ పసిఫిక్ కోస్తా తీరానికి సునామీ హెచ్చరికలు చేశారు. తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. తైవాన్, పిలిప్పైన్స్, మెక్సికో, చైనాలోని షాంఘై, ఝెఝియాంగ్ ప్రాంతాలను అప్రమత్తం చేశారు. దక్షిణ అమెరికాలో చిలీ, కోస్టారికా, నికరాగువా, మెక్సికో, ఎల్‌సాల్వడార్‌లకు హెచ్చరికలు జారీ చేశారు. ఆస్ట్రేలియా ఖండంలో న్యూజిలాండ్, పపువా న్యూగినియా, సోలోమన్ ఐలాండ్స్, ద మార్క్వెసాస్, ఉవాహుకా ఐలెండ్స్, నుకూహివా, వనియాతా ప్రాంతాలకు హెచ్చరికలు ఇచ్చారు. ఉత్తర అమెరికాలో కాలిఫోర్నియా తీరం, హంబోల్ట్ నుండి ఒరెగాన్ సరిహద్దు వరకూ హెచ్చరికలు జారీ చేశారు. వాషింగ్టన్ తీరప్రాంతాలు, హవాయ్, ఓరెగాన్, దక్షిణ అలాస్కా, బ్రిటిష్ కొలంబియా తదితర ప్రాంతాల ప్రజలను జాగ్రత్తగా ఉండమని సలహాలు జారీ చేశారు.

ఈ భూకంపం కారణంగా జపాన్‌కు కూడా పెద్ద ప్రమాదం వాటిల్లడంతో ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేసింది. 20 లక్షలమందికి సునామీ హెచ్చరిక చేసిన జపాన్ ప్రభుత్వం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఐతే తర్వాత ఈ సునామీ హెచ్చరికను ఒక సలహాస్థాయికి కుదించారు. జపాన్‌లోని అణు విద్యుత్ కర్మాగారానికి అసాధారణస్థాయిలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. 2011లో వచ్చిన భూకంపం, సునామీలో తీవ్రంగా నష్టపోయిన ఫుకుషిమా డైచీ కర్మాగారం నిర్వాహకుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమ కర్మాగారంలో 4,000 మంది కార్మికులు ప్లాంట్ భవంతి పైభాగానికి చేరుకుని భద్రంగా ఉన్నారని చెప్పారు. సునామీ హెచ్చరికవల్ల జపాన్‌లో రవాణావ్యవస్థ అస్తవ్యస్థమైంది. ఫెర్రీలు, రైళ్ళ స్లు, విమానాశ్రయాలలో కార్యకలాపాలు స్తంభించాయి. ఇవాత్‌లోని కుజీపోర్టు, హొక్కైడోలోని హమనరలో 60 సెంటీమీటర్లు సునామీ రికార్డయింది. అనేక ప్రాంతాలలో 20 సెంటీమీటర్ల మేరకు సునామీలు నమోదయ్యాయి. జపాన్‌లోని ఉత్తర తీర ప్రాంత పట్టణం మత్సుషిమాలో డజన్లమంది ప్రజలు ఇళ్ళు ఖాళీచేసి శరణార్థ ప్రాంతానికి చేరుకున్నారు. రష్యా తూర్పుతీరంలో వచ్చిన సునామీ అలలు అమెరికా పశ్చిమ ప్రాంతాన్ని కూడా తాకాయి. పెరూ దేశంలో కూడా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి.

## నింగిలోకి నిసార్
(మొదటి పేజీ తరువాయి)

ఇస్రో, ఎల్ బ్యాండ్ సింథటిక్ ఎపర్చర్ రాడార్ను నాసా రూపొం దించాయి. ఇది మేఘాలను దాటిన తర్వాత కూడా సెం టీమీటర్ స్థాయిలో భూమిపై కదలికలను పసిగట్ట గలదు. నిసార్ ఉపగ్రహం ప్రతి 12 రోజులకు మొత్తం భూమిని స్కాన్ చేస్తుంది. ప్రతి కదలిక లేదా మార్పును క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తుంది. బెంగ ళూరులోని యూఆర్ రావు స్పేస్ సెంటర్ (యూ ఆర్‌ఎస్సీ)లో ఈ శాటిలైటు రూపొం దించారు. ఈ ఉపగ్రహం ద్వారా భూమికి సంబంధించిన మొత్తం సమాచారాన్ని సేకరించే ప్రయత్నాలు జరుగు తున్నాయి. భూ సమాచారాన్ని సేకరించే పనిలో నిమగ్నం పెరుగుదల సహా భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు, కొండచరియలు విరిగి పడడం వంటి ప్రకృతి విపత్తుల ముందస్తు సమాచా రాన్ని అందిస్తుంది. ముఖ్యంగా భూకం పాలు, అగ్ని పర్వత విస్ఫోటనాలు, కొండ చరియలు విరిగిపడటం, వరదలు, భూమి కుంగి పోవడం వంటి ప్రకృతి వైప రీత్యాలను పర్యవేక్షిం చడంలో అర్థం చేసుకోవ డంలో శాస్త్రవేత్తలకు సహాయం చేయడమే ఈ మిషన్ లక్ష్యం.ఈ ఉపగ్రహం బరువు దాదాపు 2,800 కిలోలు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి డ్యూయెల్‌ఫ్రీక్వెన్సీ రాడార్తో భూమిని పరిశీలించే ఉపగ్రహం. సముద్రంపై మంచు కదలికల పరిశీలన అటు అంటార్కిటిక్ పోలార్ స్టేషన్ల చుట్టూ ఉన్న సముద్రాల మీద ఉండే లక్షణాలు పరిస్థితులను పర్యవేక్షిస్తుంది. మరోవైపు పర్యావరణ వ్యవస్థలు, వృక్ష సంపద, జీవవైవిధ్యం, భూగర్భ జలాలు, సముద్ర మట్టం ఇస్రో ప్రయోగ వాహనం నిస్సార్ ఉపగ్రహాన్ని 98.40 వంపుతో 743 కిలోమీటర్ల సూర్యసమకాలిక కక్ష్య (ఎస్‌ఎస్‌ఓ)లోకి ప్రవేశపెట్టింది. ఎస్‌ఎస్‌ఓ అనేది ఒక ధ్రువ కక్ష్య. ఇక్కడ ఒక ఉపగ్రహం ప్రతిరోజూ అదే స్థానిక సౌర సమయంలో భూమిపై ఏదైనా ఇచ్చిన బిందువుపై వెళ్తుంది. నిరంతర ప్రకాశం కోసం సూర్యు డికి సంబంధించి స్థిరమైన కోణాన్ని నిర్వహిస్తుంది. ఇమేజింగ్ లేదా ఇతర సమయసున్నితమైన పనులకు ఇది అవసరం. నిసార్ మిషన్.. నాసా, ఇస్రో మధ్య సమాన భాగస్వామ్యం కలిగిఉన్నది. ఇది నాసా, ఇస్రో మధ్య మొదటి హార్డ్వేర్ సహకారాన్ని సూచిస్తుంది. అంతరిక్ష సంస్థ రాడార్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ టె క్నాలజీ, శాస్త్రీయ పరికరాలను అందిస్తోంది. ఇస్రో అంతరిక్ష నౌక, ప్రయోగ వాహనం, కార్యాచరణ మద్దతును అందిస్తోంది అని శాస్త్రవేత్తలు తెలిపారు. షార్ డైరెక్టర్ రాజరాజన్ మాట్లాడుతూ ఈ ప్రయోగం ఒక అద్భుతమని, ప్రపంచ దేశాలు ఇక భారత వైపు చూస్తాయన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు అందరికీ కతజ్ఞతలు తెలిపారు. ఎస్.ఉన్ని కష్ణన్ నాయక్ డైరెక్టర్ విఎస్ఎస్‌సి మాట్లాడుతూ ఈ ప్రయోగం ఒక చారిత్రాత్మక ప్రయోగమని ఇది ఇస్రో ,నాసా, శాస్త్రవేత్తల కషి ఫలితం అని తెలిపారు. ఈ ప్రయోగం విజయవంత ఆమనడంతో సులూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయ్ శ్రీ, శ్రీ సిటీ ఎండి రవీంద్ర సన్నారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, కొండేపాటి గంగా ప్రసాద్, తదితరులు ఇస్రో, నాసా, శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

## ఇడి దాడులు
(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించింది. కళ్యాణ్ కుమార్, తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ సిఇఒ సబావత్ రామ్‌చందర్, ఇతర అధికారులతో కలిసి నకిలీ లబ్ధిదారుల పేరిట భారీగా నిధులను దారి మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో గత 2024 ఫిబ్రవరి 22న కెమెరెడ్డి వెటర్నరీ హిస్పిటల్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ రవి, మేడ్చల్ పశుసంవర్థక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆధిత్య, రంగారెడ్డి జిల్లా గ్రౌండ్ వాటర్ ఆఫీసర్ రఘుపతిరెడ్డి, వైయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ గణేష్‌ను, 2024 మే31న తెలంగాణ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సిఇఒ, మాజీ టిజిఎస్‌జిడిసిఎఫ్ ఎండి సబావత్ రాంచదర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఒఎస్‌డి కళ్యాణ్‌కుమార్‌లను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఎసిబి నమోదు చేసిన ఈ కేసుపై ఇడి కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుంది. ఈ క్రమంలోనే ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) కింద కేసును నమోదు చేసి, ఆర్థిక లావాదేవీలను ఇడి పరిశీలిస్తోంది. ఈ స్కీంలో భారీగా నిధులు నకిలీ ఖాతాలకు బదిలీ అయినట్టు ఎసిబి గుర్తించింది. ఇందులో కళ్యాణ్ కీలక పాత్ర పోషించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే తలసాని ప్రత్యేక అధికారి కావడంతో ఆయనకు కూడా ఏమైనా ఈ స్కామ్ లో ఏమైనా సంబంధం ఉందా అని ప్రజలు అనుమానిస్తున్నారు.

## కొద్దిగే అర్థమయ్యింది
(మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రి ఇందిరాగాంధీని స్ఫూర్తిగా తీసుకుని ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడిని ఎదిరించాలని సూచించింది. ఆయనకు, హౌడీ మోడీకి మధ్య ఉన్న టారిఫ్ అంతా చాలా తక్కువ అని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ తన 'ఎక్స్' పోస్ట్‌లో ఎద్దేవా చేశారు. భారతదేశంపై అమెరికా అధ్యక్షుడు చేసిన అవమానాలపై ప్రధా ని మోదీ మౌనంగా ఉన్నాడని, ఆపరేషన్ సిందూర్‌ను తానే ఆపానని 30సార్లు ట్రంప్ మాట్లాడినా ఖండించకపోవడంతో ఆయన ఏకంగా పాకిస్థాన ఆర్మీచీఫ్‌కు ప్రత్యేక విందు ఇచ్చారని జైరామ్ రమేష్ చెప్పారు. అంతేకాకుండా పాకిస్థాన్‌కు అమెరికా మద్దతుతో అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్‌నుంచి ఆర్థిక ప్యాకేజీలు దక్కాయన్నారు. ప్రధానమంత్రి మోదీ ఇప్పటికైనా మాజీ ప్రధాని ఇందిరాగాంధీని స్ఫూర్తిగా తీసుకుని అమెరికా అధ్యక్షుడికి తన వైఖరిని గట్టిగా చెప్పాలని జైరామ్‌రమేష్ డిమాండ్‌చేశారు.

## మోదీ మౌన ఫలితమే
(మొదటి పేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేయడంపై సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన ఇక్కడొక ప్రకటన విడుదల చేశారు. వాణిజ్యాన్ని పరపతిగా ఉపయోగించి భారతదేశం పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు తాను మధ్యవర్తిత్వం వహించానని డొనాల్డ్ ట్రంప్ దాదాపు 30సార్లు ప్రకటించినా బిజెపి ప్రభుత్వం మౌనంగా ఉండటాన్ని ఆయన తప్పుపట్టారు. ఇప్పుడు ట్రంప్ మరొక అడుగు ముందుకేసి, భారతదేశంపై 25 శాతం సుంకం విధిస్తున్నామని ప్రకటించాడని, దీనికి తోడు రష్యా నుండి చమురు దిగుమతులపై జరిమానాలు (పెనాల్టీలు) కూడా ఉన్నాయని చెబితే మోదీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం సిగ్గుచేటని సిపిఐ అగ్రనేత డి.రాజా ధ్వజమెత్తారు.

## 25శాతం సుంకం
(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువగా ఉందని చెప్పా రు. పైగా భారత్‌తో అమెరికా చేస్తున్న వాణి జ్యం కూడా చాలా తక్కువేననీ ట్రంప్ చెప్పారు. భారత్ ఎక్కువగా రష్యా నుండి రక్షణరంగ పరికరాలు, చమురు దిగుమతి చేసుకుంటోందని, అంతేకాకుండా భారత్–రష్యా మధ్య డబ్బుతోపనిలేకుండా గర్హనీయమైన సరుకుల మార్పిడి వ్యాపారం జరుగుతోందని విమర్శించారు. చైనా తర్వాత భారతదేశమే రష్యాతో భారీ ఎత్తున వాణిజ్యం చేస్తున్న రెండోదేశమని ట్రంప్ తప్పుపట్టారు.

అమెరికా వాణిజ్యలోటు భర్తీ చేసుకునేవిధంగా అన్ని దేశాలతో ఇకమీదట పరస్పర సమానస్థాయీ టారిఫ్‌లు అమలులోకి వస్తాయని ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన ట్రంప్ ప్రకటించారు. కానీ వీటి అమలును జులై తొమ్మిదో తేదీ వరకూ 90 రోజులు వాయిదా వేశారు. తర్వాత మళ్ళీ ఈ గడుపు ఆగస్టు 1 వరకూ పొడిగించారు. కానీ భారత్ మార్కెట్లలు తమకు పూర్తిగా అందుబాటులోకి రావాలని ట్రంప్ విధిస్తున్న షరతులవల్ల చర్చల్లో ఆటంకాలు ఏర్పడ్డాయి. ట్రంప్ 25 శాతం సుంకాలు విధిస్తూ తాజా నిర్ణయం ప్రకటించారు. ఐతే డెడ్‌లైన్స్ (గడువుతేదీలు) చట్రంలో ఇరుక్కుని వాణిజ్యంలో సమస్యలు కొనితెచ్చుకోవడం ఇష్టంలేదని భారత్ చెబుతున్నది.

అమెరికా విధించే వాణిజ్య సుంకాల భారం 15 శాతం మించకూడదని భారతదేశం కోరుతున్నది. ఇందుకు పరిహారంగా అమెరికా నుండి ఆయుధాలను, అణు రియాక్టర్లను, సహజవాయువును కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని భారత్ వాగ్దానం చేసింది. అమెరికా–భారత్ మధ్య వాణిజ్య చర్చల్లో ఎలాంటి పురోగతీ లేకపోవడంవల్ల ప్రస్తుతం ఈ సంప్రదింపులు నిలిచిపోయాయని 'ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనాన్ని ఉటంకిస్తూ టాస్ వార్తా సంస్థ బుధవారం ఒక నివేదిక ప్రచురించింది. కాగా అమెరికా–భారత్ మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక ఒప్పందంపై తదుపరి ఆరో విడత విడత వాణిజ్య చర్చలు ఆగస్టు 25వ తేదీన జరుగుతాయి. ఇందుకోసం అమెరికా బృందం భారత్‌లో పర్యటిస్తుందని న్యూఢిల్లీలో అధికారులు మంగళవారంనాడు ప్రకటించారు. గతవారంలో వాషింగ్టన్‌లో రెండు దేశాలమధ్యా ఐదో విడత వాణిజ్య చర్చలు ముగిశాయి. 25 శాతం సుంకాల ప్రకటన నిర్ణయానికి ముందు,స్కాట్‌లాండ్ నుండి వాషింగ్టన్‌కు తిరిగివస్తూ, ఎయిర్‌ఫోర్స్–1 విమానంలో ట్రంప్ బుధవారం పాత్రికేయులతో మాట్లాడారు. ఈ వారంలో గనుక వాణిజ్య ఒప్పందం చేసుకోవడంలో విఫలమైతే భారతదేశం భారీస్థాయిలో 25 శాతం మేరకు సుంకాలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు.

**మళ్ళీ భారత్–పాక్ యుద్ధ ప్రస్తావన**

భారత్–పాకిస్థాన్ యుద్ధం గురించి ట్రంప్ మళ్ళీ ప్రస్తావించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆయన మిత్రుడుగా అభివర్ణించారు. "మీకు తెలుసు, నా విజ్ఞప్తి మేరకు వాళ్ళు పాకిస్థాన్‌తో యుద్ధాన్ని ఆపేశారు, అది చాలా గొప్ప విషయం, అదేవిధంగా పాకిస్థాన్ కూడా...మేం చాలా చేశాం, ఎన్నో గొప్ప పరిష్కారాలు సాధించాం, ఈమధ్య కాంబోడియా–థాయల్‌లాండ్‌లో కూడా మేం పరిష్కారం చేశాం, మీకు తెలుసు" అని ట్రంప్ అన్నారు. వాణిజ్యాన్ని ఆయుధంగా ఉపయోగించి వారిమధ్య యుద్ధాన్ని ఆపానని ట్రంప్ మరోసారి చెప్పారు. ఏ ఇతరదేశమూ వసూలు చేయనంతగా అమెరికా నుండి భారత్ ఇప్పటివరకూ దిగుమతి సుంకాలు వసూలు చేసిందని ఆయన అన్నారు. ఇప్పుడు తాను అధికారంలోకి వచ్చినందువల్ల ఇకమీదట అలా వీలుకాదని కూడా అన్నారు. "నా ఉద్దేశం ప్రకారం పలు దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చాలా బాగా జరుగుతున్నాయి, ప్రతిఒక్కరూ ఆశాభావంతోనే ఉన్నారు, భారత్ మార్కెట్‌లో కొన్ని అమెరికా వస్తువులను ఎలాంటి టారిఫ్‌లూ లేకుండా అనుమతించమని కోరుతున్నాం" అన్నారు.

భారీ సుంకాలు ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో, ఒప్పందం జరగకపోతే భారత్‌పై భారీ సుంకాలు విధిస్తారా? అని పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు, "ఔను, నేనూ అలాగే అనుకుంటున్నాను" అన్నారు. "వారు 25 శాతం సుంకాలు చెల్లిస్తారు" అని ట్రంప్ అన్నారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిందా? అని విమాన ప్రయాణంలో పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు ఇంకా ఒప్పందం కుదరలేదని ట్రంప్ చెప్పారు. స్కాట్‌లాండ్‌లోని తన సొంత గోల్ఫ్‌కోర్స్ లగ్జరీ భవంతిలో గడిపిన ట్రంప్ కొన్ని అధికార కార్యక్రమాలు కూడా నిర్వహించారు. స్కాట్‌లాండ్‌లో తన కొత్త గోల్ఫ్‌కోర్సును కూడా ఆయన ఈ సందర్భంగా ప్రారంభించారు. గోల్ఫ్ ఆటలు ఆడారు. ప్రైవేటు టూర్ కార్యక్రమం కింద ఆయన స్కాట్‌లాండ్ వెళ్ళి తిరిగివస్తూ భారత్‌పై విధించాలనుకుంటున్న సుంకాల విషయం పాత్రికేయులతో చెప్పారు.

**సుంకాల ప్రభావంపై అధ్యయనం చేస్తున్నాం : భారత్**

భారత్‌పై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంపై భారత్ స్పందించింది. ట్రంప్ ప్రకటించిన సుంకాల ప్రభావం ఏ మేరకు ఉంటుందనేదానిపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపింది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. రైతులు, వ్యాపారవేత్తలతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## జోగులాంబ దేవాలయ అభివృద్ధికి రూ.382.5కోట్లు : మంత్రి కొండా సురేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్: అలంపూర్ జోగులాంబ దేవాలయాన్ని సమగ్రం గా అభివృద్ధి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ దేవాలయాన్ని మూడు విడతల్లో అభివృద్ధి చేస్తున్నామని, మొత్తం రూ. 382.5కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం జోగులాంబ ఆలయ మాస్టర్ ప్లాన్‌పై ఎండోమెంటు ఉన్నతాధికారులతో మంత్రి సురేఖ, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎండోమెంటు డిపార్టుమెంటు ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకటరావు, తెలంగాణ ధార్మిక్ అడ్వైజర్ గోవింద హరి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ...కృష్ణ తుంగభద్ర నదుల సంగమ ప్రాంతంలో జోగులాంబ శక్తి పీఠం ఉందని... ఈ టెంపుల్ ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## అందరు కలిసి పనిచేయడమే...
# మానవ అక్రమ రవాణా మాఫియాకు అడ్డుకట్ట

మంత్రి సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్: మానవ అక్రమ రవాణాను నిరోధించే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. రెడ్ హిల్స్‌లోని ఫ్యాప్సీ భవనంలో అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రజ్వల ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా వెనుక పెద్ద మాఫియా ఉంటుందని, ఆ మాఫియా గురించి మాట్లాడాలంటే సామాన్యులు భయపడతారన్నారు. అలాంటిది ప్రాణాలకు తెగించి మానవ అక్రమ ముఠాపై పోరాటం చేస్తున్న ప్రజ్వలందరికీ స్ఫూర్తిదాయకం అని తెలిపారు. మహిళల శరీరాలతో వ్యాపారం చేసే దుర్మార్గులు సమాజంలో ఉన్నారని, పిల్లలతో వ్యాపారం చేసే ఆస్తులు కూడ పెట్టే వారికి తల్లి, అక్క, చెల్లెలు లేరా? అని ప్రశ్నించారు. ఇంట్లో మహిళలను పెట్టుకుని, ఇతర మహిళలతో వ్యాపారాలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. మహిళా భద్రత కోసం తమ కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళల్లో ఉండే పేదరికం నిర్మూలించేందుకు సెర్ప్ ద్వారా ఎస్హెచ్‌జి కార్యక్రమాలను చేపట్టాం, వేల కోట్ల మేర బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పించామని, వారి వడ్డీలను కూడా బ్యాంకులకు ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. మహిళా సంఘ సభ్యురాళ్లకి 10 లక్షల ప్రమాద బీమా, రెండు లక్షల లోన్ బీమా అమలు చేస్తున్నామని అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘం అంటే కేవలం ఆర్థిక స్వావలంబనే కాదు అది మహిళల్లో సామాజిక భద్రతను, మానసిక ధైర్యాన్ని కలిగిస్తోందన్నారు. మానవ అక్రమ రవాణాపై సమిష్టి పోరాటం చేయడం ద్వారా ఈ భూతాన్ని అంతం చేయవచ్చున్నారు. అన్ని విద్యాసంస్థల్లో లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా పై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. శిక్ష తోపాటు శిక్షణ ఇవ్వడం ద్వారా మహిళల పై నేరాలను అరికట్టవచ్చున్నారు. ప్రజ్వల ఫౌండేషన్ ఛైర్మన్ సునీత కృష్ణన్ 32వేల మంది అమ్మాయిలు, మహిళలని వ్యభిచార కూపం నుంచి విముక్తి కల్పించారని అన్నారు. ఆమె బాటలో అమ్మాయిలు మహిళల కోసం పనిచేసే స్వచ్ఛ ఆరుగురు ప్రముఖులను ఈ సందర్భంగా మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ సర్వీస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ సిహెచ్.పంచాక్షరి, అడిషనల్ డిజిపి మహేష్ భగవత్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ
# వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఆగస్టు 15న గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో బుధవారం సీనియర్ అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నివాళులు అర్పించనున్నారని, అనంతరం చారిత్రక గోల్కొండ కోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారని, అందుకు కావాల్సిన ఏర్పాట్లపై అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని, ఈ కార్యక్రమానికి ప్రముఖులు హాజరవుతున్న సందర్భంగా తగిన భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా తెలంగాణ శాసనసభ, హైకోర్టు, రాజ్‌భవన్, సచివాలయం, తెలంగాణ తల్లి విగ్రహాలు వంటి ప్రముఖ ప్రభుత్వ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. గోల్కొండ కోటలో జరిగే అధికారిక వేడుకల్లో భాగంగా రాష్ట్ర వారసత్వం, దేశభక్తిని ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని సాంస్కృతిక శాఖను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను దృష్టి పెట్టుకుని అందుకు అవసరమైన అగ్నిమాపక భద్రతా సిబ్బంది, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అగ్నిమాపకశాఖ అధికారులను ఆదేశించారు. వేడుకలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిజిపి డాక్టర్ జితేందర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ

(కేంద్ర చట్టము 30/2013 యొక్క సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర రూల్ 25 (1) అనుసరించి కలెక్టర్ / అదనపు కలెక్టర్ / రాజస్వ మండలాధికారి హుజూర్‌నగర్ (భూసేకరణ)

ఫారం-7 రూఢీ ప్రకటన

జిల్లా కలెక్టర్, సూర్యాపేట ఫైల్ నం. ఇ/946/2024 తేదీ: 28.07.2025
రెవెన్యూ డివిజనల్ అధికారి ఫైల్ నం. ఎఫ్/348/2024 తేదీ: 26.07.2025
హుజూర్‌నగర్
గెజిట్ నెంబర్ : 37/2025 తేదీ: 28.07.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్ట పరచిన సూర్యాపేట జిల్లాలో మట్టంపల్లి మండలం వరధాపురం గ్రామ రెవెన్యూలో సర్వే 143 & 148 లలో గల విస్తీర్ణం ఎ.3-03 1/2 కుంటలు గల భూమి ప్రజా ప్రయోజనం నిమిత్తం, అనగా సంత్ సేవాలాల్ రైల్వే స్టేషన్, రాఘవపురం లైన్ నుండి ఎన్‌సిఎల్ ఫ్యాక్టరీ మట్టపల్లి వరకు రైల్వే లైన్ ఏర్పాటు కొరకు అవసరమైనదని భావించినందున భూసేకరణ పునరావాస, పునరావాసం కల్పనలో పారదర్శకత మరియు న్యాయమైన పరిహారపు హక్కు చట్టం 2013 లోని సెక్షన్ 19(1) అనుసరించి భూసేకరణ నిమిత్తము రూఢీ ప్రకటన జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరావాస పునరావాస కల్పనకు పారదర్శకత మరియు పరిహారపు హక్కు చట్టం 2013 (తెలంగాణ సవరణ) చట్టం 2016 పొందుపరిచిన (చట్టం 21 ఆఫ్ 2017) నను అనుసరించి భూసేకరణ చట్టం 30/2013 చాప్టర్ (2) లోని సామాజిక ప్రభావ నివేదిక- 10 A అనుసరించి మినహాయించు అధ్యయన నివేదిక మరియు చాప్టర్-3 ప్రకారం ఇవ్వనైనది.

కావున సూర్యాపేట జిల్లా, మట్టంపల్లి మండలం వరధాపురం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 143 & 148 లలో గల విస్తీర్ణం **ఎ.3-03 1/2 కుంటలు** గల భూమి ప్రజా ప్రయోజనం నిమిత్తం, అనగా సంత్ సేవాలాల్ రైల్వే స్టేషన్, రాఘవపురం లైన్ నుండి ఎన్‌సిఎల్ ఫ్యాక్టరీ మట్టపల్లి వరకు రైల్వే లైన్ ఏర్పాటు కొరకు అవసరమైనదని భావించినందున ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం రూఢీ ప్రకటన జారీ చేయనైనది.

గ్రామం: వరదాపురం మండలం: మట్టంపల్లి జిల్లా: సూర్యాపేట

| క్రమ సంఖ్య | సర్వే నెంబర్ | యాజమాన్య రకము | భూమి రకము | భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి | పట్టాదారు పేరు / ఆసక్తిగల వ్యక్తుల పేరు / చిరునామా | అనుభవదారు | సరిహద్దులు తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | చెట్లు / నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | | | | 9 |
| 1 | 143/16/1 | పట్టా | మెట్ట | 0.03 | రూపవత్ సాలి భర్త బిచ్చ | రూపవత్ బిచ్చ తండ్రి గోల్యా | 143/1 | 143/3 | 143/2 | 143/1 | పైప్‌లైన్& తాటిచెట్లు |
| 2 | 143/10/2 | పట్టా | మెట్ట | 0.12 1/2 | రూపావత్ రాము తండ్రి తుల్స్యా | రూపావత్ లచ్చ తండ్రి రాము | | | | | బోర్ & పైప్‌లైన్ |
| 3 | 143 | పట్టా | మెట్ట | 0.09 | - | రూపవతు హర్య తండ్రి హర్జ | | | | | తాటిచెట్లు నిమ్మచెట్లు గుడి& సమాది |
| 4 | 143 | పట్టా | మెట్ట | 0.07 | కాలువ | కాలువ | 143/2 | 143/4 | 143/1 | 143/1 | - |
| 5 | 143 | పట్టా | మెట్ట | 0.00 1/2 | - | రూపవత్ గోపి తండ్రి గోలియా | | | | | నిమ్మచెట్లు పైప్‌లైన్ &కరెంట్ |
| 6 | 143 | పట్టా | మెట్ట | 0.09 1/2 | - | రూపవతు హర్య తండ్రి హర్జ | | | | | - |
| 7 | 143/10/1 | పట్టా | మెట్ట | 0.12 1/2 | రూపవత్ ద్వాళి భర్త రాము రూపావత్ సోమ్లా | రూపావత్ రాంలా తండ్రి హర్జ | | | | | నిమ్మ-2 బోర్ & గుడి |
| 8 | 143/10/2 | పట్టా | మెట్ట | 0.13 1/2 | రూపావత్ రామ S/o సైదా | రూపావత్ రామరావు S/o సైదా | 143/3 | 143/2 | 143/1 | 143/1 | - |
| 9 | 143/2/1 | పట్టా | మెట్ట | 0.00 1/2 | భూక్యా నక్కి భర్త బంటు | భూక్యా బంటు తండ్రి దేవా | | | | | - |
| 10 | 143/10/1 | పట్టా | మెట్ట | 0.15 1/2 | భూక్యా రామా తండ్రి బాలు | భూక్యా రామా తండ్రి బాలు | | | | | బోర్ & పైప్‌లైన్ |
| 11 | 143/2/2 | పట్టా | మెట్ట | 0.28 1/2 | భూక్యా బాలు తండ్రి వస్రం | భూక్యా బాలు తండ్రి వస్రం | | | | | గుడి & పైప్‌లైన్ |
| 12 | 148/3 | [illegible] | మెట్ట | 0.01 1/2 | రూపావత్ గోపి తండ్రి గోలియా | రూపావత్ గోపి తండ్రి గోలియా | 148 | 149 | 148 | 143 | - |
| 13 | 148/6 | [illegible] | మెట్ట | 0.05 1/2 | బానోత్ దేవా తండ్రి గోలియా | రూపావత్ దేవా తండ్రి గోలియా | /1 | /2 | | | - |
| 14 | 148/3/3 | [illegible] | మెట్ట | 0.05 1/2 | రూపావత్ బిచ్చ తండ్రి గోలియా | రూపావత్ గోపి తండ్రి గోలియా | | | | | - |
| 15 | 148 | [illegible] | మెట్ట | 0.00 1/2 | - | రూపావత్ లచ్చ తండ్రి రాము | | | | | - |
| మొత్తం విస్తీర్ణం | | | | 3.03 1/2 | | | | | | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూ సేకరణ పై వచ్చిన అభ్యంతరాలు పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించుట లేదు.

ఆ భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, ప్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు (ప్రాజెక్ట్ నిర్వాహణమునకు ఉపయోగమునకు వచ్చేయుతో పాటిని స్వీకరించబడనట్లు లేనట్లు స్వీకరించబడినవి.

పై భూమిని భూ సేకరణ చేయు భూముల యొక్క నమూనా భూ సేకరణ అధికారి మరియు రాజస్వమండలాధికారి హుజూర్ నగర్ నందు కార్యాలయము పనివేళల నందు చూసుకొనవచ్చును.

సం/- భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి హుజూర్‌నగర్
సం/- అదనపు కలెక్టర్ సూర్యాపేట
సం/- జిల్లా కలెక్టర్ సూర్యాపేట

DIPR RO NO.432/LA/PP/Advt/Pub/2025-26

# సకాలంలో ఎరువుల సరఫరాపై అవగాహన

బిజెపి నేతలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హితవు

ప్రజాపక్షం/హైదరాబాద్: పంట కాలాలు, ఎరువుల కేటాయింపులు, సరఫరాలపై బిజెపి నాయకులు కనీస అవగాహన పెంచుకుంటే మంచిదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బిజెపి నేతలు చేస్తున్న రాజీనామా సవాళ్లు రాజకీయ స్వార్థంకోసం కాకుండా, ఎరువులను సకాలంలో సరఫరా చేయాలని కేంద్రంపై ఒత్తిడి పెంచేలా చేస్తే బాగుంటుందని మంత్రి తుమ్మల హితవు పలికారు. కేటాయింపుల ప్రకారం యూరియా ఇవ్వకుంటే రాజీనామా చేస్తా అంటే తెలంగాణ రైతాంగం హర్షిస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఖరీఫ్ కోసం కేటాయించిన ఎరువులను అడగుతుంటే.. రాష్ట్ర బిజెపి నాయకులు మాత్రం అరిగిపోయిన గ్రామఫోన్‌రికార్డు వేదించి 2024–25 యాసంగి గురించి మాట్లాడటం వారి అవివేకానికి అద్దం పడుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుయ్యబట్టారు. 2024–25 యాసంగికి సంబంధించిన మిగులు యూరియా 1.92 మెట్రిక్ లక్షల టన్నులు రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉన్నందువల్లే, కేంద్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ లో కేటాయింపుల ప్రకారం ఇవ్వకపోయిన కూడా మా అధికారులు ఇప్పటివరకు సర్దుబాటు చేయగలిగారని పేర్కొన్నారు. ఒక రాష్ట్రానికి బిజెపి అధ్యక్ష పదవిలో ఉంటూ, ఇలాంటి అర్థరహిత మాటలు మాట్లాడటం సరికాదన్నారు. వారికి లెక్కలు తెలియకుంటే.. తెలుసుకొని మాట్లాడాలి కాని.. ఏవరో రాసి ఇచ్చిన మాటలను మాట్లాడొద్దని హితవు పలికారు. మీ అధ్యక్ష పదవిపై మీ పార్టీ నాయకులకు చాలా మందికి కోరిక ఉందని, కావున మీ చేత ఇలాంటి మాటలు మాట్లాడించి.. రాజీనామా చేయించాలనిచూస్తున్నారని, కాని తాము మాత్రం మీరు చాలా రోజులు ఈ అధ్యక్ష పదవిలో కొనసాగాలని కోరుకుంటున్నామన్నారు. ఖరీఫ్‌లో రాష్ట్ర అత్యధిక యూరియా వినియోగం 10.48 లక్షల మెట్రిక్ టన్నులు అని, దానిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ కోసం 11.50 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా అడిగిందని, కాని రాష్ట్రం వద్ద 2024–25 యాసంగికి సంబంధించిన మిగులు యూరియా 1.92 మెట్రిక్ లక్షల టన్నులు ఉన్నందున, 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందని మంత్రి తెలిపారు. ఇందులో నెలవారిగా కేటాయింపుల ప్రకారం జూలై నెలవరకు రాష్ట్రానికి 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా ఇప్పటి వరకు సరఫరా చేసింది కేవలం 4.36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమేనని మంత్రి వెల్లడించారు. దీంతో జూలై వరకు 2.24 లక్షల మెట్రిక్ టన్నులు లోటు ఏర్పడిందన్నారు. ఖరీఫ్ మొత్తానికి రావాల్సిన యూరియా పరిమాణం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కాగా రాష్ట్రానికి అందింది 4.36 లక్షల మెట్రిక్ టన్నులు పోను రానున్న రెండు నెలల్లో 5.44 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రం రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉందన్నారు. ఇక సాకులతో అంటే విధంగా కేంద్రం పై ఒత్తిడి తీసుకురావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బిజెపి నేతలకు సూచించారు.

## ప్రభుత్వ విధానాల కారణంగా
# అయోమయంలో అంగన్‌వాడీ టీచర్లు

కరుణ కుమారి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల కారణంగా రాష్ట్రంలో ఉన్న దాదాపు 65 వేలమంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పరిస్థితి అయోమయంగా మారిందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందాని కరుణ కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. 65ఏళ్లు నిండిన తర్వాత రిటైర్ అవుతున్న అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.1లక్ష చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుండటంతో వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ టీచర్లను సర్వీసును బట్టి సూపర్‌వైజర్ పోస్టుల్లో నియమించాలని కోరారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.18వేల వేతనంతో పాటు కనీస పెన్షన్ రూ.5వేలు ఇవ్వాలని, సెంటర్ అద్దెలు, గ్యాస్, ఆరోగ్య లక్ష్మి బిల్లులు ప్రతినెలా చెల్లించాలన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో 1000పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ స్కూల్స్ నిర్వహించాలని రూ.33కోట్లు కేటాయించడం అదే విధంగా నాలుగేళ్ళు నిండిన చిన్నారులను మాత్రమే ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్చుకోవాలి అనే నిబంధనలు అంగన్‌వాడీ కేంద్రాలకు, నూతన విద్యా విధానం మధ్య తేడాలు సృష్టిస్తున్న సమాచారం లేక అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూల్స్‌గా మార్చే టీచర్లను, ఆయాలను మొదటి ప్రాముఖ్యతగా తీసుకోవాలని ఆవసరం ఉందన్నారు. 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తూ వీటికి పోటీగా తాత్కాలిక పద్ధతిలో ఒక టీచర్, ఒక ఆయాను నియమించడం సరికాదన్నారు. ఇందుకు బదులుగా అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు వేతనాలు పెంచి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, భవిష్యత్ పోరాటాలకు సిద్ధంగా ఉన్నారని కరుణ కుమారి హెచ్చరించారు.

# దొడ్డ పద్మకు అంతిమ వీడ్కోలు

## పలువురు సిపిఐ నాయకుల సంతాపం



ప్రజాపక్షం/కోదాడ: హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే దొడ్డ నర్సయ్య సతీమణి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు కామ్రెడ్ దొడ్డ పద్మ ఆకస్మికంగా సాధించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం చిలుకూరులో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధురాలు దొడ్డ పద్మ మృతదేహం వద్ద నివాళులర్పించి ఆమె అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కొరియర్‌గా సేవలు అందించిన ఘనత దొడ్డ పద్మ అని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సమయంలో తన భర్త దొడ్డ నర్సయ్యతో కలిసి నల్లమల అడవుల్లో మూడేళ్లపాటు అజ్ఞాతవాసం చేసిన మహోన్నత వ్యక్తి దొడ్డ పద్మ అన్నారు. సిపిఐ నాయకులు దొడ్డ నర్సయ్య స్ఫూర్తిగా, ఆదర్శంగా తీసుకుని ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. ఆమె మరణం సిపిఐ పార్టీకి తీరనిలోటు అన్నారు. ఆమె సేవలను కొనియాడారు. అనంతరం చిలుకూరు గ్రామంలో కామ్రెడ్ దొడ్డ పద్మ అంత్యక్రియలు ఘనంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా ఆమె అంత్యక్రియల్లో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల నాయకులు పాల్గొని సంతాపం తెలియజేశారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, కోదాడ, మునుగోడు మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, ఉజ్జిని యాదగిరిరావు, ఏఐటియుసి రాష్ట్ర నాయకుడు ఉజ్జిని రత్నాకర్, పార్టీ జాతీయ నాయకులు పశ్య పద్మ, పోటు కళావతి, సిపిఐ సూర్యాపేట, ఖమ్మం జిల్లాల కార్యదర్శులు బెజవాడ వెంకటేశ్వర్లు, దండి సురేష్, రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యల్లావుల రాములు, ధనుంజయనాయుడు, మేకల శ్రీనివాసరావు, పద్మ సోదరుడు బొబ్బ కృష్ణారెడ్డి, ఏసికె ఖదీర్, బత్తిని హనుమంతరావు, దేవరం మల్లేశ్వరి, గుండు వెంకటేశ్వర్లు, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు కొండా కోటయ్య, దొడ్డ వెంకటయ్య, రేమిడాల రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్తవరపు పాండురంగారావు, వేనేపల్లి వెంకటేశ్వర్లు, బుర్రి శ్రీరాములు, వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

## సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా దామోదర్ రెడ్డి



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా యానాల దామోదర్ రెడ్డి ఎన్నికైనారు. సహాయ కార్యదర్శులుగా బోలగాని సత్యనారాయణ, చేదే చంద్రయ్య ఎన్నికయ్యారు. వలిగొండ మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా 4వ మహాసభలో 17 మంది కార్యవర్గ సభ్యులను, 45 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభల్లో జిల్లాలోని ప్రధాన సమస్యలపై చర్చించి 15 తీర్మానాలు చేశామని, తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని రాష్ట్ర నాయకత్వం ప్రకటించారని యానాల దామోదర్ రెడ్డి తెలిపారు.

# ధర్మస్థల ఘటనపై ప్రత్యేక బృందంతో విచారణ

మహిళా సంఘాల నేతలు డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్:ధర్మస్థల ఘటనపై నిష్పక్షపాతమైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆధ్వర్యంలో అన్ని కోణాలలోనూ దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. జాతీయ మహిళా కమిషన్ చొరవ తీసుకొని ధర్మస్థల లో నిజనిర్ధారణ చేయాలని, బాధిత కుటుంబాలకు సరైన న్యాయం, పునరావాసం, ప్రభుత్వ పరంగా మద్దతు లభించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ లోని రాజ్ బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో బుధవారం భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్‌ఐడబ్ల్యు) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ధర్మస్థల ఘటనపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఎం.సదా లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా మహిళా సమాఖ్య జాతీయ సహాయ కార్యదర్శి డాక్టర్ కె.రజని, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, గ్రామీణ మహిళా ఫోరం కన్వీనర్ ప్రేమపావని, ఎన్.ఛాయాదేవి, కృష్ణకుమారి, పడాల నళిని, ఐద్వా ఆశా లత, సామాజిక కార్యకర్త ఖలీదా పర్వీన్, ఓఐడబ్ల్యు అనసూర్య, సిఎంఎస్ జ్యోతి, తిరుమల, నవీతల హాజరయ్యారు. ఈ సందర్భంగా రజని మాట్లాడుతూ ఇటీవల కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థల పుణ్యక్షేత్రంలో వెలుగులోకి వచ్చిన ఘటన సమాజాన్ని తీవ్రంగా కలచివేస్తోందన్నారు. గతంలో అక్కడ స్వచ్ఛతా (పారిశుద్ధ్య) కార్మికుడిగా పనిచేసిన వ్యక్తి స్వయంగా పోలీస్ స్టేషనుకు వెళ్లి 1995 నుండి 2014 మధ్య వందమందికి పైగా హత్యకు గురయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసిన వరకు కూడ స్థానిక పోలీసులు ఇతర ప్రభుత్వ యంత్రాంగం పనిగట్టలేకపోవడం దారుణమన్నారు. ఈ దారుణ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని మానవ హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఇందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హత్యకు గురైనవారిలో కొంతమందిపై లైంగికదాడులు జరిగినట్టుగా ఫిర్యాదు చేసిన వ్యక్తి ఆరోపించిన నేపథ్యంలో దీనిపై సమగ్ర డిమాండ్ చేపట్టాలని మహిళా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అదేవిధంగా ధర్మస్థలలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకోవాలన్నారు. తెలంగాణ నుండి మహిళా సంఘాలతో కూడిన నిజ నిర్ధారణ కమిటీ ధర్మస్థలకు వెళ్లనుందని తెలిపారు.

## బిసిలతో బిసిల రిజర్వేషన్ల పెంపు సాధ్యం కాదు

ప్రజాపక్షం/హైదరాబాద్: బిసిలకు రిజర్వేషన్లను పెంచని బిజెపి, బిసి వ్యక్తిని ఎలా ముఖ్యమంత్రి చేస్తుందని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ ప్రశ్నించారు. జిఒ, ఆర్డినెన్స్ ద్వారా బిసిల రిజర్వేషన్ల పెంపు సాధ్యం కాదన్నారు. రాజ్యాంగం 243డి ని సవరిస్తే బిసిల రిజర్వేషన్లు పెంచవచ్చని, మోదీకి చిత్తశుద్ధి ఉంటే ఆ పని చేయవచ్చని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వినోద్ కుమార్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల పెంపు విషయంలో సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ లో ధర్నా చేయాల్సిన అవసరం లేదని, రాహుల్ గాంధీతో మాట్లాడి ప్రధాని మోదీపై ఒత్తిడి పెంచాలని, సిఎం తన వెంట రాహుల్‌ను తీసుకుని మోదీ వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ఇటీవల సిఎం రేవంత్ రెడ్డి పంపిన బిల్లులను పార్లమెంటులో ఆమోదించాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ ఇద్దరూ తలుచుకుంటే పార్లమెంట్ లో ఏ బిల్లునైనా ఆమోదించవచ్చన్నారు. ప్రతిపక్షనాయకునిగా రాహుల్ గాంధీ పార్లమెంటులో బిసి రిజర్వేషన్ల ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టవచ్చని ఆయన చెప్పారు. ఒక అంశంపైన బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు ఆర్డినెన్స్ ఆమోదానికి నోచుకోదని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చనిదే రిజర్వేషన్ల పెంపు సాధ్యం కాదని వినోద్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమభరత్ కుమార్, లీగల్ సెల్ ప్రతినిధులు జక్కుల లక్ష్మణ్, సి.కళ్యాణ్ రావులు పాల్గొన్నారు.


మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం - రామాయంపేట

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

1) e-NIT No.s: E1/MCR/S/D of Fogging Machines, Autos, Home Stead Plants and Engage of JCB, Labours/under MGF/15th FCG Tide Grants/GB 2025

పనుల సంఖ్య: 4 పని.లు, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 31.07.2025న ఉ.10.30గం.లకు, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది: 02.08.2025న సా.5.30గం.ల వరకు, ప్రైస్ బిడ్ ప్రారంభ తేది (ఫైనాన్షియల్ బిడ్ ప్రీ): 02.08.2025న సా.5.35గం.లకు. గమనిక: టెండర్ గురించి పూర్తి వివరాలకు tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఇతర సమాచార కోసం కమిషనర్ & ఇంజనీర్, రామాయంపేట మున్సిపాలిటీ వారిని సంప్రదించవచ్చు. ఫోన్ నెం. 7989695428, 9948296849.

సం/- కమిషనర్, రామాయంపేట మున్సిపాలిటీ.

DIPR R.O. No.: 5779-PP/CL/ADVT/1/2025-26, Date: 30-07-2025



# జనరల్

STATE & REGIONAL NEWS

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగిస్తూ లోక్‌సభ తీర్మానం

**న్యూఢిల్లీ:** మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగిస్తూ లోక్‌సభ బుధవారం ఒక తీర్మానం ఆమోదించింది. ఈ తీర్మానం ప్రకారం మణిపూర్‌లో మరో ఆరునెలలపాటు రాష్ట్రపతి పాలన అమలులో ఉంటుంది. ఈ చట్టబద్ధమైన తీర్మానంపై జరిగిన కొద్దిపాటి చర్చకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం చెబుతూ, గడచిన నాలుగు నెలలుగా మణిపూర్‌లో ఎవ్వరూ మరణించిన దాఖలాలు లేవని చెప్పారు. మణిపూర్‌లో శాంతి నెలకుని ఉందని, శాంతి భద్రతల పరిస్థితి ఎంతో అదుపులో ఉందని ఇప్పటివరకూ ఘర్షణ పడిన రెండు జాతుల ప్రజా నాయకులమధ్య వైరుధ్యాలను పరిష్కరించేందుకు శాంతి యత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. దీనిపై స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ, ఈ ఏడాది ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారనీ, ఏప్రిల్ రెండో తేదీన సభ దీనికి ఆమోదం తెలియజేసిందని చెప్పారు.

## బెట్టింగ్‌ల జోలికి వెళ్లకండి..

### యువతకు సినీ నటుడు ప్రకాష్‌రాజ్ పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోలికి వెళ్లి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని..యువతకు సినీ నటుడు ప్రకాష్‌రాజ్ పిలుపునిచ్చారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో ఇడి అధికారుల నోటీసుల అందుకున్న విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ బుధవారం హైదరాబాద్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. ఈ మేరకు అధికారులు ఆయనను దాదాపు 5 గంటల పాటు సుదీర్ఘంగా విచారించారు. విచారణ ముగిసిన అనంతరం ప్రకాశ్ రాజ్ మీడియాతో మాట్లాడుతూ.. అధికారులు అడిగిన ప్రతి ప్రశ్నకు బాధ్యత గల పౌరుడిగా సమాధానాలు చెప్పానని పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్స్ కంపెనీలతో ఇప్పటి వరకు ఒక్క నగదు లావాదేవీ కూడా తాను చేయలేదని స్పష్టం చేశారు. ఇప్పటికే తనను అధికారులు ఐదు గంటల పాటు అన్ని విషయాలపై విచారించారని.. మళ్లీ తనను విచారణకు రమ్మని చెప్పలేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో బెట్టింగ్ యాప్లకు ప్రచారం చేయబోనని స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత ఆన్లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లొద్దని.. కష్టపడి సంపాదించడం ఎలాగో నేర్చుకోవాలని ప్రకాశ్ రాజ్ స్టేట్మెంట్ ఇచ్చారు. కాగా, ఇదే కేసులో ప్రకాశ్ రాజ్తో పాటు మరికొందరు సినీ ప్రముఖులకు ఇడి అధికారు లు నోటీసులు జారీ చేశారు. నోటీసుల అందుకున్న వారిలో దగ్గుబాటి రానా, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి తదితరులు ఉన్నారు. వాస్తవానికి దగ్గుబాటి రానా ఈనెల 23 విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. తనకు షూటింగ్ షెడ్యూల్ ఉందని, అందుకే విచారణకు హాజరు కాలేకపోతున్నాన ని వారికి సమాచారం అందజేశాడు. తనకు మరింత ఇవ్వాలని రానా అధికారులను రిక్వెస్ట్ చేశారు. అందుకు స్పందించిన ఇడి ఆగస్టు 11న విచారణకు హాజరు కావాలంటూ తాజాగా మరో నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే.

## ఎకరం రూ.65.34కోట్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డు కాలనీలోని ఓపెన్ ఫ్లాట్లకు మరోసారి రికార్డు స్థాయి ధర పలికింది. కెపిహెచ్ బి 4 ఫేజ్‌లోని ఫ్లాట్ నంబర్ 1 కు చెందిన ఒక ఎకరం విస్తీర్ణంలోని కమర్షియల్ ఓపెన్ ల్యాండ్ ను రూ.65.34 కోట్లకు కొనుగోల చేశారు. పూర్తి పారదర్శక విధానంలో హౌజింగ్ బోర్డు భూములను 'ఈయాక్షన్ ' ప్రక్రియ ద్వారా ఆన్ లైన్ లో బుధవారం విక్రయించింది. ఆన్ లైన్ ద్వారా వేలం పాట నిర్వహించడంతో బిడ్డర్ల వివరాలు చివరి నిమిషం వరకు ఎవరికీ తెలియలేదు. బిడ్డర్లు స్వేచ్ఛగా ధరను కోట్ చేసే అవకాశం లభించడంతో ఎకరం ధర రికార్డు స్థాయికి చేరిందని, ఈ స్థలానికి సంబంధించిన వేలం పాటకు మొత్తం 11 బిడ్లు దాఖలు కాగా, నాలుగు బిడ్డర్లు వేలం పాటలో పాల్గొన్నారని హౌజింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి.గౌతం తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్ అక్కౌంటెన్సీ ఆఫ్ ఇండియా సంస్థ ఎకరా భూమిని రూ.65.34 కోట్లకు వేలం పాటలో కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

### రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల ద్వారా 26 కోట్లు

బండ్లగూడ నాగోల్‌లోని రాజీవ్ స్వగృహ ఫ్లాట్లను దరఖాస్తు దారులకు బుధవారం లాటరీ పద్ధతి ద్వారా కేటాయించారు. తద్వారా ప్రభుత్వానికి రూ 26 కోట్ల ఆదాయం సమకూరింది. కేవలం మధ్యతరగతి వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా అందుబాటులోని ధరలతో ఈ ఫ్లాట్లను తక్కువ ధరలతో విక్రయించినట్టు హౌజింగ్ బోర్డు తెలిపింది. 159 ఫ్లాట్లకు దరఖాస్తులను ఆహ్వానించగా, ఇందులో మొత్తం 131 ఫ్లాట్లను లాటరీ ద్వారా కేటాయించారు. దీంతో హౌజింగ్ బోర్డ్‌కు రూ 26 కోట్ల ఆదాయం వచ్చింది.

## విజయవంతమైన 'కవచ్-4.0'

### మధురా— కోటా సెక్షన్‌లో ప్రయోగం

### దేశవ్యాప్తంగా ఆరేళ్లలో దశలవారీగా ఏర్పాటు: రైల్వే మంత్రి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో రైలు ప్రమాదాలను పూర్తిగా నిరోధించేందుకు స్వదేశీ పరిజ్ఞానంతో మరింత అభివృద్ధి చేసిన ''కవచ్4.0'' ఆటోమెటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ (ఎటిపి)ను ఢిల్లీముంబయి ప్రధాన రూట్లోని మధురాకోటా మార్గంపై విజయవంతంగా అమలు చేశారు.ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వీని వైష్ణవ్ మాట్లాడుతూ.. 'కవచ్ 4.0' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ (ఎటిపి)నుఇది భారతీయ రైల్వేల్లో సాంకేతిక ఆధారిత రైలు సురక్షణ వ్యవస్థల్లో మైలురాయిగా నిలిచిందని అన్నారు. కవచ్ ప్రయోగంపై ఆయా దేశాలు 20–30 సంవత్సరాలు తీసుకున్న రైలు సురక్షణ సాంకేతిక వ్యవస్థలను భారతదేశం కొద్దికాలంలోనే అభివృద్ధి చేసి అమలు చేయడం గర్వకారణమన్నారు. కవచ్ అనేది పూర్తిగా భారతదేశంలోనే అభివృద్ధి చేసిన ట్రైన్ సురక్షణ వ్యవస్థ అని పేర్కొన్నారు. ఇది సేఫ్టీ ఇంటిగ్రిటి లేవల్ 4 ప్రమాణానికి అనుగుణంగా రూపొందించబడిందన్నారు. ఇది మొదటి సారిగా 2018లో దక్షిణ మధ్య రైల్వేలో ఈ వ్యవస్థ అమలయ్యిందని, ఆ అనుభవాల ఆధారంగా అధునాతన వెర్షన్ అయిన కవచ్ 4.0ను రూపొందించి 2025 మేలో 160 కిమీ వేగంతో నడిచే రైళ్లకు అనుమతించామన్నారు.ఈ వ్యవస్థ వలన ఒకే లైన్‌పై ఎదురురెదురుగా వస్తున్న రైళ్లు ఆటోమెటిక్‌గా నిలిచిపోవడంతో ప్రమాదాలు తగ్గుతాయన్నారు. అలాగే ఒక రైలు పలానా వేగంతో మాత్రమే వెళ్లాలని అధికారులు సూచించినా రైలు డ్రైవర్ దానికి మించి వేగంగా నడిపిస్తే ఆటోమెటిక్‌గా ఆ రైలు వేగం తగ్గుతుందన్నారు. అలాగే సిగ్నలింగ్ వ్యవస్థ మొత్తం కవచ్ వ్యవస్థలో భాగంగా పనిచేస్తుందన్నారు. తక్కువ దృష్టిమార్గం ఉన్నప్పుడు (ఫాగ్ వాతావరణం) లోకో పైలట్ సిగ్నల్ వివరాలు క్యాబిన్‌లోనే అందుబాటులో ఉంటాయన్నారు.

## జడ్చర్ల బైపాస్ ఏర్పాటుకు కేంద్రమంత్రి హామీ



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో బైపాస్ ఏర్పాటు చేయాలని మహబూబ్ నగర్ ఎంపి డికే అరుణతో కలిసి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనుపల్లి అనిరుధ్ రెడ్డి కేంద్ర రవాణా శాఖ మంత్రివర్యులు నితిన్ గడ్కరీని న్యూఢిల్లీలోని వారి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం మహబూబ్ నగర్, జడ్చర్లలలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, జడ్చర్ల బైపాస్ పూర్తి అయితే ట్రాఫిక్ సమస్యలు తొలిగి పోతాయని కేంద్ర మంత్రికి వివరించారు. వెంటనే ఆయన సానుకూలంగా స్పందించి వ చ్చే బడ్జెట్‌లో కేటాయింపులు చేయిస్తామని హామి ఇచ్చారని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

# పిల్లలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన

### రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్ మండలంలోని గుమ్మడివల్లి ఫారెస్ట్ ఏరియాలో సీడ్ బాల్స్ వేసే కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పిల్లలకు చిన్నతనం నుండే ప్రకృతి పట్ల, పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కలిగించాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్ మండలంలోని గుమ్మడివల్లి ఫారెస్ట్ ఏరియాలో సీడ్ బాల్స్ వేసే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండ సురేఖ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని, విద్యార్థులకు విద్యార్థి దశ నుండే పర్యావరణ సంరక్షణ పై,పచ్చదనం వలన కలిగే ప్రయోజనాల పై అవగాహన కలిగించాలని చెప్పారు. సీడ్ బాల్ తయారీ పురాతన కాలం నాటిదని,జపాన్ లో సీడ్ బాల్ తయారీ విధానం ఉండేదని,విత్తన బంతులను బంక మట్టి, కంపోస్ట్ వంటి వాటితో కలిపి బంతులుగా తయారు చేస్తారని, అడవులలోని ఖాళీ ప్రదేశాలలో,మనుషులు, వాహనాలు వెళ్లని ప్రాంతాల్లో ఈ విత్తన బంతులను విసిరితే చాలు వాటిలో ఉన్న విత్తనాలు మొలకెత్తుతాయని మంత్రి గుర్తు చేశారు. ఇది సహజంగా మొక్కలు పెరిగేలా చేస్తుందని,రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం ఉండదు, వాటికవే మొక్కలు మొలకెత్తుతాయని మంత్రి కొండా సురేఖ వివరించారు. రాష్ట్రమంతట పచ్చదనం పెంపొందించేలా ప్రతి ఒక్కరూ చెట్లను నాటలని,చెట్లను పెంచడం ద్వారా మనల్ని మనం రక్షించుకోవడం తోపాటు జీవవైవిధ్యాన్ని కాపాడుకోగలుగుతామని తెలిపారు. ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో మొక్కలు నాటలని పిలుపునిచ్చారు.ప్రతి ఇంట్లో కనీసం రెండు మొక్కలు నాటాలని,మీ పిల్లల్లాగే నాటిన మొక్కలను సంరక్షిస్తే తెలంగాణ రాష్ట్రమంతా పచ్చదనంతో నిండిపోతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్,ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను భాగస్వాములను చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇది చాలా మంచి కార్యక్రమమని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. పర్యావరణానికి మేలు చేసే ఇలాంటి కార్యక్రమాలు అవసరం అని ఇలాంటి కార్యక్రమాల్లో అందరూ భాగస్వామ్యం కావాలని సూచించారు.అనంతరం మంత్రి విద్యార్థులతో, స్థానిక ప్రజాప్రతినిధులతో, అధికారులతో కలిసి విత్తన బంతులను గుమ్మడివల్లి ఫారెస్ట్ ఏరియాలో వేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కనసర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ప్రియాంక వర్గీస్, కందుకూరు ఆర్.డిఒ జగదీశ్వర్ రెడ్డి,జిల్లా అటవీ శాఖ అధికారి సుధాకర్ రెడ్డి,స్థానిక ప్రజా ప్రతినిధులు,పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్,ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వంట కార్మికుల పెండింగ్ బిల్లులకు సరిపడా నిధులు మంజూరు చేయాలి

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్ రాజ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) పోరాట పిలుపుకు స్పందించి ప్రభుత్వం నిధులు విడుదల మధ్యాహ్న భోజన వంటకార్మికుల అన్ని సమస్యలను పరిష్కరించాలని లేకపోతే సెప్టెంబర్ 1న నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) హెచ్చరికతో దిగివచ్చిన ప్రభుత్వం సరిపోను నిధులను విడుదల చేయకపోవడం సరికాదని సరికాదని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ అన్నారు. 3 నెలలకు గాను కేవలం రూ. 51.78 కోట్లు విడుదల చేయడం ఏమిటాని, సరిపోను నిధులతో పాటు మధ్యాహ్న బోజన కార్మికుల డిమాండ్లను సైతం పరిష్కరించాల్సిందేనని ఆయన స్పష్ట చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తి చొప్పున భరిస్తూ పాఠశాలలో 1 నుండి 10 తరగతుల విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజన పతకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ ప్రతినెల వేతనాలు, మెస్ బిల్లులు ఇవ్వడంలేదని, మరీ వారు తమ పుస్తెలను తాకట్టుపెట్టి, వడ్డీలు చెల్లిస్తూ వంట కార్మికులు వంటలు వండి పిల్లల కడుపులు నింపాలా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రూ.3వేలుగా ఉన్న వారీ వేతనాలనురూ. 10 వేలకు పెంచి ఎన్నికలముందు ఇచ్చిన హామీని సిఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, గ్యాస్, కోడిగుడ్లు వంటివి ప్రభుత్వమే పంపిణీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి నెల ప్రభుత్వం నెలవారి వంట ఖర్చుల బిల్లులను, వేతనాలను కార్మికుల అకౌంట్లలో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన వంట కార్మికులు చేసే అన్ని పోరాటాలలో ప్రత్యక్షంగా ఎఐటియుసి నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

## బిసి రిజర్వేషన్ల బిల్లును తక్షణమే ఆమోదించాలి : టి.జీవన్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం బిసిల 42 శాతం రిజర్వేషన్ల బిల్లును తక్షణమే ఆమోదించాలని కాంగ్రెస్ మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బిసి బిల్లును పంపి 4 నెలలు అవుతున్నా ఇప్పటికీ దానిని ఆమోదించకుండ కాలయాపన చేయడం సరికాదన్నారు. గాంధీభవన్‌లో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ బిసి బిల్లును కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల నిర్వహణకు సంబంధించి హైకోర్టు గడువు విధించిన నేపథ్యంలో బిసి రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తెస్తే దానిని గవర్నర్ న్యాయ పరిశీలన పేరుతో ఆలస్యం చేయడం, మరోవైపు కేంద్ర ప్రభుత్వం అవలభింస్తున్న ద్వంద వైఖరి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వం కేవలం వెనుకబడిన వర్గాల వారికి మాత్రమే రిజర్వేషన్లు కల్పిపిస్తోందని,... ఎలాంటి మతపరమైన రిజర్వేషన్లు ఇవ్వడం లేదన్నారు. సామాజిక వెనుకబాటుతనంలో హిందువులు, ముస్లింలు ఉన్నారన్నారు. ఆలాంటి వారికి రిజర్వేషన్ల కల్పించడంలో తప్పేముందన్నారు.

## వెట్టి చాకిరి విముక్తి కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు

### రాష్ట్ర సదస్సులో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను వెట్టి చాకిరీ విముక్తి రాష్ట్రంగా తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించిన కార్మికులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తుందని, ఆర్థిక సహకారం కూడా అందిస్తుందని ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి ప్రతి ఏడాది కేటాయిస్తున్న 3500 ఇందిరమ్మ ఇళ్లలో వెట్టి చాకిరి విముక్తి కార్మికులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరుతానని మంత్రి తెలిపారు. జాతీయ వెట్టి చాకిరి విముక్తి దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ, తెలంగాణ అసంఘటిత కార్మికుల సంఘం, స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు బుధవారం నగరంలో జరిగింది. సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి వెట్టిచాకిరి, అక్రమ రవాణా సంబంధిత ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ 8069434343ను ఆవిష్కరించారు. వెట్టి చాకిరిని నిషేధించి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ కొనసాగడం అత్యంత దురదృష్టకరమని, మానవత్వానికి మచ్చ అని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నుంచి ఫిబ్రవరి 9న వెట్టి చాకిరి విముక్తి దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని మంత్రి ప్రకటించారు. వెట్టి చాకిరి, మానవ అక్రమ రవాణా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని జిల్లా కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 200లకు పైగా పెట్టి చాకిరి విముక్తి కార్మికులు పాల్గొన్నారు. వారు ఎదుర్కొన్న బాధల గురించి విన్న తర్వాత ప్రముఖ నటి, బ్లూ క్రాస్ వ్యవస్థాపకురాలు అమల అక్కినేని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సమావేశంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి మాటలు తన మనసును కదిలించాయని, ఈ మహిళలకు తన పూర్తి సహకారం ఉంటుందని అమల ప్రకటించారు. కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్ మాట్లాడుతూ వెట్టిచాకిరికి పాల్పడుతున్న వ్యాపారులు, గుత్తేదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నకిలీ వే బిల్లులు.. కేషన్ ఇండస్ట్రీస్ రూ.100 జిఎస్‌టి మోసం





**ప్రజాపక్షం/హైదరాబాద్:** సరుకులు పంపించకుండానే నకిలీ సర్టిఫికెట్లతో పంపించినట్లు చూపించి, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి)ని పొందుతున్న ఘటన ఆలస్యంగ వెలుగులోనికి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వానికి జిఎస్‌టిని ఎగవేసేందుకు దొంగ దారులను ఎంచుకున్నట్టు వాణిజ్య పన్నుల శాఖ గుర్తించింది. సరుకులను సరఫరా చేయకుండానే చేసినట్టు నకిలీ సర్టిఫికెట్లతో హైదరాబాద్‌కు చెందిన ఒక సంస్థ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటిసి)ను పొందినట్టు రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ గుర్తించింది. నకిలీ లావాదేవీల ద్వారా ఆ సంస్థ రూ. 33.20 కోట్లను పొందినట్టు దర్యాప్తులో తేలింది. జాతీయ రహదారి ప్రాధికారి సంస్థ (ఎన్‌హెచ్ఎఐ) ద్వారా అందిన టోల్‌గేట్ విశ్లేషణ ద్వారా అధికారులు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం వాణిజ్య పన్నుల శాఖ పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టింది. దీంతో పలు విషయాలు వెలుగులోనికి వచ్చాయి. పన్నును ఎగవేసేందుకు కొత్త పద్ధతులను ఎంచుకున్నారని, పన్నులను ఎగవేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇటువంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని వాణిజ్యపన్నుల శాఖ హెచ్చరించింది. తనిఖీలో స్వాధీనం చేసుకున్నఖాతా పుస్తకాలను, రిజిస్టర్లను, హార్డ్‌డిస్కులను, సిసిటివి పుటేజ్‌లను అధికారులు స్వాధీనం చేసుకుని, సంస్థ డైరక్టర్లపైన కేసు నమోదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన న్యాయపరమైన పన్నుఆదాయాన్ని తప్పించేందుకు జరిగే అక్రమ చర్యలపై ప్రభుత్వం పగడ్బందీ చర్యలు తీసుకున్నదని,అన్ని రకాల పన్ను మోసాలను అడ్డుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖ కృషి చేస్తుందని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కె.హరిత తెలిపారు.

### రూ. 100 కోట్లకు పైగా విలువ చేసే బిల్లులు

హైదరాబాద్‌లోని ఎస్‌పి రోడ్‌లో ఉన్న కిషాన్ ఇండస్ట్రీస్ ఎల్ఎల్‌పి కార్పొరేట్ సంస్థకు చెందిన గోదాము సికింద్రాబాద్‌లోని బన్సీలాల్‌పేటలో ఉన్నది. మెదక్ జిల్లాలోని కలకల్ ఆటోమోటివ్ పార్క్, ముప్పిరెడ్డిపల్లి గ్రామాల్లోని తయారీ యూనిట్లపై వాణిజ్యప న్నుల శాఖ తనిఖీలు నిర్వహించారు. అయితే ఈ సంస్థ సరుకులు తరలించకుండానే భారీ విలువ కలిగిన కాపర్ సరుకుల సప్లయ్‌కి సంబంధించి పన్నులకు చెందిన బిల్లులు జారీ చేసింది. ఖాళీ వాహనాలను తెలంగాణ రాష్ట్రం నుండి మహారాష్ట్రకు పంపించగా, డాక్యుమెంట్లలో మాత్రం భారీ సరుకులను రవాణా చేసినట్టు చూపించారు. ఈ సంస్థ సమర్పించిన మోసపూరిత బిల్లుల మొత్తం విలువ రూ.100 కోట్లకు పైగా ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. కాగా జాతీయ రహదారి ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఎఐ ) ద్వారా అందిన టోల్ గేట్ డేటాను అధికారులు విశ్లేషించారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వాహనాలలో సరుకులు లేపోయినప్పటికీ 'ఈవే బిల్లుల'పై మాత్రం సరుకులతో వాహనాలు వెళ్ళినట్టు చూపించారు. దీనికి సంబంధించి ఆ సంస్థ సుమారు రూ.33.20 కోట్లు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి)ను నకిలీ లావాదేవీల ద్వారా పొందినట్టు అధికారులు గుర్తించారు. ఈ సంస్థకు సంబంధించి ఖాతా పుస్తకాలు, రిజిస్టర్లు, హార్డ్ డిస్కులు, సిసిటివి ఫుటేజ్ తదితర ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. సంస్థ డైరెక్టర్లు వికాష్ కుమార్ కిషాన్, రజనిష్ కిషాన్‌పైన క్రిమినల్ కేసు నమోదు చేయాలని వాణిజ్య పన్నుల శాఖ హైదరాబాద్‌లోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్) డిసిపికి ఫిర్యాదు చేసింది. మరో సంఘటనలో చార్మినార్ డివిజన్ పరిధిలో ఎపి 29టిఎ 7213 అనే వాహనం జూన్ 2025 నుండి నిశ్చలంగా ఉన్నప్పటికీ, దీనిని ఉపయోగించి అనేక 'ఈవే బిల్లులు' జారీ చేసినట్టు చార్మినార్ డివిజన్ మెహదీపట్నం1 సర్కిల్‌కు చెందిన డిఎస్‌టిఒ మజీద్ హుస్సేన్ గుర్తించారు. ఇది సిజిఎస్‌టి చట్టం 2017 నిబంధనలకు విరుద్ధమని, భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) సెక్షన్లు 318, 336 ప్రకారం నేరంగా పరిగనిస్తారని వివరించారు. ఈ విషయంపై సదరు వాహన యజమానిపై ఫిర్యాదు చేశారు.

## ఎపి మద్యం కేసులో వరుణ్‌కుమార్ అరెస్టు

- హైదరాబాద్‌లో రూ.11 కోట్ల నగదు స్వాధీనం
- 'మద్యం' కేసులో వెలుగు చూస్తున్న అక్రమాలు



**అమరావతి :** మద్యం కుంభకోణం కేసులో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మద్యం విక్రయాల పేరుతో అనేక దందాలు, అక్రమాలు సాగాయన్న ఆరోపణలు హల్‌చల్ చేస్తున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుంభకోణంపై సిట్ ఏర్పాటు చేయడంతో అధికారులు విచారణ వేగవంతం చేశారు. తాజాగా ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పురుషోత్తం వరుణ్‌కుమార్‌ను హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సిట్ పోలీసులు అరెస్టు చేయడం కీలక పరిణామం చోటు చేసుకుంది. అతడు ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లో రూ.11 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకోవడం చర్చనీయాంశమైంది. ఈ కేసులో ఏ1గా ఉన్న రాజ్ కేసిరెడ్డి ఆదేశాలతో వరుణ్ తదితరులు కలిసి 12 పెట్టెలలో రూ.11 కోట్లు దాచినట్లు అంగీకరించారు. శంషాబాద్ మండలం కాచారం ఫామ్ హౌస్‌లో సిట్ దాడులకు పాల్పడటంతో అట్టపెట్టెల్లో రూ.11వేల కోట్ల సొమ్ము బట్టబయలైంది. దానిని సీజ్ చేసి... విజయవాడ సిట్ కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు మెమో దాఖలు చేశారు. ఈ భారీ స్థాయిలో డబ్బు పట్టుబడటం వైసీపీ నేతలను కలవరపాటుకు గురిచేస్తోంది. ఇప్పటికే ఈ కేసులో ఆ పార్టీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టయి... రాజమహేంద్రవరం జైలులో ఉన్నారు. మరిన్ని అరెస్టులు ఉంటాయంటూ సిట్ లీకులిచ్చింది. దీనిపై వైసీపీ అధిష్టానం అప్రమత్తమైంది. వైసీపీ పీఏసీ సమావేశం రాజకీయ ఎత్తుగడలో భాగమనే వాదనలున్నాయి. ఇంతలోనే ఏ40గా ఉన్న పురుషోత్తం వరుణ్ కుమార్‌ను సిట్ పోలీసులు తమ అదుపులోకి తీసుకోవడంతో కేసు మరింత తీవ్రతరమైంది. మద్యం కుంభకోణం కేసు నమోదైన తర్వాత ఈ కేసులో కీలక వ్యక్తులు... వరుణ్‌ను దేశం దాటించేసినట్లు సమాచారం. అప్పటి నుంచి విదేశాల్లో ఉంటున్న వరుణ్‌కుమార్‌పై లుకౌట్ నోటీసుతోపాటు న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంటు జారీ చేసింది. అతడి నుంచి అనేక కోణాల్లో వివరాలు రాబట్టేందుకు సిట్ పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

### వరుణ్ కుమార్ ప్రవేశం ఇలా...

సికింద్రాబాద్‌కు చెందిన వరుణ్‌కుమార్ ఇంజినీరింగ్ చదివాడు. హైదరాబాద్‌లో ఓ కాఫీ షాపులో నెలకు రూ.32వేల వేతనంతో పని చేశాడు. ప్రవాసాంధ్రుడైన ఓ వైద్యుడి ద్వారా రాజ్ కేసిరెడ్డి బందం మద్యం కుంభకోణం ఉచ్చులోకి వరుణ్‌ను దించినట్లు సమాచారం. పుదుచ్చేరిలోని లీలా డిస్టిలరీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి వరుణ్ కుమార్‌ను ఏపీ ఆపరేషన్స్ అధిపతిగా నియమించి, అతడి పేరిట రూ.వందల కోట్లు కొల్లగొట్టింది. 2020 జూన్ నుంచి 2024 మార్చి మధ్య 21 నెలల్లో బెవరేజెస్ కార్పొరేషన్ ఈ సంస్థ ఖాతాలో ఏకంగా రూ.459 కోట్లు జమ చేసింది. ఈ వ్యాపార పరిమాణం అసాధారంగా ఉన్నట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఈ డబ్బంతా వెంటవెంటనే వేర్వేరు ఖాతాల్లోకి మళ్లిపోయిందని, వాటిని విశ్లేషించిన సిట్ అధికారులు అందులో అత్యధిక శాతం కల్పిత కంపెనీలతో నిర్వహించిన లావాదేవీలుగా గుర్తించినట్లు సమాచారం. వరుణ్‌కుమార్‌ను నిందితుడిగా చేర్చారు. విదేశాల నుంచి వచ్చిన వరుణ్‌కుమార్‌ను సిట్ తమ అదుపులోకి తీసుకుని ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. లీలా డిస్టలరీస్ ద్వారా రూ.453.97 కోట్ల వరకు మద్యం కొనుగోళ్లకు జమ కాగా రూ.62 కోట్ల వరకు ముడుపులుగా వెనక్కి వచ్చాయని సిట్ తమ తొలి ఛార్జిషీటులో ప్రస్తావించింది. ఎస్ఎన్‌జే షుగర్స్ అనుబంధ సంస్థ ఈ లీలా డిస్టలరీస్. లీలాస్ బ్రిలియెంట్ బ్లెండ్ సుపీరియర్ గ్రెయిన్ విస్కీ, బ్రిటీష్ ఎంపైర్ ప్రీమియం మెచ్యూర్డ్ బ్రాండ్లు ఇక్కడ తయారు చేయించారు. దర్యాప్తులో ఆధారాలు లభించడంతో సిట్ అధికారులు వరుణ్‌ను నిందితుడిగా చేర్చారు. తమిళనాడులోని ఎస్ఎన్‌జే షుగర్స్, ప్రొడక్ట్స్ సంస్థకు సంబంధించిన డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్‌లను రాజ్ కేసిరెడ్డి బెదిరించి వారి అనుబంధ సంస్థ అయిన లీలా డిస్టిలరీస్‌ను ఆధీనంలోకి తీసుకుని, లీలా డిస్టిలరీస్‌తో ఆథరైజేషన్ ఇప్పించి వరుణ్ కుమార్‌ను ఆ కంపెనీకి ఏపీ ఆపరేషన్స్ హెడ్‌గా నియమించారు. అతడి పేరిట బ్యాంకు ఖాతా తెరిపించి, రూ.10 కోట్ల వరకు చెక్ పవర్ కల్పించారు. సొంతంగా మద్యం తయారు చేసే కనీస మౌలిక సదుపాయాలు లేని లీలా డిస్టిలరీస్‌కు ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ నుంచి భారీగా మద్యం సరఫరా ఆర్డర్లు కట్టబెట్టారు.

### ఆ డబ్బుతో నాకు సంబంధం లేదు : కోర్టులో కెసిరెడ్డి అఫిడవిట్

సిట్ అధికారులు సీజ్ చేసిన రూ.11కోట్లతో తనకు సంబంధం లేదని, ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న రాజ్ కేసిరెడ్డి తెలిపారు. ఈ మేరకు విజయవాడ ఏసీబీ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. హైదరాబాద్‌లోని ఫామ్ హౌస్ తనది కాదని, అది తీగల విజయేందర్‌రెడ్డిదని తెలిపారు. ఆయనకు ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నాయని, రూ.కోట్ల టర్నోవర్‌తో లావాదేవీలు చేస్తారన్నారు. విజయేందర్‌రెడ్డి నిర్వహిస్తున్న ఆరెట్ ఆసుపత్రిలో నా భార్య మైనార్టీ షేర్ హోల్డర్ మాత్రమేనని, సిట్ కట్టుకథలు చెబుతూ, తనకు బెయిల్ రాకుండా చేస్తోందని కేసీరెడ్డి తెలిపారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## మధ్యప్రదేశ్‌లో 23,000 మంది మహిళలు, బాలికలు మిస్సింగ్

**భోపాల్:** మధ్యప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 23,000మంది మహిళలు, బాలికలు కనిపించడం లేదు. అత్యాచారం, మహిళలపై జరిగిన నేరాలతో సంబంధం ఉన్న 1,500 మంది నిందితులు పరారీలో ఉన్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ విషయాలను స్వయంగా అసెంబ్లీకి వెల్లడించారు. బిజెపి పాలిత మధ్యప్రదేశ్‌లో మహిళలు, బాలికలు అదృశ్యమవుతున్నారు. మహిళలపై అత్యాచార కేసులు కూడా పెరుగుతున్నాయి. మాజీ హోంమంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలా బచ్చన్ దీనిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కేసుల వివరాలను అసెంబ్లీలో కోరారు. కాగా, దీనిపై మధ్యప్రదేశ్ సిఎం మోహన్‌యాదవ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2024 జనవరి 1 నుంచి 2025 జూన్ 30 వరకు 21175 మంది మహిళలు, 1954 మంది బాలికలు అదృశ్యమయ్యారు. ఏడాదికిపైగా ఆ రాష్ట్రంలో తప్పిపోయిన మహిళల సంఖ్య 23129కు చేరుకున్నదని ఆయన వెల్లడించారు. మరోవైపు అత్యధికంగా సాగర్ జిల్లాలో 1,069 మంది మహిళలు మిస్సింగ్ అయ్యారు.

## ఏడోరోజూ పార్లమెంట్ మకరద్వారం వద్ద

# ప్రతిపక్షాల ఆందోళన

### ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్



**న్యూఢిల్లీ :** వరుసగా ఏడవ రోజు కూడా పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రతిపక్ష ఎంపిలు నిరసన తెలిపారు. బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా సవరణను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీతో సహా ఇండియా కూటమి పార్టీలకు చెందిన ఎంపిలు బుధవారం ఆందోళన నిర్వహించారు. వెంటనే ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ఇతర ప్రతిపక్ష ఎంపిలు బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్లమెంట్ మకర ద్వారం మెట్లపై, సమీపంలో వరుసగా ఏడవ రోజు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సమయంలో వారు ‘ఎస్ఐఆర్ లోక్‌తంత్ర పే వార్’ అని రాసి ఉన్న భారీను ప్రదర్శించారు. ‘ఎస్ఐఆర్’ను ఆపండి’ అంటూ ప్లకార్డులతో కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జెడి, వామపక్ష పార్టీలతో సహా ప్రతిపక్ష పార్టీల పలువురు ఎంపిలు నిరసనలో పాల్గొని నినాదాలు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్‌లో ‘ఓటర్ల ఓటు హక్కును తొలగించడం’ లక్ష్యంగా ఇసి ఈ చర్య చేపట్టిందని ఆరోపిస్తూ, ప్రతిపక్షాలు పార్లమెంటు ఉభయ సభలలో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నాయి. ఈ అంశంపై ఉభయ సభలలో చర్చ జరగాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు బుధవారం మధ్యాహ్నం ముందు జరిగిన రాజ్యసభ సమావేశంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల కమిషన్ నిర్వహించిన బిహార్ ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై చర్చకు ఒత్తిడి తీసుకురావడంతో రాజ్యసభ కార్యకలాపాలు వాయిదా పడ్డాయి. సభ ఎజెండాను ప్రవేశపెట్టగానే ఎస్ఐఆర్‌పై చర్చ ఎప్పుడు జరుగుతుందో సూచించమని కాంగ్రెస్, టిఎంసి ఛైర్మన్‌పై ఒత్తిడి తెచ్చాయి. ఎంపిలు అత్యవసర ప్రజా ప్రాముఖ్యత గల అంశాలను లేవనెత్తే ఎజెండాను, జీరో అవర్ ప్రస్తావనలను చేపట్టాలని డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ కోరారు. ఎస్ఐఆర్‌పై చర్చ కోరుతూ ప్రతిపక్ష నాయకులు చేసిన వ్యాఖ్యలు రికార్డు చేయబడవని ఆయన పేర్కొన్న తర్వాత కొద్దిసేపటికే ప్రతిపక్ష ఎంపిలు తమ డిమాండ్ కోసం పట్టుబట్టడంతో సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. టిఎంసి నాయకుడు డెరెక్ ’బ్రెయిన్ మాట్లాడుతూ, ప్రతిపక్షం సభ నిర్వహణకు ప్రభుత్వంతో 100 శాతం సహకరిస్తోందని, అయితే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మిగిలిన రెండు వారాల్లో ఎస్ఐఆర్ గురించి చర్చించాలని అన్నారు. ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎస్ఐఆర్‌పై చర్చ ఎప్పుడు జరుగుతుందో సమయం, తేదీని సూచించాలని ఛైర్మన్‌ను కోరారు. బిహార్‌లో అక్టోబర్‌న–వంబర్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్రంలోని రాజకీయ విధానంష భారత ఎన్నికల సంఘం లక్షలాది మంది ఓటర్ల ఓటు హక్కును తొలగించడానికి ప్రయత్నిస్తున్నాయని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. ముందుగా, డిప్యూటీ ఛైర్మన్ రూల్ 267 కింద 18 నోటీసులు వచ్చాయని, అలాంటి నోటీసుల ద్వారా లేవనెత్తిన అంశాన్ని చర్చించడానికి ఆ రోజు పనిని పక్కన పెట్టాలని కోరుతున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు అనుగుణంగా లేనందున 18 నోటీసులను ఛైర్మన్ తిరస్కరించారు. ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు సన్యాసినులను అన్యాయంగా అరెస్టు చేశారనే ఆరోపణలపై సిపిఐకి చెందిన సందోష్ కుమార్, జాన్ బ్రిట్టాస్ (సిపిఎం) చర్చ జరపాలని డిమాండ్ చేయగా, మాజీ రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాపై రాంజిలాల్ సుమన్ (ఎస్‌పి) చర్చ జరపాలని కోరారు.

సింధు జల ఒప్పందంపై అప్పటి ప్రధాని నెహ్రూ తప్పును

## మోదీ సర్కారు సరిదిద్దింది

### రాజ్యసభకు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడి

### కాల్పుల విరమణపై ఎలాంటి థర్డ్ పార్టీ లేనేలేదని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌పై, పాకిస్థాన్‌కు భారత్ సింధు జలాలను నిలిపివేయడంపై తరచూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలను బుధవారం రాజ్యసభలో విదేశీవ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ తోసిపుచ్చారు. పాకిస్థాన్‌తో సింధు జల ఒప్పందాన్ని నిలిపివేయాలని నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలను జైశంకర్ వివరించారు. ఒప్పందాన్ని నిలిపివేయడం ద్వారా అప్పటి భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ విధానాలలోని తప్పును నరేంద్రమోదీ ప్రభుత్వం సరిదిద్దిందని చెప్పారు. జవహర్‌లాల్ నెహ్రూ శాంతిని నెలకొల్పడానికి కాదని, బుజ్జగింపుకోసమేనన్నారు. పహల్గామ్ దాడి ప్రపంచవ్యాప్తంగా దు:ఖం, దిగ్భ్రాంతిని కలిగించిందని జైశంకర్ ఆవేదన వ్యక్తంచేశారు. ‘కానీ ప్రశ్న ఏమిటి అంటే, ఆ తర్వాత ఏమిటి? అనే దానికి రెండు సమాధానాలు అన్నారు. ఒకటి ఆ విధమైన దాడి అంగీకారయోగ్యం కాదు. అది మన సరిహద్దును దాటింది. అందువల్ల చాలా తీవ్రమైన పరిణామాలు ఉండాలి’ అని వినిపించాయని జైశంకర్ వివరించారు. ‘రెండవది ఏమిటంటే నేరస్థుడు జవాబుదారీగా ఉండాలి. వారు, వారి మద్దతుదారులను న్యాయం ముందు నిలబెట్టాలి, ప్రస్తుతం మొదటి దానికి భారతదేశం ఆగ్రహం సమాధానం. పహల్గామ్ దాడి జరిగిన మరుసటిరోజు ఏప్రిల్ 23న కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది’ అని విదేశీవ్యవహారాల మంత్రి జైశంకర్ వివరించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌తో భారత్ కాల్పుల విరమణను తీసుకువచ్చేలా థర్డ్ పార్టీ జోక్యం లేనేలేదని, మిలిటరీ చర్య నిలిపివేయడం వెనుక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్యంతో ఎలాంటి ముడిపెట్టలేదని జైశంకర్ స్పష్టంచేశారు. ఆయన రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన ప్రత్యేక చర్చలో విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ జోక్యం చేసుకుంటూ పహల్గామ్ దాడి జరిగిన ఏప్రిల్ 22నుంచి జూన్ 16వరకూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణలు జరుపలేదని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు.

## వయనాడ్ వరద బాధితులకు రుణాలు మాఫీ చేయండి


### కేంద్ర ప్రభుత్వానికి ప్రియాంకాగాంధీ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** తన నియోజకవర్గంలో సంభవించిన వరదలు, కొండచరియలు విరిగిపడిన బాధితులైన వారి రుణాలను మాఫీ చేయాలని కేరళలోని వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గ ఎంపి ప్రియాంకా గాంధీ వాద్రా కేంద్రాన్ని కోరారు. బాధిత ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకోవడంలో కేంద్ర సహాయం లేకపోవడం పట్ల ఆమె విచారం వ్యక్తం చేశారు. లోక్ సభలో జీరో అవర్ సందర్భంగా వాద్రా ఈ అంశాన్ని లేవనెత్తుతూ కేరళ జిల్లాలో కొండచరియలు విరిగిపడటం, వరదల కారణంగా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, 17 కుటుంబాలు తుడిచిపెట్టుకుపోయాయని, 1,600కి పైగా భవనాలు ధ్వంసమయ్యాయని చెప్పారు. వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, కాఫీ తోటలు, టీ తోటలు, యాలకులు... ఆటో డ్రైవర్లు, జీపు డ్రైవర్లు, హోమ్ స్టేలు నడుపుతున్న, చిన్న వ్యాపారాలు చేసే వ్యక్తుల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే విపత్తు జరిగి ఒక సంవత్సరం అయిందని, బాధితులకు ఇప్పటికీ సరైన పునరావాసం కల్పించలేదని ఆమె మండిపడ్డారు. ఏడాది కాలంగా తాము వయనాడ్ కోసం నిధులను విడుదల చేయాలని అభ్యర్థిస్తున్నామని, కొన్ని నిధులు విడుదలయ్యాయి, కానీ అవి సరిపోలేదన్నారు. ప్రజలు ప్రాణాలను, మొత్తం జీవనోపాధిని కోల్పోయారని, తమ జీవితాలను పునర్నిర్మించుకుంటూ రుణాలు తిరిగి చెల్లించాలని ఆశిస్తున్నారా? అని ప్రశ్నించారు. కొండచరియలు విరిగిపడటం, వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని అభ్యర్థించగా తొలుత తిరస్కరించినా చివరికి తీవ్రమైన ప్రకృతి విపత్తుగా పేర్కొన్నందుకు సంతోషిస్తున్నామన్నారు.

## అశ్లీల కంటెంట్‌ను ప్రసారం చేసే మొత్తం 43 ఒటిటిలపై నిషేధం

### వెల్లడించిన కేంద్ర సమాచార, ప్రసారాలశాఖ సహాయమంత్రి మురుగన్





**న్యూఢిల్లీ :** ఒటిటి వేదికల్లో విచ్చలవిడిగా అందుబాటులో ఉన్న అభ్యంతరకర వీడియోలను కట్టడి చేయడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు చేపడుతోంది. అశ్లీలత, అనైతికత, హింసను ప్రోత్సహించే కంటెంట్‌ను ప్రసారం చేసే పలు ఒటిటి వేదికలపై కొరడా ఝుళిపిస్తోంది. ఇటీవల 24 యాప్‌లు, వెబ్‌సైట్లపై నిషేధించగా.. ఇప్పటివరకు 43 ఒటిటి వేదికలను బ్లాక్ చేసినట్లు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ సహాయమంత్రి డా.ఎల్. మురుగన్ లోక్‌సభకు వెల్లడించారు. అశ్లీలత, హింస, సాంస్కృతిక అంశాలపై సున్నితమైన కంటెంట్‌ను నియంత్రించేందుకు చట్టపరమైన, నైతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టిన చర్యల్లో భాగంగానే 43 ఒటిటి ప్లాట్‌ఫారమ్‌లను నిషేధించినట్లు పేర్కొన్నారు. ఒటిటి వేదికలు చట్ట విరుద్ధమైన కంటెంట్‌ను ప్రసారం చేయరాదని తెలిపారు. ప్రసారం చేసే కంటెంట్‌ను వయస్సు ఆధారంగా వర్గీకరించాలని సూచించిన మంత్రి.. ఇది ఐటి చట్టంలో పేర్కొన్న నిబంధనల ప్రకారమే జరగాల్సి ఉంటుందన్నారు. పిల్లల వయస్సుకు తగని రీతిలో ఉన్న కంటెంట్‌ను నియంత్రించేందుకు తగిన రక్షణ చర్యలు, యాక్సెస్ నియంత్రణ చర్యలను అమలు చేయాలని ఒటిటి వేదికలకు సూచించారు. చట్టాలను ఉల్లంఘించేలా కంటెంట్‌ను ప్రసారం చేస్తున్న 43 ఒటిటిలపై సంబంధిత మంత్రిత్వశాఖలతో సంప్రదింపుల అనంతరం నిషేధం విధించినట్లు తెలిపారు. ఒటిటి యాప్‌లు, సర్వీస్ ప్రొవైడర్లు తాము ప్రసారం చేసే కంటెంట్‌పై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం ఇటీవల హెచ్చరించిన విషయం తెలిసిందే.

సన్యాసినుల అరెస్టును నిరసిస్తూ

## కేరళ ఎంపిల ఆందోళన



**న్యూఢిల్లీ :** ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు కాథలిక్ సన్యాసినుల అరెస్టును నిరసిస్తూ కేరళకు చెందిన మరి కొందరు ప్రతిపక్ష ఎంపిలతో కలిసి పార్లమెంటు భవనం ఆవరణలో ఎంపి ప్రియాంకాగాంధీ వాద్రా నిరసన తెలిపారు. బిజెపిని తీవ్రంగా విమర్శించారు. లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభమయ్యే ముందు, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్, ఆర్ఎస్‌పి ఎంపి ఎన్.కె. ప్రేమ్‌చంద్రన్, కేరళకు చెందిన మరి కొందరు కాంగ్రెస్ ఎంపిలు పార్లమెంటులోని మకర ద్వారం సమీపంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. నారాయణపూర్‌కు చెందిన ముగ్గురు బాలికలను బలవంతంగా మతమార్పిడి చేసి అక్రమ రవాణా చేశారని ఆరోపించిన స్థానిక బజరంగ్ దళ్ కార్యకర్త ఫిర్యాదు మేరకు ఈనెల 25న దుర్గ్ రైల్వే స్టేషన్‌లో సన్యాసినులు ప్రీతి మెర్రీ, వందన ఫ్రాన్సిస్, సుకమాన్ మాండవిలను అరెస్టు చేశారు. కేరళకు చెందిన కొంతమంది సన్యాసినులతో చాలా దారుణంగా ప్రవర్తించారని, వారు చేయని పనులకు వారిపై ఆరోపణలు చేశారని, ఛత్తీస్‌గఢ్ పోలీసులు వారి పట్ల దురుసుగా ప్రవర్తించి ఆతరువాత వారిని తీసుకెళ్లారని ప్రియాంకాగాంధీ మండిపడ్డారు. మైనారిటీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా తాము నిరసన తెలుపుతున్నామని చెప్పారు. ఈ దారుణాన్ని అంతం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కాగా, కేరళలోని కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కూటమి నాయకుల ప్రతినిధి బృందం మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ సెంట్రల్ జైలును సందర్శించి, మానవ అక్రమ రవాణా, బలవంతపు మత మార్పిడి ఆరోపణలపై అరెస్టయిన ఇద్దరు కాథలిక్ సన్యాసినులను కలిసింది. తరువాత ప్రతినిధి బృందం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయిని కూడా కలిసి పరిస్థితి వివరించగా, ఈ విషయాన్ని పూర్తిగా దర్యాప్తు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

అల్‌ఖైదా అనుబంధ సంస్థకు చెందిన

## షామా పర్వీన్ అరెస్టు

### బెంగళూరులో అదుపులోకి తీసుకున్న గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్




**అహ్మదాబాద్ :** నిషేధిత అల్‌ఖైదా అనుబంధ సంస్థకు చెందిన మహిళను గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అదుపులోకి తీసుకుంది. ‘అల్‌ఖైదా ఇన్ ద ఇండియన్ సబ్ కాంటినెంట్ (ఎక్యూఐఎస్) తరపున పనిచేస్తున్న 30 ఏళ్ల షామా పర్వీన్‌ను బెంగళూరులో అరెస్ట్ చేశారు. జార్ఖండ్‌కు చెందిన ఆమె గత నాలుగేళ్లుగా బెంగళూరులో ఉంటున్నట్లు తెలిపారు. కర్ణాటక నుంచి ఆమె ఉగ్రవాదులకు సహాయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని అన్నారు. అంతకుముందు కొన్నిరోజులు హైదరాబాద్‌లోనూ నివసించిందని, ఆ తర్వాతే బెంగళూరుకు మకాం మార్చిందని తెలిపారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా యువతను ఉగ్రవాదంలోకి ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ఒక అల్‌ఖైదా ఆపరేటివ్ వీడియోను కూడా ఆమె షేర్ చేసినట్లు గుర్తించారు. షామా పర్వీన్‌ను బెంగుళూరులో అరెస్ట్ చేసి అహ్మదాబాద్ తరలించారు. దేశంలో ఉగ్రవాదులకు మద్దతు ఇస్తున్నవారిని గుర్తించడానికి అధికారులు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగానే ఆమెను అరెస్ట్ చేశారు. జులై 23న ఎక్యూఐఎస్‌తో సంబంధమున్న మహమ్మద్ ఫర్దీన్, సెఫుల్లా కురేషి, జీషన్ అలీ, మహమ్మద్ ఫైక్ అనే నలుగురు ఉగ్ర అనుమానితులను గుజరాత్, ఢిల్లీ, నోయిడాలో అదుపులోకి తీసుకున్నా రు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ గ్రూప్ సభ్యులు ఉన్నారని తెలిపారు. వారందరికీ షామా పర్వీన్ నాయకత్వం వహిస్తున్నట్లు వెల్లడించారు. వీరంతా సోషల్ మీడియాలోని ఓ రహస్య, ఆటో డిలీటెడ్ యాప్ ద్వారా సంప్రదింపులు జరుపుకుంటున్నారని వెల్లడించారు. దేశంలోని వివిధ ప్రాం తాల్లో ఉగ్ర దాడులు అమలుచేయడానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించామని చెప్పారు.

**దేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారం ఉగ్ర ముఠాలకు...** అల్‌ఖైదా, ఇతర ఉగ్రవాద సంస్థలకు చెందిన స్లీపర్‌సెల్ విభాగంతో, విదేశాలలోని ఉగ్ర సంస్థలతో వీరికి సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తున్నారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఎటిఎస్ అధికారులు తెలిపారు. దేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని వీరు ఉగ్ర ముఠాలకు చేరవేస్తున్నారని అధికారులు అంటున్నారు. ఇంకా ఈ గ్రూప్‌నకు చెందిన ఇతర ఉగ్రవాద మద్దతుదారులు, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు చేసే వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## నిమిషప్రియ మరణశిక్ష రద్దు అవాస్తవం

### విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

### యెమన్ నుంచి మాకు ఎలాంటి అధికారిక సమాచారం లేదని స్పష్టీకరణ

### భారత గ్రాండ్ ముఫ్తీ అబూబకర్ ముస్లియార్ ప్రకటన నేపథ్యంలో ఎంఇఎ వివరణ



**న్యూఢిల్లీ :** యెమన్‌లో భారతీయ నర్సు నిమిష ప్రియ మరణశిక్షను రద్దుచేశారంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని బుధవారం ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇలాంటి సున్నిత విషయాలలో ఎలాంటి అవాస్తవాలు, ఊహాగానాలకు తావు లేదని, వీటిని నివారించాల్సిన అవసరం ఉందని తేల్చిచెప్పాయి. యెమన్‌లో నిమిషప్రియ మరణశిక్షరద్దు అయ్యిందని భారతదేశానికి చెందిన గ్రాండ్ ముఫ్తీ అబూబకర్ ముస్లియార్ సోమవారం రాత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. గ్రాండ్ ముఫ్తీ వివరణపై ప్రధానమంత్రి కార్యాలయం (పిఎంఓ), విదేశీవ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించాయి. నిమిషప్రియ మరణశిక్షను రద్దు చేసిన విషయమై యెమన్ నుంచి ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంఇఏ) తెలిపింది. ‘ఇలాంటి సున్నితమైన విషయాలపై తప్పుడు సమాచారం, ఊహాగానాలకు దూరంగా ఉండాలని మే ం ప్రజలను కోరుతున్నాం’ అని ప్రభుత్వవర్గాలలో ఒకటి తెలియజేసింది. భారతీయ నర్సు నిమిష ప్రియ స్వస్థలం కేరళ రాష్ట్రం పాలక్కాడ్ జిల్లాలోని కొల్లెన్‌గోడ్ .2017లో యెమన్ పౌరుడి హత్య కేసులో ఆమె అపరాధానికి పాల్పడిందని రుజువైంది. ఈ నేపథ్యంలో నిమిష ప్రియకు యెమన్ కోర్టు 2020లో ఆ దేశానికి చెందిన సుప్రీం జ్యుడీషియల్ కౌన్సిల్ మరణ శిక్ష విధించింది. మరణశిక్షను రద్దు చేయాలన్న ఆమె అభ్యర్థనను 2023 నవంబర్‌లో తోసిపుచ్చింది. జులై 17న విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ యెమన్ ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు నిమిషప్రియ మరణశిక్ష రద్దు విషయమై సంప్రదింపులు జరుపుతున్నామని తెలియజేసింది.

## ఆశా కార్యకర్తలకు ప్రోత్సాహకం పెంపు

### రూ.1000 నుంచి రూ. 3వేలకు పెంపు

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఇప్పటికే పలు హామీలు కురిపించారు. తాజాగా ఆశాకార్యకర్తలకు ప్రోత్సాహా న్ని ప్రకటించారు. ప్రస్తుతం వారికి నెలకు చెల్లిస్తున్న రూ.1,000 ప్రోత్సాహాన్ని రూ.3వేలకు పెంచారు. అదే విధంగా మమతా ఆరోగ్య కార్యకర్తలకు ఇస్తున్న ప్రోత్సాహాన్ని రెట్టింపు చేస్తూ రూ.300 నుంచి రూ. 600లకు పెంచారు. నవంబర్ 2005లో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి తాము ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి విస్తృతంగా పనిచేశామని, గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్తలు (ఆశా), ‘మమతా’ కార్మికులు గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మెరుగుపరచడంలోగణనీయమైన పాత్ర పోషించారని నితీశ్ బుధవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆశా కార్యకర్తలకు ఇప్పుడు ‘రూ.1,000కి బదులు గా రూ.3,000 ప్రోత్సాహకం అందించబడుతుంది అన్నారు. ‘మమతా’ కార్మికులకు ఇప్పుడు డెలివరీకి రూ.600 ప్రోత్సాహక లభిస్తుందన్నారు. ఇది ప్రస్తుతం ఉన్న రూ.300 నుండి రూ.600 పెంచబడిందని ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటనపై ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య మంత్రిగా తన 17 నెలల పదవీకాలంలో ఆశా, మమత’ కార్యకర్తలకు ప్రోత్సాహక మొత్తాన్ని పెంచే ప్రక్రియను ప్రారంభించానన్నారు. ఈ మెరుగైన ప్రోత్సాహక మొత్తం వారి మనోధైర్యా న్ని పెంచుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తుందన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే ఈ మొత్తాలను పెంచాల్సిన ఉండేదని, కానీ ఆ తర్వాత ముఖ్యమంత్రి ఎప్పటిలాగే యుటర్న్ తీసుకున్నారు (బిజెపితో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు) అని తేజస్వీ ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ అసమర్థ ఎన్‌డిఎ ప్రభుత్వం రెండేళ్లుగా దానిపై (ప్రోత్సాహకాన్ని పెంచే ప్రతిపాదన) కూర్చుని ఉంది. చివరకు, వారు మా డిమాండ్‌కు తలొగ్గి ఆశా, మమతా వర్కర్లకు ప్రోత్సాహక మొత్తాన్ని పెంచాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం ఓటమి భయంతో తమ ఆలోచనలు, డిమాండ్లను కాపీ చేస్తోందని తేజస్వి పేర్కొన్నారు. ఈ దార్శనికత లేని ప్రభుత్వం రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో తుడిచిపెట్టుకుపోతుందని విమర్శించారు.

కోర్టు గది సరిపోదు.. క్రికెట్ స్టేడియం కావాలేమో!

## సెంథిల్ బాలాజీ కేసులో ‘సుప్రీం’ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : తమిళనాడు ప్రభుత్వం తీరుపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. మాజీ మంత్రి వీ సెంథిల్ బాలాజీ ప్రమేయం ఉన్న ఉద్యోగ కుంభకోణంపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి మాజీ మంత్రి డబ్బులు తీసుకున్నట్లుగా అభియోగాలు నమోదైన విషయం తెలిసిందే. జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మల్య బాగ్చి ధర్మాసనం తమిళనాడు సర్కారుపై మండిపడింది. ప్రభుత్వం కావాలనే విచారణను ఆలస్యం చేస్తున్నట్లుగా కనిపిస్తోందని మండిపడింది. ప్రభుత్వం కేసును మూసివేసేందుకు ప్రయత్నిస్తే.. న్యాయ శాఖ అడ్డుకుందంటూ మందలించింది. ఈ కేసులో 2000 మంది నిందితులు, 500 మంది సాక్షులుగా ఉన్నారన్న ధర్మాసనం.. భారత్‌లో అత్యధిక మంది విచారణలో పాల్గొన్న కేసు ఇదే అవుతుందేమోనని వ్యాఖ్యానించింది. నిందితులందరికీ కోర్టు గది సరిపోదని.. ఓ క్రికెట్ స్టేడియం కావాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. నిందితుడు, సాక్షుల పూర్తి వివరాలు సమర్పించాలని సర్వోన్నత న్యాయస్థానం తమిళనాడు సర్కారును ఆదేశించింది. బాలాజీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ విచారణకు హాజరయ్యారు. అన్నాడీఎంకే హయాంలో సెంథిల్ బాలాజీ రవాణాశాఖ మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి లంచం తీసుకున్నట్లుగా ఆరోపణలున్నాయి. ఈ మేరకు ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఆయన స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీలో చేరి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రవాణాశాఖ కేసులో ఆయనను ఈడీ 2023లో అరెస్టు చేసింది.

## పిఒకెను తిరిగి స్వాధీనం చేసుకుంటాం

### పహల్గామ్ దాడిలో లష్కరే తోయిబా హస్తం : అమిత్ షా



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడిలో లష్కరే తోయిబా హస్తం ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తెలిపా రు. ఆపరేషన్ మహదేవ్ చేపట్టి అంతం చేసిన ముగ్గురు ఉగ్రవాదులు ఆ ఉగ్రసంస్థకు చెందినవారేనని స్పష్టం చేశారు. వాస్తవానికి పహల్గామ్ దాడి వెనుక ఉన్న ఉగ్రవాదుల తలపై కాల్చి చంపాలని ప్రజలు కోరుకున్నారని, యాదృచ్ఛికంగా ఆ ముగ్గురు ఉగ్రవాదులను మన బలగాలు తలపైనే గురిచూసి కాల్చాయని ఆయన రాజ్యసభలో చెప్పారు. మహిళలు, పిల్లల ముందు మతం అడిగి మరీ చంపేశారని, ఇంత అనాగరిక నేరం ఇంతకు ముందు ఎన్నడూ జరగలేదని అమిత్‌షా అన్నారు. కాంగ్రెస్‌కు జాతీయ భద్రత కంటే రాజకీయాలే ముఖ్యమైపోయాని అమిత్‌షా విమర్శలు గుప్పించారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో కాంగ్రెస్ సంతృ ప్తి పడుతోందని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లను పాకిస్థాన్‌కు ఇచ్చేసిందని, కానీ బిజెపి దానిని తిరిగి భారత్‌లో చేరుస్తుందని అమిత్ షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాల వల్లే ఉగ్రవాదం వృద్ధి చెందిందని ఆయన విమర్శించారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి ఉంటే, ఉగ్రవాదులపై చర్య తీసుకునే బదులు పత్రాలను పంపి ఉండేదని ఆయన ఆరోపించారు. భారత్‌లో ఉగ్రవాదం పూర్తిగా అంతరించే దిశలో ఉందని, అది కచ్చితంగా అంతం అవుతుందని అమిత్ షా అన్నారు. హిందువులు ఎప్పటికీ ఉగ్రవాదులు కాలేరని, ఈ విషయాన్ని ప్రపంచానికి గర్వంగా ప్రకటిస్తున్నానని తెలిపారు. మరోవైపు అమిత్ షా మాట్లాడడం ప్రారంభించగానే ప్రతిపక్ష పార్టీలు నిరసనలు వ్యక్తం చేశాయి. ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడాలని డిమాండ్ చేశాయి. కానీ సభాధ్యక్షులు విపక్షాల డిమాండ్‌ను అంగీకరించలేదు. దీంతో వారు వాకౌట్ చేశారు.

ప్రజాపక్షం
గురువారం, 31 జులై

# పనిగంటల ప్రకంపనలు

'తక్కువ ఖర్చు... ఎక్కువ లాభం' అనే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ మూల సూత్రం నిన్న మొన్నటివరకూ కేవలం ఉత్పత్తి రంగానికే పరిమితంకాగా, నేడు క్రమంగా సేవా రంగంలోనూ వేళ్లూనుకుంటున్నది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) నిపుణులు, ఉద్యోగుల పనిని 9 నుంచి 10 గంటలకు పెంచడానికి కర్ణాటక ప్రభుత్వం చేసిన ప్రయత్నం ప్రకంపనలు సృష్టిస్తున్నది. తీవ్ర వ్యతిరేకత వ్యక్తమై, ఉద్యమం బలపడడంతో, కర్ణాటక దుకాణాలు మరియు వాణిజ్య సంస్థల (సవరణ) బిల్లు, 2025లోని ఈ కీలక అంశాన్ని అక్కడి ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీనితో, సమస్యకు తాత్కాలికంగా తెరపడింది. కర్ణాటక రాష్ట్ర ఐటి/ఐటిఇల ఎంప్లాయీస్ యూనియన్ (కెఐటియు/కిటు) ఆధ్వర్యంలో జరిగిన పోరాటం సత్ఫలితాలనిచ్చింది. సేవా రంగంలోని అసంఘటిత ఉద్యోగులు ఏకం కావాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది. అదే సమయంలో, ఐటి రంగంలో పనిగంటల విషయంలో కర్ణాటక ప్రయత్నాలు దేశ వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఐటి, ఐటిఇలలో పని గంటలను చట్టబద్ధంగా పొడిగించడానికి వీలుగా 1961నాటి చట్టాన్ని సవరించడానికి పూనుకోవడం పెట్టుబడిదారులకు ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్న వైనాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నది. కర్ణాటక సర్కారు తీసుకురావాలనుకున్న బిల్లును, గత ఏడాది 14 గంటల షిఫ్ట్‌లను చట్టబద్ధం చేయడానికి జరిగిన విఫలయత్నానికి కొనసాగింపుగానే చూడాలి. రోజువారీ పని గంటలను పెంచడంతో పాటు, అదనంగా రెండు గంటల ఓవర్ టైంను జోడించి, దానిపై త్రైమాసిక పరిమితిని 50 నుండి 144 గంటలకు పెంచే ప్రయత్నాలను ఐటి ఉద్యోగులు నిర్ద్వంద్వంగా తిరస్కరించడం సహేతుకమే. ప్రతిపాదిత బిల్లు ముమ్మాటికీ పని వెలుపల ఉద్యోగుల వ్యక్తిగత, కుటుంబ జీవితాలపై దాడే. ఇప్పటికే ఒత్తిడి అధికంగా ఉన్న ఐటి రంగంలో ఎక్కువ పని గంటలు ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. నిజానికి, ఐటి రంగంలో పని గంటల పెంపు వివాదం హఠాత్తుగా ఊడిపడిందేమీ కాదు. జాతీయ ఉత్పాదకతను పెంచడానికి దేశంలోని యువత వారానికి 70 గంటల వరకు పని చేయాలని 2023 చివరలో, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి చేసిన ప్రతిపాదన దుమారం రేపింది. మన దేశ పని సంస్కృతి భవిష్యత్తును సమస్యల ఊబిలోకి దించేసే ప్రయత్నాలను తేటతెల్లం చేసింది. ఉద్యోగులకు, యంత్రాలకు మధ్య తేడాను తుడిచేవేసే దుష్ట సంప్రదాయాన్ని తెరపైకి తెచ్చింది. నిజానికి ఎక్కువ పనిగంటలతో ఉద్యోగుల నుంచి మెరుగైన నైపుణ్యాలను కోరుకోవడం అత్యాశే. దాని వల్ల ఆశించిన ఫలితాలు రాకపోగా, అలసిపోయిన ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్యం ఒక్కోసారి ఉత్పాదకతను తగ్గిస్తుంది. యాజమాన్యాలు అనుసరించే శ్రమ దోపిడీకి అనుకూల వాతావరణం కల్పిస్తుంది. ఉద్యోగాల కోతకు అధికారికంగా మార్గం సుగమమం చేస్తుంది. ఈ పరిస్థితుల్లో, ఐటి నిపుణులను ప్రత్యక్షంగా, సేవా రంగంలోని ఉద్యోగులను పరోక్షంగా ప్రభావితం చేసే కర్ణాటక నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు గళం విప్పడం శుభ పరిణామం. తమ హక్కులను సమర్థవంతంగా కాపాడుకోవడం హర్షణీయం.

మన దేశ వైట్‌కాలర్ ఆర్థిక వ్యవస్థలోని కార్మిక హక్కుల కోణంలో, ఈ బిల్లు ఉపసంహరణ ఒక కీలక ఘట్టం. అత్యంత వేగంగా మార్పులకు లోనయ్యే ఐటి రంగంలో కూడా కార్మికులు సంఘటితమవుతున్నారన్న వాస్తవాన్ని కర్ణాటక ఉదంతం నిరూపించింది. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బలపడుతున్న ఉద్యమ నేపథ్యాలను పరిచయం చేస్తున్నది. అదే సమయంలో, సేవా రంగంలోనూ ఉద్యోగుల శక్తిసామర్థ్యాలను పీల్చేసే కార్పొరేట్ జలగల ఆగమనాన్ని సూచిస్తున్నది. ఉద్యోగులను యంత్రాలుగా... మరమనుషులుగా మారుస్తున్న వైనంపై హెచ్చరికలు జారీ చేస్తున్నది. రాబోయే పరిణామాలపై ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. ఉప్పెనలా ముంచుకొస్తున్న ప్రమాదాన్ని నివారించడానికి కర్ణాటక ఐటి ఉద్యోగుల ఉద్యమం.. సాధించిన విజయం నుంచి ప్రతి ఐటి ఉద్యోగీ స్ఫూర్తి పొందాలి. అక్కడి పోరాటం కేవలం ఒక బిల్లును ఆపడం కోసం కాదు.. రాబోయే ప్రమాదాలను నివారించడానికి కూడా. ఈ ప్రతిఘటన ఐటి రంగంలో శ్రమదోపిడీ విధానాలను అడ్డుకోవడానికి జరిగిన తొలి ప్రయత్నం. యాజమాన్యాలు శ్రమ దోపిడీకి పాల్పడకుండా అడ్డుగీత గీయడం, కార్మికులు యంత్రాలు కారని నొక్కి చెప్పడం, సాంకేతిక శ్రమ అనేది ఇకపై వైరుధ్యమైనది కాదని నిరూపించడం. పని భవిష్యత్తు కేవలం సాంకేతికత లేదా పెట్టుబడిపై మాత్రమే ఆధారపడకూడదని పేర్కోవడం. పని తీరును రూపొందించడంలో ఐటి ఉద్యోగులు, నిపుణులు తమ హక్కుగా ఉన్న వాటాను ఎంత ధైర్యంగా నొక్కి చెబుతారనేది ప్రధానం. కర్ణాటకలో వారు ఈ సంఘటిత శక్తిని ప్రదర్శించారు. ఈ స్ఫూర్తి యావత్ భారతావనికి మార్గదర్శకం.

# ప్రజాస్వామ్య ముసుగు కప్పుకొన్న అమెరికా ఉగ్రవాదం



డా.కోలాహలం రామ్‌కిశోర్
9849328496

'ఉగ్రవాదం' ఈ కాలంలో ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న సమస్యలలో ఒకటి. ప్రత్యేకించి ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) వంటి సంస్థలు ప్రపంచవ్యాప్తంగా హింస, రక్తపాతాన్ని సృష్టిస్తున్నాయి. కానీ ఈ ఉగ్రవాదానికి పునాదులు వేసింది ఎవరు? దాన్ని పెంచి, పోషించింది ఎవరు? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకుతున్న సమయంలో అమెరికా ప్రభుత్వం రహస్య వ్యూహాలు బట్టబయిలు అవుతాయి. 'ప్రజాస్వామ్యం', 'మానవ హక్కుల' పేరుతో ప్రపంచాన్ని నడిపిస్తున్న అమెరికా, నిజానికి ఉగ్రవాదాన్ని తన రాజకీయ స్వార్థపూరిత లబ్ధికోసం ఉపయోగించుకుంటోంది.

## ఐసిస్ పుట్టుకకు అమెరికా ఎలా కారణమైంది?

1990ల దశకంలో ఇరాక్‌పై అమెరికా కల్పించిన యుద్ధ వాతావరణం, అక్కడి శాంతి, సుస్థిరత్వాన్ని ధ్వంసం చేసింది. సద్దాం హుస్సేన్ పరిపాలనను అంతం చేయడానికి అమెరికా 'ఇరాక్‌లో అణ్వాయుధాలు ఉన్నాయి అనే అబద్ధాన్ని తన ప్రచారం, ప్రసారం సాధనాలతో విస్తృతంగా విష ప్రచారం చేసింది. ఈ యుద్ధంలో ఇరాక్ సైన్యం విచ్ఛిన్నమై, దేశంలో అరాచకం వ్యాపించింది. ఈ పరిస్థితుల్లోనే 'జమాత్ అల్ తాహిడ్ వల్‌జిహాద్' వంటి ఉగ్రవాద సంస్థలు బలపడ్డాయి. ఈ సంస్థలు కాలక్రమేణా 'ఆల్ కైదా' ఉగ్రవాద సంస్థతో ఐక్యమయ్యాయి. తర్వాత 'ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ (ISI)'గా మారింది. 2013లో సిరియాలోని 'అల్ నుస్రా ఫ్రంట్'తో విలీనం అయింది, అదే చివరకు 'ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ISIS)'గా తన పేరు మార్చుకుంది. అమెరికా యుద్ధాలు, అరబ్ ప్రాంతాల్లో అస్థిరతను సృష్టించి, ఉగ్రవాద సంస్థలకు పుట్టిల్లును కల్పించాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో 'తాలిబాన్', ఇరాక్‌లో 'ఐసిస్' వంటి ఉగ్రవాద సంస్థలు బలపడటానికి అమెరికా కుట్రపూరితంగా అనుసరించిన విధానమే ప్రధాన కారణం.

## ఐసిస్‌కు ఆర్థిక, ఆయుధ, రాజకీయ బలం సమకూర్చింది ఎవరు?

ఐసిస్ ప్రపంచంలోనే అత్యంత ధనిక ఉగ్రవాద సంస్థగా మారడానికి కీలక కారణం అక్కడ విస్తారంగా లభించిన చమురు వ్యాపారం. ఇరాక్, సిరియాలోని చమురు బావులను ఆక్రమించి, ఇల్లీగల్‌గా చమురును అమ్మడం ద్వారా రోజుకు 13 మిలియన్ డాలర్లు సంపాదిస్తోంది. కువైట్, సౌదీ అరేబియా, కతార్ వంటి దేశాల నుండి లెక్కలేనంత డబ్బు సహాయం వారికి లభిస్తుంది. అదనంగా, బందిపోటు, కిడ్నాపింగ్ చర్యల ద్వారా కూడా డబ్బు సంపాదిస్తారు.

రాజకీయంగా, ఐసిస్ అమెరికా వ్యతిరేక శక్తులను బలపరిచింది. ఇరాన్, సిరియా, రష్యా వంటి దేశాలను బలహీనపరిచేందుకు అమెరికా ఐసిస్‌కు ఆయుధాలను సప్లై చేస్తుంది. ఐక్యరాజ్యసమితిలో సమస్యలు రాకుండా అమెరికా తన వీటో పవర్‌ను ఒక ఆయుధంగా అనేకసార్లు ఉపయోగించింది. కానీ, కొన్ని చోట్ల అమెరికా రూపొందించిన ఈ తప్పుడు వ్యూహం ఇప్పుడు ఐసిస్ 'ఏకు మేకు' అయింది. ఐఏఐస్ ఇప్పుడు తన స్వంత అజెండాతో ప్రపంచాన్ని భీతిల్ల చేస్తోంది.



## సామాజిక మాధ్యమాలు: ఉగ్రవాద ప్రచార శక్తి

ఐసిస్ యువతను ఆకర్షించడానికి ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగిస్తోంది. ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తూ, విస్తృతంగా ప్రచారాలు చేసి, యురోప్, అమెరికా నుండి యువకులను తమ వైపుకు ఆకర్షిస్తారు. ఈ ప్రక్రియలో పేదరికం, నిరాశ, మతపరమైన అత్యాశలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఇవన్నీ అమెరికా నీడలో, దర్శకత్వంలో కొనసాగాయి. చిన్న పిల్లలకు కూడా హింసను నేర్పిస్తారు. ఐసిస్ బాల సైనికులను 'భవిష్యత్ మానవ బాంబులు'గా తయారుచేస్తుంది. 45 రోజుల ప్రాథమిక శిక్షణ తర్వాత, 3 నెలల యుద్ధ శిక్షణ ఇస్తారు. ఈ పిల్లలకు తలకొట్టడం, గొంతు కోయడం వంటి క్రూరమైన పనులు నేర్పిస్తారు. ప్రారంభంలో ఐసిస్ మహిళలను సభ్యులుగా చేర్చుకోలేదు. కానీ, సిరియా, ఇరాక్‌లో మహిళా పోలీసులు అవసరమయ్యాక, వారిని కూడా సైనిక శిక్షణకు గురిచేశారు. జిహాదీలతో పెళ్లి చేసుకోవడానికి 'వివాహ కేంద్రాలు' ఏర్పాటు చేశారు. కానీ ఆ తర్వాత ఈ మహిళలు చాలా మంది బానిసలుగా మార్చబడ్డారు. ఐసిస్ అత్యాచారాలు, మానవతా విలువల ఉల్లంఘనలు ఇప్పటికీ విమర్శలను ఎదుర్కొంటున్నాయి.

చిన్న పిల్లలకు కూడా హింసను నేర్పిస్తారు. ఐసిస్ బాల సైనికు-లను 'భవిష్యత్ మానవ బాంబు-లు'గా తయారుచేస్తుంది. 45 రోజుల ప్రాథమిక శిక్షణ తర్వాత, 3 నెలల యుద్ధ శిక్షణ ఇస్తారు. ఈ పిల్లలకు తలకొట్టడం, గొంతు కోయడం వంటి క్రూరమైన పనులు నేర్పిస్తారు. ప్రారంభంలో ఐసిస్ మహిళలను సభ్యులుగా చేర్చుకోలేదు. కానీ, సిరియా, ఇరాక్‌లో మహిళా పోలీసులు అవసరమయ్యాక, వారిని కూడా సైనిక శిక్షణకు గురిచేశారు. జిహాదీలతో పెళ్లి చేసుకోవడానికి 'వివాహ కేంద్రాలు' ఏర్పాటు చేశారు. కానీ ఆ తర్వాత ఈ మహిళలు చాలా మంది బానిస-లుగా మార్చబడ్డారు. ఐసిస్ అత్యాచారాలు, మానవతా విలు-వల ఉల్లంఘనలు ఇప్పటికీ విమర్శలను ఎదుర్కొంటున్నాయి.

## అమెరికా డబుల్ స్టాండర్డ్

అమెరికా ఒకవైపు ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి పూనుకుంటూ, మరోవైపు తనకు అవసరం అయినప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాద సంస్థలను పెంచి, పోషించి, ఉపయోగిస్తోంది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్, ఇరాక్‌లో ఐసిస్ వంటి సంస్థలు బలపడటానికి అమెరికా యుద్ధాలే కారణం. ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పేరుతో అమెరికా చేస్తున్నది నిజంగా ఏమిటి? 'మానవ మారణ హోమం' మాత్రమే.

ఉగ్రవాదాన్ని అంతం చేయాలంటే, దాని మూలాలను గురించి ముఖ్యంగా యువత తెలుసుకోవాలి. అస్థిరత, యుద్ధాలు, ఆర్థిక అసమానతలు ఉగ్రవాదాన్ని పెంపొందిస్తాయి. అమెరికా వంటి స్వార్థ పూరితమైన దేశాలు తమ రాజకీయ ఆసక్తుల కోసం, ఉగ్రవాదాన్ని ఉపయోగించకుండా నిరోధించగలగాలి. ప్రపంచం మొత్తం శాంతి, సుస్థిరత, సహజీవనం కోసం కృషి చేయాలి. లేకుంటే, ఐసిస్ వంటి సంస్థలు మళ్లీ, మళ్లీ తలెత్తుతూనే ఉంటాయి. ఉగ్రవాదాన్ని ఒక వైపు పెంచి, పోషిస్తూ మరో వైపు 'ప్రజాస్వామ్యం' మానవ హక్కులు అంటూ అమెరికా ముసుగు కప్పుకుంటుంది, ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడుగా అయిన తర్వాత గాజా, పాలస్తీనా, ఇరాన్, సిరియా మొదలైన దేశాల్లో ఇజ్రాయిల్ నేత నెతన్యాహుతో జత కలిసి, ఆర్థికంగా, ఆయుధాల పరంగా, ఐక్యరాజ్య సమితిలో వీటో పవర్ ను ఉపయోగించి అక్కడి పసి పిల్లలను, మహిళలను, వృద్ధులను వేల సంఖ్యలో హతమారుస్తూంది. ఇక ఇప్పుడు అమెరికా ముసుగు తొలిగింది. ప్రపంచ దేశాలపై తన దేశ ఆర్థిక ప్రయోజనాల కోసం విచక్షణా రహితంగా టారిఫ్‌లు విధిస్తూ ప్రపంచ దేశాల వాణిజ్య ప్రయోజనాలను దెబ్బ తీయాలని చూస్తున్నారు. ఈ చర్య భవిష్యత్తులో పరోక్షంగా అమెరికాకు తీవ్రంగా నష్టపరుస్తుంది. మరోవైపు ఉక్రెయిన్‌ను నాటో కూటమిలో చేర్చుకుంటామని ఆశలు పెట్టి, రష్యాతో యుద్ధానికి దింపింది మాజీ అమెరికా అధ్యక్షుడు బైడెన్. ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్‌ను యుద్ధం మధ్యలో వదిలేశాడు. ఇలా అమెరికా ఇక ఎంత కాలం మానవాళిని మోసం చేస్తుందో? ఇంకెంత కాలం ప్రపంచ దేశాలపై అమెరికా దౌర్జన్యం కొనసాగుతుందో వేచి చూడాలి. చివరిగా... ప్రపంచంలో అనేక దేశాల్లో, చివరకు అమెరికా ప్రజలు కూడా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా, ఇజ్రాయిల్ నేత నెతన్యాహుకు వ్యతిరేకంగా ప్లకార్డ్స్ ధరించి నిరసన ఊరేగింపులు జరుపుతున్నారు. యువతలో కూడా అమెరికా నిజం స్వరూపం అర్థం అవుతుంది.

# సంపన్నులారా జన్మభూమిని విస్మరించకండి

ఆధునిక టెక్నాలజీ ఫలితంగా ప్రపంచమే ఓ 'కుగ్రామంగా' మారింది. దీనితో ఎక్కడ ఏం జరిగినా క్షణాల్లో విశ్వవ్యాప్తంగా తెలుస్తోంది. మన భారతీయులు ప్రపంచంలోని అనేక దేశాల్లో స్థిరపడి రాజకీయ, సాంకేతిక, వ్యాపార రంగాల్లో ఆర్థికంగా కుబేరులుగా ఎదిగి కొన్ని దేశాల్లో పాలకులై, ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. వారి ప్రగతి చూస్తూ మా వాళ్లని పొంగిపోతున్నాం. మన వారెక్కడున్నా జన్మభూమి రుణం తీర్చుకోవడం, మూలాలను విస్మరించకుండా మనవాళ్లను తరతరాలుగా పట్టి పీడిస్తున్న పేదరికం, ఉపాధి లేమి, నిరుద్యోగం తదితర సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి తోడ్పడాల్సిన బాధ్యతలు గుర్తు చేస్తూ భారతీయ (ప్రపంచ)కుబేరుల వివరాల్లోకి వెళదాం..

అంతర్జాతీయ వ్యాపార దిగ్గజాలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తమ వినూత్న వ్యూహాలతో సంపదను పెంచుకున్నారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల సంఖ్య 2025లో 3028కి పెరగడం ఇందుకు నిదర్శనం. వీరి మొత్తం సంపద విలువ 16.1లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. 2025 జూలైకు సంబంధించి ఫోర్బ్స్ విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఎలాన్ మస్క్ ప్రపంచ అగ్రగామి కుబేరుడుగా కొనసాగుతున్నారు. 2024 మేలో 400 బి. డాలర్ల మైలురాయిని అధిగమించిన తొలి కుబేరుడుగా నిలిచి మస్క్ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ప్రపంచ అగ్రగామి 10 మంది కుబేరుల సంపద విలువ జూన్ 1 నాటికి 100 బిలియన్ డాలర్లకు మించింది. ఇది ఇలా ఉంటే ప్రపంచ కుబేరుల జాబితాలో దశాబ్దాలుగా అగ్రస్థానంలో కొనసాగిన మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఇప్పుడు టాప్ 10 జాబితాలో స్థానం కోల్పోయారు. ఆయన చేసిన భారీ దానధర్మాల కారణంగా ప్రపంచ సంపద గణనలో జరిగిన మార్పులతో ఈ పరిణామం చోటు చేసుకుంది. ప్రపంచ కుబేరుల జాబితాలో ఐదో స్థానంలో ఉన్న ఆయన ఏకంగా 12వ స్థానానికి పడిపోయారు. ఇలా తన దానధర్మ కార్యక్రమాల మూలంగా టాప్ 10 బిలియనీర్ల జాబితా నుంచి బిల్ గేట్స్ స్థానం తగ్గింది. దాదాపు 116 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుల్లో 15వ స్థానం లో ముఖేష్ అంబానీ ఉన్నారు. వంద బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8.85 లక్షల కోట్ల) క్లబ్‌లో ఉన్న ఏకైక ఆసియావాసి ఈయనే. ప్రపంచ కుబేరుల తొలి పదిమంది పేర్లు, నికర విలువ (బిలియన్ డాలర్లు)...



1. ఎలాన్ మస్క్ (బి.డా. 393.1)
2. లారీ ఎలిసన్ (బి.డా. 275.9)
3. మార్క్ జుకర్ బర్గ్ (బి.డా. 247.9)
4. జెఫ్ బెజోస్ (బి.డా. 236.8)
5. బెర్నార్ అర్నాల్డ్ (బి.డా.147.7)
6. లారీ పేజ్ (బి.డా. 146.2)
7. వారెన్ బఫెట్ (బి.డా.143.1)
8. స్టీవ్ బామర్ (బి.డా.141.3)
9. సెర్గీ బ్రిన్ (బి.డా. 139.7)
10. జెన్సన్ హువాంగ్ (బి.డా. 137.9)

## అమెరికాలోని సంపన్న భారతీయులు

43 దేశాలకు చెందిన 125 మంది బిలియనీర్లలో మన వాళ్లే 12 మంది. అగ్రస్థానంలో జయ్ చౌధ్రీ, తొలిసారిగా సుందర్ పిచాయ్, సత్య నాదెళ్లకు చోటు దక్కింది. ఫోర్బ్స్ అమెరికా సంపన్న ప్రవాసుల జాబితా.. అమెరికాను ప్రవాస భారతీయులు మరింత సంపన్న దేశంగా మారుస్తున్నారు. ఫోర్బ్స్ విడుదల చేసిన 'అమెరికాస్ రిచెస్ట్ ఇమిగ్రేంట్స్ 2025' జాబితా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తోంది. మొత్తం 43 దేశాలకు చెందిన 125 మంది ప్రవాస బిలియనీర్లు అమెరికాలో ఉన్నట్టు ఫోర్బ్స్ గుర్తించింది. వీరిలో 12 మంది భారతీయులే ఉన్నారు. ఈ సంఖ్యాపరంగా ఇజ్రాయిల్‌ను మన దేశం అధిగమించింది. ఈ జాబితాలోని 10 దేశాల ప్రవాస బిలియనీర్లలో మూడవ వంతు మంది భారత్‌కు చెందిన వారున్నారు. ఇజ్రాయిల్, తైవాన్, కెనడా, చైనా మరో 5 దేశాలకు చెందినవారు ఉన్నారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యా నాదెళ్ల మరియు నికేశ్ అరోరా తొలిసారిగా ఈ జాబితాలో చేరారు. అగ్రస్థానంలో 17.9 బి. డాలర్ల సంపదతో జయ్ చౌధ్రీ (65) అగ్రస్థానంలో ఉన్నారు. 1980 ప్రాంతంలో యూనివర్సిటీ ఆఫ్ సిన్సినాటిలో చేరడం కోసం తొలిసారిగా విమానం ఎక్కిన ఈయన 2008లో స్కాలర్ అనే సైబర్ సెక్యూరిటీ సంస్థను ఏర్పాటు చేశారు. 2018లో నాస్ డాక్‌లో లిస్ట్ అయిన ఈ కంపెనీలో ఆయనకు, ఆయన కుటుంబానికి 40 శాతం వాటా ఉంది. హిమాలయాల్లోని చిన్న గ్రామం ఈయన స్వస్థలం. 8వ తరగతి వరకు ఆ ఊరికి విద్యుత్, పదవ తరగతి వరకు సురక్షిత నీటి సరఫరా లేదు. అటువంటి ప్రాంతం నుంచి వచ్చి అమెరికాలో చదువుకుని, ఉద్యోగంలో చేరిన ఆయన.. తర్వాత తన భార్యతో కలిసి సెక్యూర్ ఐటి అనే అంకురాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత బిలియనీర్‌గా మారగలిగారు.

## 'అమెరికాలో సంపన్న ప్రవాస భారతీయుల ర్యాంక్'

1.జయ్ చౌదరి, 2.వినోద్ ఖోస్లా, 3.రాకేస్ గంగ్వాల్, 4. రమేష్ వాధ్వనీ, 5.రాజీవ్ జైన్, 6.కవితార్క్ రామ్ శ్రీరామ్, 7. రాజ్ సర్దానా, 8.డెవిడ్ పాల్, 9.నికేష్ అరోరా, 10.సుందర్ పిచాయ్, 11.సత్య నాదెళ్ల, 12.నీరజ్ సేథీ..లు ఉన్నారు. ఈ జులై నాటికి 1బిలియన్ డాలర్ల (రూ.8550 కోట్ల) కంటే అధిక సంపద ఉన్నవారితో ఈ జాబితాను ఫోర్బ్స్ ప్రకటించింది. ఇది ఇలా ఉంటే... భారతదేశంలో గత ఏడాది '(2024)పై యూబీఎస్ నివేదిక' మేరకు.. 39 వేల మంది కొత్త మిలియనీర్లు అవతరించారు. అంత క్రితం ఏడాదితో పోలిస్తే వీరి సంఖ్య 4.4శాతం వృద్ధి చెందడంతో ప్రపంచవ్యాప్తంగా మిలియనీర్ల సంఖ్య వృద్ధి విషయంలో భారత్ నాలుగో స్థానంలో ఉందని, 'యుబీఎస్ గ్లోబల్ వెల్త్ రిపోర్ట్' వెల్లడించింది. తొలి మూడు స్థానాల్లో తుర్కియే, యూఏఈ, రష్యా ఉన్నాయి. మొత్తం 9,17,000 మంది మిలియనీర్ల (కనీసం 10 లక్షల డాలర్లు/రూ. 8.5 కోట్ల సంపద ఉన్నవారు)లో బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికా కంటే మెరుగ్గా భారత్ ఉంది. అయితే చైనా 63లక్షల మంది మిలియనీర్లతో అగ్రస్థానంలో ఉంది. మొత్తం 56 దేశాల నుంచి సమీకరించిన సమాచారం ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక ప్రకారం.. అమెరికా, మెయిన్ ల్యాండ్ చైనా చేతిలోనే సగానికి పైగా వ్యక్తిగత సంపద ఉంది. ప్రపంచ సంపదలో భారత్ వాటా 3.4శాతమే. ఆదాయ వృద్ధి తక్కువ, గత ఐదేళ్లుగా సగటు ఆదాయం వృద్ధి విషయంలో అట్టడుగు స్థానాల్లో ఉన్న ఆరు దేశాల్లో భారత్ కూడా ఒకటి. వచ్చే 25 ఏళ్లలో సంపద గరిష్టంగా బదిలీ అయ్యే దేశాల్లో భారత్ కూడా ఒకటిగా మారుతుంది. ఈ దేశంలో ఉన్న యువ జనాభా కారణంగా ఒక తరం నుంచి మరో తరానికి సంపద బదిలీ అవుతుంది. భారత దేశంలోని 'తొలి పదిమంది మిలియనీర్లు వీరే' 1.ఆకాష్ అంబానీ, 2.అనంత్ అంబానీ, 3.ఈషా అంబానీ, 4.వినోద్ భాయ్ ఆదానీ, 5.గౌతమ్ ఆదానీ, 6.రాజేష్ ఆదానీ, 7.అజయ్ ప్రేమ్ జీ, 8.దిలీప్ సంఘీ, 9.షాపూర్ పల్లోంజీ మిశ్త్రీ, 10.సజ్జన్ కుమార్ జిందాల్..

దేశంలో వ్యక్తిగత సంపద విలువ రూ.1,000కోట్లకు మించిన వాణిజ్యవేత్తలతో 360 వెల్త్ వన్ సంస్థ రూపొందించిన జాబితాలో అగ్రస్థానంలో ముఖేష్ అంబానీ వారసులు నిలిచారు. తొలితరం పారిశ్రామికవేత్తలతో పాటు వారసత్వంగా వచ్చిన వ్యాపార సామ్రాజ్యాలను మరింతగా విస్తృతం చేసిన వారు ఈ జాబితాలో చోటు చేసుకున్నారు. 'తెలుగు రాష్ట్రాల నుంచి తొలి పదిమంది' 1.చిరంజీవి సింగ్ సలూజా, 2.పెనాక్ సునీల్ రాణి, 3.నీలిమా ప్రసాద్ దివి, 4.సత్ చంద్ర కిరణ్ దివి, 5.పి.వెంకట కృష్ణారెడ్డి, 6.పీపీ రెడ్డి, 7.జీవీ ప్రసాద్, 8.బి.పార్థసారథి రెడ్డి, 9.కె సతీష్ రెడ్డి, 10.కవితా ప్రసాద్ అల్లూరు. ప్రపంచవ్యాప్తంగా సంపన్నులుగా మన భారతీయులు (తెలుగు) వారు కొనసాగుతున్నారు.వీరి మూలాలైన తాత, ముత్తాతలు, వీరికి ఆ స్థాయిని కల్పించిన జన్మభూమి వీరు భారత దేశానికి తమ వంతు బాధ్యతతో సేవలు అందించాల్సిన అవసరాన్ని చేస్తున్నాయి. ఈ దేశంలో పేదరికం,అసమానతలు ఉపాధిలేమి, నిరుద్యోగంలాంటి సామాజిక రుగ్మతలను రూపుమాపటానికి వారు చేయూత కావాలి. భారత ప్రభుత్వంపై కూడా వారు పరిశ్రమలు పెట్టడానికి సౌకర్యం కల్పించి సద్వినియోగ పరుచుకోవాల్సిన బాధ్యత మెండుగా ఉంది.

– మేకిరి దామోదర్
9573666650

# రిటైర్డ్ ఉద్యోగుల ఎదురుతెన్నులు

మూడు దశాబ్దాలకు పైగా వివిధ హోదాలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన తర్వాత శేష జీవితం ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా గడాలని కోరుకుంటారు. పిల్లల చదువులు, ఇతరత్రా ఖర్చులు పోను ఎంతో కొంత పొదుపు చేసుకుని ఆ పొదుపు డబ్బుతో ఉద్యోగ విరమణ పొందిన తర్వాత తాము స్థిరపడటం పిల్లలు స్థిరపడే విధంగా ఆలోచనలు చేయడం పెళ్లిలు, సొంతింటి కలలు నెరవేర్చుకోవాలన్న ఆలోచన చాలా మంది ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉంటుంది. కానీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఉద్యోగ విరమణ చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపులు జరగాక ఏడాదిన్నర కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రాట్యూటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఎరన్ లీవ్, జిపిఎఫ్ తదితర సొమ్ముల కోసం ఎదురుచూస్తున్నారు. ఉద్యోగ జీవితంలో ఉన్నప్పుడు వీటి ద్వారా స్థిరపడే మార్గాలను ఎంచుకుంటారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏడాదిన్నర గడిచినా బకాయిలు చెల్లించడం లేదు. ఉద్యోగ విరమణ తర్వాత పింఛన్ ఇస్తున్నారు కానీ బకాయిలు మాత్రం చెల్లించడం లేదు బకాయిలు అందుకోకుండానే ప్రాణాలు కోల్పోయిన వారు రాష్ట్రంలో చాలా మంది ఉన్నారు. వీరి కుటుంబ సభ్యుల వేదన వర్ణణాతీతం. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇకనైనా పింఛన్ డబ్బులు చెల్లించండి అంటూ వేడుకుంటున్నారు. రాష్ట్ర చరిత్రలో ఈ పరిస్థితి ఎన్నడులేదన్న వాదన వినిపిస్తుంది. గతంలో ఉద్యోగ విరమణ చేసిన కొద్ది రోజుల్లోనే ఉద్యోగికి రావాల్సిన ఆర్థిక చెల్లింపులు చేసేవారు. ఒక ఉపాధ్యాయుడు ఉన్నత విద్యను అభ్యసించిన తన కుమార్తె వివాహాన్ని ఉద్యోగ విరమణ తర్వాత వచ్చే డబ్బుతో చేయాలని ఏడాది కాలంగా ఎదురు చూస్తున్నాడు.ఉద్యోగం తప్ప మరో ఆర్థిక వనరు ఎంచుకోలేని ఆయన కేవలం పింఛన్ పైనే ఆధారపడ్డాడు. కుమార్తె వివాహం చేసేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాడు. ఉద్యోగాల్లో ఉండి అక్రమ సంపాదన ద్వారా ఆర్థికంగా బలపడిన వారికి ఇబ్బందులు లేకపోవచ్చు కానీ నిబద్ధతతో ఉద్యోగం చేస్తూ పై సంపాదనకు పాల్పడని వారికి విరమణ అనంతరం వచ్చే డబ్బే ప్రదానం. చాలీ చాలని వేతనంతో జీవితాన్ని ప్రారంభించిన వారికి పిల్లల చదువులు, ఉద్యోగాలు, పెళ్లిళ్లు, అనారోగ్యాలతో సతమతమైన వారు పెన్షనరీ బెనిఫిట్స్ అందుకోలేకపోతున్నారు. 2024 ఏప్రిల్



నుండి ప్రతి నెల ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందుతున్నారు. ఈ ఏడాది జూన్ మాసంలో ఒక్క ఖమ్మం జిల్లాలోనే 45 మంది వివిధ శాఖల్లో పనిచేసిన వారు ఉద్యోగ విరమణ పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా 10వేల మందికి పెన్షనరీ బెనిఫిట్స్ చెల్లించబడలేదని తెలుస్తుంది. కొందరైతే బెనిఫిట్స్ రాగానే చెల్లిస్తామని అప్పులు తెచ్చి తీర్చలేక పింఛన్ డబ్బులతో నెలనెల వడ్డీలు కడుతున్న వారు ఉన్నారు. ప్రభుత్వం వెంటనే మానవత దృక్పథంతో ఆలోచించి ఉద్యోగ విరమణ పొందిన వారందరికీ వెంటనే బెనిఫిట్స్ అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఆర్టిసిలోనూ అదే పరిస్థితి

ఆర్టిసి, సింగరేణి మొదలైన కార్పొరేషన్లలో పదవి విరమణ చేసిన రోజే బెన్‌ఫిట్స్‌ను అందించేవారు. చెక్కుల రూపంలో ఉద్యోగ విరమణ ఉద్యోగులకు రావాల్సిన మొత్తాన్ని అందించేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. 2024లో ఆర్టిసిలో ఉద్యోగ విరమణ పొందిన వారికి సైతం ఇప్పటి వరకు బకాయిలను చెల్లించలేదని ఆర్టిసి కార్మికులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టిసి లాభాల్లో పయనిస్తుందన్న ప్రచారం నేపథ్యంలో ఇప్పటికైనా బకాయిలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పెన్షనర్ల ఇబ్బందులు తొలగేదెన్నడు...?

వివిధ హోదాల్లో రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. వయో వృద్దులైన పెన్షనర్లకు ఈహెచ్‌ఎస్ స్కీమ్ ఉన్నా అవి పని చేయడం లేదు. పెన్షనర్లకు అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ వైద్యం అందించేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నోషనల్ ఇంక్రిమెంట్, పెన్షనరీ డైరెక్టరీ ఏర్పాటు, తెలంగాణలో పెన్షనర్స్ భవన్, ట్రెజరీ ద్వారా పెన్షన్ చెల్లింపు తదితర సమస్యల పరిష్కారానికి పెన్షనర్ల సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘాల సమన్వయ కమిటీ పిలుపునిచ్చింది.

ప్రజాపక్షం ఖమ్మం ప్రతినిధి


# అమృతాహారం అవకాడో

అవకాడో అనే ఆధునిక అమృత ఆహారం. ఇది అద్భుత పోషక విలువలతో సూపర్ ఫ్రూట్‌గా ప్రసిద్ధిగాంచింది. అమెరికా లాంటి పాశ్చాత్య దేశాల్లో విస్తారంగా వినియోగిస్తున్న అవకాడో పండ్లు నేడు భారతదేశంలోకి అడుగిడి, అందరికీ అమృత ఆహారంగా మెనూలో చేరింది. అవకాడో అనేది కూరగాయల వర్గానికి చెందినది కాదని, అది ఒక పండు అని తెలుసుకోవాలి. అవకాడో పండ్లను సలాడ్, టోస్ట్, స్మూథీస్, స్ప్రెడ్, రుచికరమైన పండుగా పలు రూపాల్లో ఉపయోగించడానికి అలవాటు పడుతున్నాం. ఇటీవల విశేష ఆదరణ పొందిన ఈ అద్భుత పండ్ల పోషక విలువలను ప్రజలకు తెలియజేయడానికి ప్రతి ఏటా జులై 31న జాతీయ అవకాడో దినం పాటించటం 2018 నుంచి ఆనవాయితీగా మారింది. ఆరోగ్యకరమైన, రుచికరమైన అవకాడో పండ్లలో అత్యంత ముఖ్యమైన పోషక విలువలు ఉంటాయి. అర్టి పండ్లలో కన్న అవకాడో పండ్లలో అధిక పొటాషియం ఉంటుంది. చెట్టు నుంచి తెంపిన తర్వాతనే అవకాడో పండుతుంది. ఆకలి పెంచడానికి మంచి అపటైజర్‌గా పని చేస్తుంది. 2015లో అమెరికా దేశంలోనే దాదాపు 4.25 బిలియన్ల అవకాడో పండ్ల అమ్మకాలు జరిగాయి. గుండె ఆరోగ్యాన్ని పరిరక్షించే అవకాడోలో మంచి కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇన్సులిన్ నిరోధకతను సరి చేయగల అవకాడోలో విటమిన్ సి,ఈ,కె లాంటివి సమృద్ధిగా ఉంటాయి. అల్జీమర్స్ వ్యాధి కట్టడికి అవసరమైన ఒమెగా 3 ఫాటీ ఆమ్లాలు అవకాడోలో ఉంటాయి. అవకాడో ఉన్న ఓలిక్ ఆసిడ్ వల్ల చర్మం తేమతో ఎర్రబారకుండా, ఇరిటేషన్ కలిగించకుండా చర్మ ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది. జాతీయ అవకాడో దినం వేదికగా ఈ సూపర్ ఫ్రూట్ పోషక విలువలను అవగాహన పరచడం, పలు కొత్త రకాల అవకాడో రెసిపీలు, అవకాడో వంటల పోటీలు, మన భోజనంలో అవకాడోను నిత్యం చేర్చడం, అవకాడో ప్రేమికుల అభిప్రాయాలను తెలుసుకోవడం లాంటి ప్రచార కార్యక్రమాలు చేపట్టవచ్చు.



## ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: ట్రాక్టర్ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మండల పరిధిలోని కొల్ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ లోని బాపూజీ నగర్ స్టేజీ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ మండలం తాటికోల్ గ్రామానికి చెందిన దమ్మోజు ఆంజనేయాచారి(37) కొండమల్లేపల్లి పట్టణంలోని తమ బంధువుల ఇంటికి పని నిమిత్తం వచ్చి పని ముగించుకొని తిరిగి మధ్యాహ్నం తాటికోల్‌కు వెళుతుండగా ఉప్పువాగు సమీపాన బాపూజీనగర్ స్టేజీ వద్ద యూటర్న్ వద్ద ఆకస్మాతుగా వచ్చిన ట్రాక్టర్ ఆంజనేయచారి వెళుతున్న బుల్లెట్‌ను ఢీ కొట్టడంతో ఆంజనేయచారి అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మృతుడి అక్క ఈశ్వరమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీర రమేష్ తెలిపారు.



## సిఎంఆర్ బకాయిలు ఉంటే కేటాయింపులు ఇవ్వొద్దు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: సిఎమ్మార్ ధాన్యం పెండింగ్ ఉన్న మిల్లులకు వచ్చే సీజన్‌లో ఎట్టి పరిస్థితుల్లో కేటాయించేది లేదని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ అధికారులు, అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి 2023/24 పెండింగ్‌పై జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బకాయిలు పెండింగ్‌లో ఉన్న మిల్లర్లు గడువులోగా సిఎమ్మార్ ధాన్యాన్ని అందించాలని అదేశించారు. సిఎమ్మార్ పెండింగ్‌లో ఉన్న మిల్లర్లకు వచ్చే సీజన్‌లో సిఎమ్మార్ కేటాయించేది లేదన్నారు. బకాయి ఉన్న మిల్లర్లు 100 శాతం బ్యాంక్ గ్యారెంటీ ఇస్తేనే ఆ మిల్లులకు సిఎమ్మార్ ధాన్యాన్ని కేటాయించడం జరుగుతుందని తెలిపారు. మిల్లర్లు సిఎమ్మార్ ధాన్యాన్ని వేగంగా అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌వో మోహన్‌బాబు, ఎసిఎస్‌వో శ్రీనివాసరెడ్డి, ఎఎం బెనర్జి, డిటిలు, ఆర్ఐ లు పాల్గొన్నారు.



## యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాలని కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో ఆయన సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా అధికారులు వెంటనే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే గత ప్రభుత్వాల కంటే ముందుగానే సాగునీటిని విడుదల చేశామని, ఎరవులు కొరత లేకుండా, బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా, దుకణాదారులు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా నిరంతరం సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. తమ సమస్య ఏదైనా ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నట్లయితే 15రోజుల్లో సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు కృషి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ రేషన్ కార్డులు

దేవరకొండ శాసనసభ్యులు బాలునాయక్



ప్రజాపక్షం/చింతపల్లి : అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేస్తామని దేవరకొండ శాసనసభ్యులు నైనావత్ బాలునాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఆహార భద్రత కార్డులను ఎమ్మెల్యే బాలు నాయక్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో లబ్ధిదారులకు బుధవారం రేషన్ కార్డులు అందజేశారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమం, అభివృద్ధి పేరుతో పేదలకు పథకాలు అందజేస్తుందన్నారు. చింతపల్లి మండలానికి 1666 నూతన రేషన్ కార్డులు మంజూరు అయ్యాయన్నారు. ప్రజా ప్రభుత్వం పేదల కోసం రేషన్ కార్డులు పంపిణీతో పాటు, సన్న బియ్యం ఇచ్చే కార్యక్రమం చేపట్టిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఏక కాలంలో 2లక్షల రూపాయల వరకు రైతు రుణమాఫీని రైతుల ఖాతాలో జమ చేసిన ఏకైక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్నారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, అంగిరేకుల నాగభూషణ్, కొండూరి భవాని పవన్ కుమార్, ముచ్చర్ల యాదగిరి, వెంకటయ్య గౌడ్, యాచారం యాదయ్య గౌడ్, జితేందర్ రెడ్డి, నర్సిరెడ్డి, గోవర్ధన్, శ్రీనివాస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేసుల దర్యాప్తులో సమగ్ర విచారణ

జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్



ప్రజాపక్షం/మర్రిగూడ: శాంతి భద్రతల పరిరక్షణకు అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలు అందుబాటులో ఉంటూ పని చేయాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశించారు. బుధవారం దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలోని మర్రిగూడ పోలీస్ స్టేషన్ లో జిల్లా ఎస్పి ఆకస్మిత తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ లో సిబ్బంది పని తీరు,పోలీసు స్టేషన్ పరిధిలోని పరిసరాలు,స్థితిగతులు గురించి యస్.ఐ ని అడిగి తెలుసుకుని రిసెప్షన్ మేనేజ్మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్,స్టేషన్ రైటర్, లాక్ అప్, యస్.హెచ్.ఓ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించి, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివరాలు,స్టేషన్ రికార్డ్ లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని దర్యాప్తులో ఉన్న కేసులను సమగ్ర విచారణ చేపట్టి చట్టప్రకారం శిక్ష పడే విధంగా కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పి మౌనిక,ఎస్.ఐ కృష్ణా రెడ్డి స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్ల కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో కల్పించేలా ఉద్యమాన్ని ఉదృతం చేయాలని, రిజర్వేషర్లను బిజెపి ప్రభుత్వం వ్యతిరేకించడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఊర రామ్మూర్తియాదవ్, జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ లు అన్నారు. జిల్లా కేంద్రంలోని మహావీర్ పుడ్‌కోర్టులోని మిని ఫంక్షన్‌హాల్‌లో బుధవారం జనసేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు తగుళ్ల జనార్ధన్ యాదవ్ ఆధ్వర్యంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా కుల గణనతో పాటు, బీసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ క్యాబినెట్ తీర్మానించడం హర్షణీయమని తెలిపారు. బిఆర్ఎస్ హాయంలో బిసిలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. తమిళనాడు తరహాలో తెలంగాణ రాష్ట్రం బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టపల్లి సైదులు, వెంకట్, సైదులు, గుండు వెంకన్న యాదవ్, సందీప్, బొల్లెద్దు వినయ్, భద్రబోయిన సైదులు, బడుగుల నాగార్జున, కోలా కరుణాకర్, బొమ్మగాని వినయ్, మల్లేష్, శివ పాల్గొన్నారు.



# ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి

నూతన రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



ప్రజాపక్షం/గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంతరావు చేతుల మీదుగా పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్యమాట్లాడుతూ పేదోళ్ల ఆత్మ గౌరవానికి ప్రతిక అయిన తెల్లరేషన్ కార్డును అర్హులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో అందించడం జరుగుతుందని అన్నారు. రైతులు ఆనందంగా ఉన్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని నమ్మి రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగు నీరు అందించడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల పదేళ్ల నీరిక్షణకు తెరదించి సుమారుగా 8 లక్షల నూతన రేషన్ కార్డులు జారీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డిదని అన్నారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ఎవరు అధైర్య పడవద్దని తెలిపారు. గుండాల మండలంలో నూతనంగా 522 రేషన్ కార్డులు మంజూరు కావడం జరిగిందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని అలాంటిది తమ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవానికి రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. తమ ప్రభుత్వంలో ఎస్సి వర్గీకరణతో పాటు 42 శాతం బిసి రిజర్వేషన్‌కు సిఫారస్ చేయడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పేదలకే చేరాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు రైతు భరోసా ఇచ్చిందని, రుణమాఫీ చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరిగౌడ్, పిఏసిఎస్ చైర్మన్ బిక్షం, మండల పార్టీ అధ్యక్షులు రాంరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ విమల వెంకటేశ్వర్లు, ఎంపిడివో, సివిల్ సప్లై అధికారి, కుమార్, డా. వెంకన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు



ప్రజాపక్షం/నూతన్‌కల్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు మంజూరు చేయడంతో పాటుప్రతి ఒక్కరికి ఆరుకేజీల చొప్పున సన్నబియ్యం అందజేయడం, అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి పేదింటికలను నెరవేర్చి రాష్ట్రంలోని ప్రతి పేదవాడి కళ్లలో ఆనందాన్ని నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఏ ప్రభుత్వం పేద ప్రజలను పట్టించుకోలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నాయకత్వంలో జిల్లాలో సన్నబియ్యం, నూతన రేషన్‌కార్డుల పంపిణీ చేశారని గుర్తు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ మాట్లాడుతూ మండలంలో 1959 నూతన రేషన్‌కార్డులు మంజూరు చేయడం జరిగిందని, మొత్తం 6398 మంది నూతన రేషన్‌కార్డు సభ్యుల పేర్లు నమోదు చేయడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు రేషన్‌కార్డు కోసం ఎప్పుడైన దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రీయ అని అన్నారు. అర్హులైన, నిరుపేద, ఇల్లులేని వారికి మండలంలో 280 మంది ఇండ్లు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఎర్రపహాడ్ గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్ర నూతన భవన నిర్మాణానికి, దిర్శనచర్ల గ్రామంలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాదవరావు, మండల స్పెషల్ ఆఫీసర్ యాదగిరి, మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ సిహెచ్ వెంకన్న, పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ, తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునిత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ నాయకులు జన్నారెడ్డి పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేద్దాం

యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

జిల్లాలోని ప్రధాన సమస్యల పైన 15 తీర్మాలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన జిల్లా మహాసభ




ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : రానున్న రోజుల్లో సిపిఐని యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్మాణ పరంగా బలోపేతం చేసి, మహాసభలో చేసిన 15 తీర్మానాలపై భవిష్యత్తులో పోరాటాలు ఉద్యమాలు నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని, స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నూతనంగా ఎన్నికైన సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం భువనగిరి పట్టణంలోని రాఘవేంద్ర బ్యాంకెట్ హాలో నిర్వహించిన వేలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ వలిగొండ మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్‌లో 29 జూలై 2025న జరిగిన సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా 4వ మహాసభలో ముఖ్యఅతిధులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోద శ్రీరాములు హాజరైనారని రాష్ట్ర నాయకత్వం సమీక్షంలో 17 మంది కార్యవర్గ సభ్యులుగా 45 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. అందులో సిపిఐ జిల్లా కార్యదర్శిగా యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులుగా బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, కార్యవర్గ సభ్యులుగా బండి జంగమ్మ, కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, ఎండి ఇమ్రాన్, బోడ సుదర్శన్, ఉప్పల ముత్యాలు, చెక్క వెంకటేష్, బచ్చనగోని గాలయ్య, కుసుమని హరిచంద్ర, ఏశాల అశోక్, పల్లె శేఖర్ రెడ్డి, పెరబోయిన మహేందర్, చిగుర్ల లింగం, కురిమిద్ద శ్రీనివాస్‌లను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ మహాసభల్లో జిల్లాలోని ప్రధాన సమస్యలపై చర్చించి 15 తీర్మానాలు చేశామని, తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని రాష్ట్ర నాయకత్వం ప్రకటించారని యానాల దామోదర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులతో పాటు జిల్లా సమితి సభ్యులు అంజయ్య, ఉప్పల శాంతి కుమార్, మూల పోచయ్య, భారతమ్మ, మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, గనబోయిన వెంకటేష్, మల్లేశం పాల్గొన్నారు.

## అమ్మకు భరోసా

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి

ప్రజాపక్షం/చౌటుప్పల్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలతో పాటు సాధారణ ప్రసవాలు పెంచడమే లక్ష్యంగా భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఏర్పాటు చేసిన అమ్మకు భరోసా కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోనీ గర్భిణీ దడిపల్లి మమతను ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లతో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి కలిసి పండ్లు, పౌష్టికాహారం ఇచ్చి పుట్టింటివారు జరిపినట్టు సీమంతం నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ సర్కారు దవాఖానల్లో అందిస్తున్న సదుపాయాలను వివరించారు. సాధారణ ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేసి, ఆపరేషన్తో కలిగే ఆర్థిక, ఆరోగ్య నష్టం గురించి అర్థమయ్యేలా తెలియజేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎంసి కవిత ఆర్పి, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, ఆశ వర్కర్ అంగన్వాడి టీచర్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# మూడేళ్లలో డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తాం

వానాకాలం పంటకు డిండి ప్రాజెక్టు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే బాలునాయక్



ప్రజాపక్షం/డిండి : డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగానికి వానాకాలం పంటకు సంబంధించి డిండి ప్రాజెక్టు నీటిని లెఫ్ట్ కెనాల్ ద్వారా దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ ఇరిగేషన్ అధికారులతో కలిసి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ ప్రాజెక్టు నీటిని ఇంజనీర్లు అధికారులు రైతులు సమన్వయంతో పంటలు పండే విధంగా నీటిని పొదుపుగా వాడుకొని ఇబ్బంది లేకుండా పంటలు పండేలా కృషి చేయాలన్నారు. ఎగువన కురిసిన వర్షాల వల్ల ప్రాజెక్టులోకి నీరు రావడం జరుగుతుందని కేఎల్ఐ ద్వారా నడిచే మోటార్లతో ఎగువ నుండి నీటిని తీసుకురావడానికి ప్రయత్నాలు సాగిస్తున్నామని తెలిపారు. వరుణుడు సైతం కనికరించి వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి జులై నెలలో మీరు రావడం శుభ పరిణామం అని అన్నారు. గత సంవత్సరం సైతం పూర్తి స్థాయిలో పంటలు పండడం జరిగిందని కేఎల్ఐ ద్వారా నీటి కోసం సిఈ, ఎస్ఈలతో మాట్లాడి సానుకూల వాతావరణంలో నీరు అందించేందుకు వీలుందని రైతులతో సమన్వయం చేసుకొని అధికారులు నీటినందించాలన్నారు. ఎదుల నుండి డిండి ప్రాజెక్టులోకి నీటిని తరలించేందుకు డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని అన్నారు. ఈప్రాంత రైతాంగానికి సాగునీరు అందించేందుకు డిండి లిఫ్ట్ ఇరిగేషన్ దోహదపడుతుందని తెలిపారు. అనంతరం ఆర్పి ఆర్పి గురుకుల పాఠశాలలో 10.80లక్షల హెచ్‌డిఎఫ్‌సి నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు ఐమాస్ట్ లైట్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కెజిబివి పాఠశాలలో 8లక్షల హెచ్‌డిఎఫ్‌సి నిధులతో మౌలిక సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. అనంతరం భవిత సెంటర్‌ను పరిశీలించారు. బయట సెంటర్‌లో అన్ని సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. డిండి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఎల్‌ఏ పరిశీలించారు. భోజన నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో మౌలిక సదుపాయాలు కల్పన, ప్రహరీ గోడ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, ప్రాజెక్టు ఈఈ ఎలమందయ్య, డిఈ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు, మండల పార్టీ అధ్యక్షులు రాజేష్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, కనకాచారి, మైనోద్దిన్, వెంకటరమణ, నాయకులు భాస్కర్‌రెడ్డి, రుక్మారెడ్డి, నాగార్జున్‌రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్ గౌడ్, ఎంఈవో గోప్యానాయక్ పాల్గొన్నారు.




## అపార్ట్‌మెంట్ అడ్డాగా పేకాట

ఐదుగురిని వలపన్ని పట్టుకున్న స్పెషల్ బ్రాంచ్ పోలీసులు

రూ. 4,600 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు సీజ్

ప్రజాపక్షం/సూర్యాపేట: గుట్టుచప్పుడు కాకుండా ఓ అపార్ట్‌మెంట్‌ను అడ్డగా చేసుకుని గత కొంతకాలంగా సాగుతున్న పేకాట స్థావరాన్ని సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్ పోలీసులు బుధవారం నమ్మదగ సమాచారంతో వలపన్ని పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి నుండి రూ.4600 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ వసుధ ఎలైట్ అపార్ట్‌మెంట్‌లోని ఐదవ ఫ్లోర్‌లో ఉన్న ఓ ఫ్లాట్‌లో ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా సూర్యాపేట స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్ వాహహంలో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామానికి చెందిన గార్లపాటి వెంకటరెడ్డి తో పాటు జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు బోళ్ల సంజీవరెడ్డి, శ్రీశ్రీనగర్‌కు చెందిన మరో రిటైర్డ్ ఉపాధ్యాయులు నిమ్మల వెంకటేశ్వర్లు, మోతె మండలం రావిపహాడ్ గ్రామానికి చెందిన యర్రా లక్ష్మారెడ్డి, చివ్వెంల మండలం తిరుమలగిరి గ్రామ రేషన్‌డీలర్ కంచర్ల లింగారెడ్డి లు ఉన్నారు.

## అనుమానంతో భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : అనుమానంతో కట్టుకున్న భార్యనే కడతేర్చేందుకు కత్తితో దాడి చేసిన సంఘటన భువనగిరి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భువనగిరి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని రాయిగిరి గ్రామంలో నివాసం ఉంటున్న వరంగల్ జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగబోయిన లావణ్య కొంత కాలంగా భర్త రవితో విభేదాల కారణంగా దూరంగా ఉంటూ తమ నలుగురు పిల్లలతో కలిసి గత కొన్ని నెలలుగా భువనగిరి మున్సిపల్ పట్టణంలోని రాయిగిరిలో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తన భార్య లావణ్య, శంకర్ అనే మరో వ్యక్తితో కలిసి ఉండటాని రవి చూసినట్లు చెప్పారు. వీరు కలిసి ఉండటాన్ని తట్టుకోలేక పోయిన రవి తన భార్య లావణ్యను కోడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. స్థానికులు గమనించి 108 సహాకారంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికీ తరలించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న భువనగిరి రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడు రవిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రజావాణిలో వృద్ధుల మొర

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: బిడ్డ,కొడుకు చేతిలో మోసపోయామని ప్రత్యేక ప్రజావాణిలో వృద్ధ దంపతులు తమ మొరను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆలకించారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండలంలోని ఆలగడప గ్రామపంచాయతీ ఆలగడప క్యాంపులో నివసిస్తున్న యాట్ల దుర్గమాంబ వృద్ధురాలు నడవలేని స్థితిలో ఉన్న భర్త యాట్ల నరసింహామూర్తి తాము మోసపోయామని ఫిర్యాదు చేశారు. వృద్ధ దంపతుల వద్దకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వెళ్లి వారి ఫిర్యాదును రాసి స్వీకరించారు. సర్వే నెం.543/2లో ఉన్న 4.25ఎకరాల భూమిలో తనకున్న నలుగురు సంతానంలో పెద్ద కుమారుడు యాట్ల శ్రీనివాస్‌రావు తన భార్య పేరిట 2 ఎకరాలు, కూతురు ఈదర భారతి అలియాస్ సుబ్బలక్ష్మీ భర్త వీరభద్రరావులు మోసపూరితంగా 2 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఉన్న భూమి కాస్త ఇద్దరు తీసుకున్నారని తమను పోషించడం లేదన్నారు. తమకు న్యాయం చేయాలని వారు ఎమ్మెల్యేను వేడుకున్నారు. 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని వృద్ధ దంపతులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



## ఎరువులు పురుగు మందుల దుకాణాల తనిఖీలు

ప్రజాపక్షం/ఉండవెల్లి: మండల పరిధిలోని ఎరువులు పురుగు మందులు దుకాణాలను తనిఖీలు చేసి పరిశీలిస్తున్నట్లు ఉండవెల్లి మండల వ్యవసాయ అధికారి అనిత తెలిపారు. బుధవారం అల్లంపూర్ చౌరస్తాలోని చెరువులను పురుగుమందుల దుకాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను పరిశీలించారు. రైతులకు అన్యాయము ఇబ్బందులు కలగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖచ్చితమైన ధరల పట్టిక నమోదు చేసి స్టాక్ వివరాలను పొందుపరచాలని వారు డీలర్లకు సూచించారు. అల్లంపూరు చౌరస్తాలోని షణ్మిక అగ్ర ఏజేన్సీ పవన్ ట్రేడర్స్ తదితర దుకాణాల డీలర్లే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. కొనుగోలు చేసిన రైతులకు ఖచ్చితంగా రసీదు ఇవ్వాలనే వారు తెలిపారు. ఎరువులు ఈ పాస్ మిషన్ ద్వారా ఆధార్‌కార్డు నమోదు చేసి చిన్న సన్న కారు రైతులకు ఉపయోగపడే విధంగా డీలర్లు పనిచేయాలని వారు తెలిపారు. ఎరువులు పురుగుల మందుల విషయాలపై అనుమతి లేని వాటిని విక్రయిస్తే లైసెన్సు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

# ట్రైనీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నర్సరీని, సందర్శించి, ఉపాధి హామీ పథకంలో మంజూరు అయిన హార్టికల్చర్ డ్రాగన్ ఫ్రూట్స్ తోటను సందర్శించి ప్రభుత్వం నుంచి మీకు సహకారం అందించిందని రైతును వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతును అభినందించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాలలోని అన్ని రికార్డులను తనిఖీ చేయనైనది. ప్రధానోపాధ్యాయులు రవీందర్ నాయక్ కు విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు చూడాలని కోరారు. అక్కడే ఉన్న అంగన్వాడీ సెంటర్, కూడా సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, కోరారు. శిక్షణ కలెక్టర్ వెంబడి ఉట్కూరు మండల ఎంపీడీవో ధనుంజయ గౌడ్, పంచాయితీ కార్యదర్శి శివ, ఎంపీఓ అగ్రికల్చర్ ఆఫీసర్ గణేష్ రెడ్డి, రాజు, ఉపాధి హామీ సిబ్బంది ఎపిఓ, లక్ష్మా రెడ్డి, టిఏ శివ, సీనియర్ మేటి ఆర్.నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

# చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలంలోని వడ్డెమాన్ గ్రామంలో బాకీవెంకట్ రాములు(47) హమాలీ పనిచేసుకుంటూ జీవనం గడిపేవాడు. బుధవారం ఉదయం గ్రామంలోని సూరాయికుంటలో చేపలుపట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలోపడి చనిపోయాడు. దారిలో ఉన్న బాటసారులు గమనించి కాపాడటానికి వెళ్లగా అప్పటికే చనిపోయి ఉన్నాడు. ఈవిషయం పోలీసులకు సమాచారం అందించడంతో అనుమానస్పదమృతిగా పోలీసులు కేసు నమోదుచేసి శవాన్నిపోస్టుమార్టం కోసం నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.



# తెలంగాణ పబ్లిక్ స్కూల్ పేదలకు వరం

రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి

**ప్రజాపక్షం/వంగూర్ :** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మండలకేంద్రంలో ఏర్పాటు చేస్తున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ పేదలకు వరంలాంటిదని రాష్ట్రవిద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి అన్నారు. బుధవారం తెలంగాణపబ్లిక్ స్కూల్‌కు స్థలాన్ని పరిశీలించారు. రూ.16కోట్ల నిధులతో చేపట్టనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన నిర్మాణానికి ఎస్ఎంసి కమిటీ పూర్తి బాధ్యత అన్నారు. భవననిర్మాణ పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్లు అవినీతికి పాల్పడితే తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు చారకొండ వెంకటేష్, విశ్వేశ్వరరావు, ఈఈ రామ్ చందర్, నోడల్ ఆఫీసర్ గోపాల్, ఏఈ కోటేశ్వరరావు, డిఇఓ ఆఫీస్‌ప్రతినిధి నూర్దీన్, ఎంఈవో మురళిమోహన్‌చారి, ఎస్ఎంసి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అవకతవకలు సహించేది లేదు



జడ్పి సిఈఓ వెంకట రెడ్డి

**ప్రజాపక్షం/ జడ్చర్ల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలలో ఎలాంటి అవకతవకలు జరిగినా సహించేది లేదని మహబూబ్‌నగర్ జిల్లా జడ్పీ సీఈఓ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం జడ్చర్ల మండల పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ సోషల్ అడిట్ అభ్యంతరాలు, సాముహిక వ్యక్తిగత ఇంకుడు గుంతల ఏర్పాటు ఆసరా పెన్షన్లు, ఉపాధి హామీ పారామీటర్లు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి సంబంధించిన అధికారులతో చర్చించారు. అదేవిధంగా ప్రజలకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు, ఏంపిఓలు, ఏపీఓలు, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కల సాకారం చేసిన ప్రజా ప్రభుత్వం



ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** అర్హులైన వారందరికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రంలో ప్రైవేట్ పంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లుతో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన రేషన్ కార్డు లబ్ధిదారులకు ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు 6 గ్యారంటీలను అమలు చేస్తోందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియతో పేదలు ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్న వారికి లబ్ధి చేకూరనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ సాయి చరణ్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, ఖిల్లా ఘనపూర్ మండల కాంగ్రెస్ నాయకులు విజయ్, దివ్యాంగుల సంఘం అధ్యక్షులు రమేష్, సింగిల్ విండో చైర్మన్ మురళీధర్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తండాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

క్రీడల శాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/అమరచింత :** గ్రామీణ ప్రాంతాలను, తండాలను అభివృద్ధి చేయుటకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి డా.వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం అమరచింత మండల పరిధిలోని చంద్రనాయక్ తండాల్లో 11.90 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మితమైన బోర్‌వెల్ పైపులైన్‌ను వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నివాసముంటున్న తండావాసుల అభివృద్ధికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. తండాలలో నెలకొన్న మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. చంద్రప్ప తాండ అనుసంధానంగా ఉన్న తుక్యానాయక్, దీప్లనాయక్ తండాలకు మంచినీటి సౌకర్యం కల్పిస్తూ ప్రత్యేకంగా బోర్వెల్ పైపులైన్ పనులను చేపట్టిందని మంత్రి పేర్కొన్నారు. చంద్రప్పతాండాల్లో ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి 50 లక్షలు నిధులను మంజూరు చేయుటకు ఆగస్టు 14న ప్రోసీడింగ్ పత్రాన్ని తండావాసులకు అందజేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కల్లుగీత సెల్ డిపార్ట్మెంట్ చైర్మన్ కేశం నాగరాజ్ గౌడ్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, సీఐ శివకుమార్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఆయుబ్ ఖాన్, మండల అధ్యక్షుడు కేజీ, మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎస్ఎం అరుణ్ కుమార్, ఎస్టీ మండల అధ్యక్షుడు హన్మంతు నాయక్, కాంగ్రెస్ తండా అధ్యక్షుడు బద్యనాయక్, నాయకులు రాజునాయక్ , నాగు నాయక్ , శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా భద్రత-పోలీసు బాధ్యత

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు మహబూబ్ నగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆల్మాస్ ఫంక్షన్‌హాల్‌లో ప్రజాభద్రత పోలీసు బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పట్టణ డిఎస్పి వెంకటేశ్వర్లు కాలనీ పెద్దలు, యువకులు విద్యార్థులతో మమేకమై సుదీర్ఘంగా మాట్లాడారు. గ్రామాలు, పట్టణాలు, మారుమూల ప్రాంతాలలోని ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, చట్టాలపై అవగాహన కల్పించడం, నేరాల నివారణకు ప్రజలను చైతన్యవంతం చేయడం వంటి అంశాలపై వివరంగా వెల్లడించారు. పోలీసుల ఉనికి భద్రత కోసం చట్టపరంగా జీవించే వారికి భయపడాల్సిన అవసరం లేదు. వర్గాలుగా విడిపోయి గొడవలు పెట్టడం సమాజ అభివృద్ధికి ఆటంకం. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు అన్ని వేళలా పోలీసు రికార్డులో ఉంటారు. ఇది జీవితాంతం మచ్చ. మహిళల పట్ల గౌరవం తప్పనిసరి వేధింపులపై శిక్షలు తీవ్రంగా ఉంటాయి. సైబర్ మోసాలకు లొంగకండి. ఆశలకు బలి కాకండి రోడ్డు భద్రత పాటించాలి. మద్యం సేవించి వాహనాలు నడపకండి. ప్రభుత్వ పథకాలను దుర్వినియోగం చేయరాదు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి వారికి పెద్దలు ఆదర్శంగా ఉండి మహబూబ్‌నగర్ జిల్లాను నేర రహిత జిల్లాగా మార్చాలన్న జిల్లా ఎస్పీ డా.జానకి సంకల్పాన్ని




విన్న కాలనీ ప్రజలు పోలీసు శాఖపై నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ప్రజలతో పోలీసుల భాగస్వామ్యం ద్వారా సమాజ శాంతి భద్రతలు మెరుగుపడతాయని సమస్యలు ఉన్నచో నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ అప్పయ్య, ఎస్ఐలు శీనయ్య, రషీద్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుజాత, ఏఎస్ఐ మహమ్మద్, ఆరిష్, నవాజ్, వారి సిబ్బంది, కాలనీవాసులు, యువకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సురక్ష పోలీసు కళాబృందం సభ్యులు డి.రాములు, బి.జగదీష్, బాలరాజు, షీటీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

**ప్రజాపక్షం/వంగూర్ :** సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికి అందుతాయని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని వైవిఫంక్షన్‌హాలులో నిర్వహించిన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా లబ్దిదారులకు రేషన్‌కార్డులను అందజేశారు. అనంతరం శ్రీగెల్వాలాంబమాత ఉత్సవాల గోడపోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళిమోహన్, ఎంపిడిఓ బ్రహ్మాచారి, మాజీ జడ్పిటిసి వెంకట్ గౌడ్, అల్వాల్‌రెడ్డి, రమేష్‌గౌడ్, క్యామమల్లయ్య, రాజశేఖర్‌రెడ్డి, కడారి వెంకటయ్యయాదవ్, ఆలయకమిటిచైర్మన్ శేఖర్, వేమారెడ్డి పాల్గొన్నారు.

# హామీలు నెరవేరుస్తూ సంక్షేమ పథకాలు అమలు



దేవరకద్రలో రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎన్నికలలో ఇచ్చిన హామీలే నెరవేరుస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని దేవరకద్ర శాసనసభ్యులు, జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం దేవరకద్ర పట్టణంలోని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని దేవరకద్ర మండలంలోని పేదలకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇబ్బందులు తొలగించేందుకు రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం చేస్తుందని అన్నారు. గత 10 సంవత్సరాలు పరిపాలించిన టి ఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు, కొత్తగా వచ్చిన కుటుంబ సభ్యులను చేర్చి కొత్త కార్డులు మంజూరు చేయలేదని అన్నారు. ప్రజా పాలన గ్రామ సభల్లో, మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి 17428 వేల కొత్త రేషన్ కార్డులు సుమారు లక్ష 10 వేల కుటుంబ సభ్యుల పేర్లు చేర్చి కొత్త కార్డులను మంజూరు చేసినట్లు, దేవరకద్ర మండలంలో 106 మందికి కొత్త రేషన్ కార్డులుచ 2298 మంది కుటుంబ సభ్యులను కొత్తగా చేర్చి కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. దేవరకద్ర పట్టణంను 4 గ్రామాలు కలిసి మున్సిపాలిటీ గా చేసుకున్నట్లు, రానున్న రోజుల్లో దేవరకద్ర పట్టణం రూపు రేఖలు మార్చి ఆదర్శవంతమైన మున్సిపాలిటీ గా రూపొందించేందుకు ప్రజలు సహకరించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ సుదీర్ఘకాలం తర్వాత నిరుపేదలకు రేషన్ కార్డులు సన్న బియ్యం, ఆరోగ్య శ్రీ పథకం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇందిరమ్మ ఇండ్లతో పాటు అనేక సంక్షేమ పథకాల లబ్ధి పొందుతారని తెలిపారు. రేషన్ కార్డులలో పేర్ల మార్పులు, చేర్పులు కొరకు సమీప మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసినట్లయితే తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం శాసనసభ్యులతో కలిసి రేషన్ కార్డు మంజూరు పత్రాలను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, ఎంపిడిఓ, తాహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# పిహెచ్‌సిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీ చాలా తక్కువ ఉండటం గమనించి కలెక్టర్ అక్కడి డాక్టర్‌ను వివరణ కోరారు. అలాగే ఎన్ సీడీ ప్రోగ్రాం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈడీడీ ఎన్ని ఉన్నాయని ప్రశ్నించారు. దాదాపు 6 వేలకు పైగా జనాభా కలిగిన ప్రాంతంలో గత మార్చి, ఏప్రిల్ నెలలో ఒక్క డెలివరీ కాలేదని రిజిస్టర్‌ను చూసి తెలుసుకున్నారు. ఈడీడీఅప్ డేట్ లేకపోవడం, జులై నెలలో కేవలం రెండు డెలివరీలు మాత్రమే జరిగాయని తెలిసి కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేసుకునేలా మహిళలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. పీహెచ్సీ పరిధిలోని 10 సబ్ సెంటర్లకు గాను 16 మంది డాక్టర్లు ఉన్నా ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎందుకు విజిట్ చేయడం లేదని డాక్టర్‌ను ఆమె ప్రశ్నించారు. ఏఎన్సీ, టీబీ, ఎన్‌సీడి కార్యక్రమాల తీరు సక్రమంగా లేదన్నారు. పిహెచ్‌సీ పరిధిలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయని ఆరా తీసిన కలెక్టర్ ప్రతీ గురువారం ఐరన్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్లు ఇస్తున్నారా లేదా అని ప్రశ్నించారు. టాబ్లెట్లు నిల్వ ఉన్నా ఎందుకు ఇవ్వడం లేదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీ సమయంలో ఆస్పత్రి రిజిస్టర్లు అందుబాటులో లేకపోవడంపై వైద్య సిబ్బందిని నిలదీశారు. సూపర్‌వైజర్‌కు ఫోన్ చేసి బీరువాలో ఉన్న రిజిస్టర్లను తీసుకోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేస్తూ ప్రతీది సూపర్ వైజర్‌పై ఆధారపడితే ఎలాగని ప్రశ్నించారు. వ్యాక్సిన్లను కిట్లల్లో పెట్టడం చూసిన కలెక్టర్ ఐఎల్ఆఫ్ మిషన్ లేదా అని డాక్టర్‌ను ప్రశ్నించగా షార్ట్ సర్క్యూట్ వల్ల మిషన్ చెడిపోయిందని వైద్య సిబ్బంది సమాధానం ఇవ్వడంతో మరీ ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలాగని ప్రశ్నించారు. పనితీరు మార్చుకోవాలని వైద్య సిబ్బందిని కలెక్టర్ సున్నితంగా హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కోటకొండ గ్రామంలోని బ్రాహ్మణవాడలో శీల రాజేశ్వరి అనే లబ్ధిదారు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. గ్రామానికి మొత్తం ఎన్ని ఇండ్లు మంజూరు అయ్యాయని? ప్రస్తుతం ఎన్ని పునాది, లెంటల్, స్లాబ్ స్థాయిలో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయితే గ్రామానికి మొత్తం 31 ఇండ్లు మొదటి విడతలో మంజురు కాగా, 28 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని, వివిధ కారణాలతో మిగతా ఇండ్లు ప్రారంభించలేదని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. బేస్‌మెంట్ లెవల్‌ను పూర్తి చేసుకుంటేనే డబ్బులు ఖాతాలో జమ అవుతాయని ఆమె తెలిపారు.

# భవిత కేంద్రం నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాపక్షం/వనపర్తి :** వనపర్తి నియోజకవర్గం పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రూ.8 లక్షల వ్యయంతో చేపట్టనున్న భవిత కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సంబంధించిన విద్యార్థులకు వారికి అనుగుణంగా విద్యాభోదన అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని, బుద్ధి వైకల్యం కలిగిన ప్రతి ఒక్కరు ఇక్కడ అందించే అధునాతన విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం తయారుచేయడానికి నూతన వంట గది నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ, రఘు ప్రసాద్, గ్రామ నాయకులు శ్రీశైలం, చందు విద్యా శాఖ, అధికారులు, మహనంది, ఎంఈఓ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన**

పెద్దమండడి మండలం చిన్న మందడి గ్రామానికి చెందిన పద్మమ్మ భర్త కురుమూర్తి , శాంతమ్మ భర్త రాములుకి చెందిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అవుతున్నాయని మంజూరైన ఇండ్లను సకాలంలో పూర్తి చేసుకోవాలన్నారు. ఇల్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల గృహ ప్రవేశాలకు వచ్చి నూతన వస్త్రాలను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# భారత్‌కు మరోసారి అవమానం

ట్రంప్ టారిఫ్‌పై సిపిఐ ఎంపి సందోష్ కుమార్ విమర్శ

**న్యూఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రవ్వంత స్నేహమే ఉందని ప్రతిపక్షాలు విమర్శించాయి. రాజ్యసభలో సిపిఐ ఎంపి పి.సందోష్ కుమార్ మాట్లాడుతూ.. ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో భారత్‌కు మరోసారి అవమానం జరిగిందన్నారు. భారత ప్రతిష్ఠకు ఇది మరొక అవమానం, వాణిజ్య ఒప్పందంపై ఒకవైపు చర్చలు జరుగుతుండగా మరోవైపు ట్రంప్ అవమానకరంగా సుంకాలు విధించారు, భారత ప్రయోజనాలను అవమానపరిచారు అని పార్లమెంటు కాంప్లెక్స్ వద్ద పాత్రికేయులతో మాట్లాడుతూ సందోష్ కుమార్ విమర్శించారు.

భారత్‌పై 25 శాతం సుంకాలు విధిస్తూ ట్రంప్ బుధవారం ప్రకటించడంతో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పందిస్తూ, మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నుండి మోదీ స్ఫూర్తి పొందాలని, అమెరికా అధ్యక్షుడికి వ్యతిరేకంగా నిలబడి పోరాడాలన్నారు. ఎక్స్ వేదికగా ఆయన ఈ మేరకు పోస్టింగ్ పెట్టారు. 25 శాతం టారిఫ్‌తోపాటు పెనాల్టీ కూడా మోదీ భారత్‌పై విధించారని, వారి మధ్య ఉన్న టారిఫ్, హౌదీ మోదీ స్నేహం రవ్వంత మాత్రమేనని విమర్శించారు. ఎన్ని అవమానాలు జరిగినా మౌనంగా ఉంటే అమెరికా అధ్యక్షుడి నుండి ప్రత్యేకమైన గౌరవం లభిస్తుందని మోదీ భావించారని విమర్శించారు. ఆపరేషన్ సింధూర్‌ను తానే ఆపానని 30 సార్లు మోదీ ప్రకటించారనీ, పహల్గామ్‌లో దాడులకు ముందుగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన పాకిస్థాన్ ఆర్మీ ప్రధానాధిపతి మునీర్‌కు ప్రత్యేక ఆతిథ్యం ఇచ్చి విందు ఏర్పాటు చేశారనీ, ఒకవైపు యుద్ధం జరుగుతుంటే పాకిస్థాన్‌కు ఐఎస్ఎఫ్ ద్వారా రుణం మంజూరు చేయించారని, ఇవన్నీ మౌనంగా సహిస్తే ట్రంప్ దగ్గర ప్రత్యేక గౌరవం ఉంటుందని మోదీ భావించారని, అలాంటిదేమీ జరగలేదని విమర్శించారు.

రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరిక్ ఓ బ్రెయిన్ ఎక్స్ వేదికగా ట్రంప్–మోదీ వీడియోను షేర్ చేశారు. 56 అంగుళాల ఛాతీకంటే 25 చాలా తక్కువ అని వ్యంగ్య విమర్శ చేశారు. ఇంత అమానుషమైన 25 శాతం ట్రంప్ టారిఫ్ పట్ల 56 అంగుళాల ఛాతీ ఉన్న మోదీ ఏం చెబుతారని డెరిక్ ఓ బ్రెయిన్ ప్రశ్నించారు. రాష్ట్రీయ జనతాదళ్ ఎంపి మనోజ్ ఝా మీడియాతో పార్లమెంటు వద్ద మాట్లాడుతూ, ప్రధాన మంత్రి మోదీ హయాంలో ఈ విధంగా 25 శాతం టారిఫ్‌లు విధించడంపట్ల తాము ఎంతమాత్రం సంతోషంగా లేమన్నారు. ఈ అసమానతలను సమ్మతించి ప్రతిపక్షాలను, ప్రతిఒక్కరినీ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

డిఎంకె నాయకుడు తిరుచ్చి శివ మాట్లాడుతూ, దీనిపై మోదీ సమాధానం చెప్పాలని కోరారు. అసలు ఏం జరిగిందో చెప్పాలి, దీని ప్రభావం మనదేశంమీద ఎలా ఉంటుంది? పార్లమెంటును మోదీ పరిగణనలోకి తీసుకోలేదు అని విమర్శించారు. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ఫేస్‌బుక్‌లో పోస్టింగ్ పెడుతూ, ట్రంప్ భారత్‌కు శిక్ష విధిస్తున్నారనీ, కేవలం భారీ టారిఫ్‌లు మాత్రమే కాకుండా రష్యాతో భారతదేశం చేస్తున్న వాణిజ్యాన్ని కూడా అవమానించారన్నారు. కానీ మోదీ ప్రభుత్వం లొంగిపోయి మౌనంగా కూర్చుందన్నారు. కాంగ్రెస్ ఎంపి మల్లురవి మాట్లాడుతూ, ట్రంప్ భారత దేశానికి చేసిన బెదిరింపును ఎంతమాత్రం సమ్మతించకూడదన్నారు. కాంగ్రెస్‌లో మరో ఎంపి ఛామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ట్రంప్ తనకు మంచిస్నేహితుడని మోదీ చెప్పుకున్నారని, కానీ ట్రంప్ ఎజెండా చాలా స్పష్టంగా ఉందని అన్నారు. ఆలోచన లేకుండా వాణిజ్య ఒప్పందం చేసుకోమని ట్రంప్ భారత్‌ను తొందరపెడుతున్నారన్నారు.

# జస్టిస్ యశ్వంత్‌వర్మ ధోరణిపై 'సుప్రీం' అసహనం

కమిటీ నివేదికను వ్యతిరేకిస్తుంటే కమిటీ ముందు హాజరెందుకని? బెంచ్ ప్రశ్న

**శ్రీనగర్ :** అధికారిక నివాసంలో నోట్ల కట్టలు బయటపడ్డ కేసులో జస్టిస్ యశ్వంత్‌వర్మను బుధవారం సుప్రీంకోర్టు తప్పు పట్టింది. మీ ప్రవర్తన ఆత్మవిశ్వాసాన్ని ప్రేరేపించదని, అంతర్గత విచారణ కమిటీ నివేదిక చెల్లనిదిగా ప్రకటించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన జస్టిస్ యశ్వంత్‌వర్మకు ధర్మాసనం పదునైన ప్రశ్నలు సంధించింది. కమిటీ నివేదిక చెల్లుబాటును మీరు వ్యతిరేకిస్తున్నప్పుడు ఇంతకుముందు అంతర్గత విచారణ కమిటీ ముందు మీరు ఎందుకు హాజరయ్యారని ప్రశ్నించింది. మీరు అప్పటికప్పుడు దానిని ఎందుకు సవాల్ చేయలేదని అత్యున్నత న్యాయస్థానం జస్టిస్ యశ్వంత్‌వర్మను ప్రశ్నించింది. అంతర్గత విచారణ కమిటీకి వ్యతిరేకంగా మీరు ఇంతకు ముందే కోర్టుకు వచ్చి ఉండాల్సింది అని ధర్మాసనం జస్టిస్ యశ్వంత్‌వర్మకు చెప్పింది. భారత ప్రధాన న్యాయమూర్తికి, రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి సమాచారం అందించగల న్యాయమూర్తి ఉన్నారని, నమ్మేందుకు ఆధారాలు ఉన్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దీపాంకర్ దత్త, జస్టిస్ ఎజి.మాసిహ్‌లతో కూడిన ధర్మాసనంపేర్కొంది. 'ముందుకు సాగాలా? వద్దా అనేది రాజకీయ నిర్ణ యం. కానీ, న్యాయవ్యవస్థ సమాజానికి ప్రక్రియ అనుసరించబడిందనే సందేశం పంపాలి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జస్టిస్ యశ్వంత్ వర్మ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ హాజరయ్యారు. తనను తొలగించాలని అంతర్గత విచారణ కమిటీ చేసిన సిఫారసు రాజ్యాంగ విరుద్ధం' అని జస్టిస్ యశ్వంత్‌వర్మ వాదించారు. తొలగింపును కొనసాగించాలని సిఫారసు చేయడం ప్రమాదకరమైన ఉదాహరణగా నిలుస్తుందని కపిల్ సిబల్ కోర్టుకు తెలిపారు. వీడియోటేప్ విడుదలైన తర్వాత యశ్వంత్‌వర్మ తనను సంప్రదించలేదని, అప్పటికే ఆయన ప్రతిష్ఠ దెబ్బతిన్నదని కపిల్ సిబల్ చెప్పారు. విచారణ సందర్భంగా జస్టిస్ దీపాంకర్‌దత్త మాట్లాడుతూ జస్టిస్ యశ్వంత్ వర్మ కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ ఫిర్యాదుతో పోలీసులను సంప్రదించారా? అని న్యాయవాది మ్యాథ్యూస్ జె.నెడుంపరాలను ప్రశ్నించారు. అంతర్గత విచారణ ప్రొసీజర్‌ను సవాల్ చేస్తూ జస్టిస్ యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తనను తొలగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం తన ఆదేశాన్ని రిజర్వ్ చేసింది. ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని కోరుతూ న్యాయవాది నెడుంపరా దాఖలు చేసిన ప్రత్యేక పిటిషన్‌పై కూడా సుప్రీంకోర్టు తన ఆదేశాన్ని రిజర్వ్ చేసింది. జస్టిస యశ్వంత్‌వర్మ మే8న అప్పటి భారత ప్రధానన్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా చేసిన సిఫారసును రద్దు చేయాలని, అతనిపై అభిశంసన ప్రక్రియను ప్రారంభించాలని కోరడం నిలిపివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే.



# క్రీడ

## ఫ్రాంచైజీల వాటాకు ఆమోదం

### రిలయన్స్ బిడ్డింగ్‌పై త్వరలోనే నిర్ణయం!




తమ దేశంలో నిర్వహిస్తున్న ది హండ్రెడ్ లీగ్‌లో ఫ్రాంచైజీల వాటా కొనుగోలుకు ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ఆమోదం తెలిపింది. లీగ్‌లోని ఆరుజట్లతో సదరు ఫ్రాంఛైజీల డీల్‌కు ఈసీబీ అధికారికంగా అంగీకరించింది. మరో రెండు జట్ల వాటా కొనుగోలుపై మాత్రం నిర్ణయాన్ని వెలువరించలేదు. వీటిలో భారత్‌కు చెందిన రిలయన్స్ సంస్థ, ఓవల్ ఇన్విజిబుల్ క్లబ్ మధ్య కుదరాల్సిన డీల్ కూడా ఒకటి. ఓవల్ క్లబ్‌లో 49 శాతం వాటా కోసం రిలయన్స్ బిడ్డింగ్ వేసింది. ది హండ్రెడ్ లీగ్‌లోని ఆరు జట్లలో ఏ ఫ్రాంఛైజీలు ఎంత వాటా కొన్నాయంటే.. భారత్‌కు చెందిన జీఎంఆర్ గ్రూప్ సౌతాంప్టన్ సూపర్ ఛార్జర్స్‌లో 49 శాతం వాటాను దక్కించుకుంది. మాంచెస్టర్ ఒరిజినల్స్ (త్వరలోనే మాంచెస్టర్ సూపర్ జెయింట్స్‌గా పేరు మారనుంది) జట్టులో 70 శాతం షేర్‌ను సంజీవ్ గొయెంకాకు సంబంధించిన లక్నో సూపర్ జెయింట్స్ కొనుగోలు చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ నార్తర్న్ సూపర్ చార్జర్స్‌లో వంద శాతం వాటాను సొంతం చేసుకోగా.. బర్మింగ్‌హామ్ ఫీనిక్స్‌లో 49 శాతం వాటాను నైట్‌హెడ్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్ కొన్నది. వాషింగ్టన్ ఫ్రీడమ్ టీమ్ వెల్ష్ ఫైర్‌లో 50 శాతం వాటాను సంపాదించింది.

**పెద్ద క్లబ్‌లే దిక్కు..**

లియోనార్డ్ కర్టిస్ క్రికెట్ ఆర్థిక నివేదిక ప్రకారం ఇంగ్లాండ్‌లోని మూడు ప్రధాన క్లబ్స్‌కు.. చిన్నాచితకా క్లబ్స్ మధ్య దూరం పెరుగుతూ వస్తోంది. సర్రే, ల్యాంక్‌షైర్, వార్విక్‌షైర్ క్లబ్స్‌కే 44 శాతం ఆదాయం సమకూరుతోంది. నార్తంప్టన్‌షైర్, లీసెస్టర్‌షైర్, డెర్బిషైర్ వంటి చిన్న క్లబ్స్ మాత్రం ఆదాయం లేక అల్లాడుతున్నాయి. ది హండ్రెడ్ లీగ్‌లో 8 జట్లను ఐపీఎల్ ఫ్రాంచైజీలు కొనుగోలు చేయడంతో తమకు న్యాయం జరుగుతుందని ఇంగ్లండ్ క్లబ్స్ ధీమాతో ఉన్నాయి. టీ20 ఫార్మాట్‌ను కొత్త పుంతలు తొక్కించిన ఐపిఎల్‌ను మించిన లీగ్ ప్రపంచంలోనే లేదని చెప్పొచ్చు. మన దేశంలోనే కాదండోయ్.. విదేశాల్లోనూ సిస్టర్ ఫ్రాంచైజీలతో పొట్టి క్రికెట్‌ను శాసిస్తున్నారు ఐపీఎల్ జట్ల యజమానులు. ఈమధ్యే ఆర్థికంగా సతమతం అవుతున్న ఇంగ్లాండ్ క్లబ్ క్రికెట్‌కు ఊపిరిలూదేందుకు వీరంతా సిద్ధమయ్యారు. 'ది హండ్రెడ్ లీగ్'లో జట్లలో వాటాను కొనుగోలు చేసి తమ సామ్రాజ్యాన్ని విస్తరించారు. ఐపిఎల్ జట్లు తమతో చేయి కలిపిన వేళ రూ.60 వేల కోట్ల ఆదాయంపై కన్నేశారు హండ్రెడ్ లీగ్ నిర్వాహకులు.

## అర్షదీప్ అరంగేట్రం పక్కా..

### పిచ్ చూశాకే బుమ్రాపై నిర్ణయం!



అండర్సన్ – టెండూల్కర్ ట్రోఫీలో ఆఖరి టెస్టుకు కౌంట్‌డౌన్ మొదలైంది. సిరీస్ సమం చేయాలంటే గెలవడం తప్ప మరో దారి లేని పరిస్థితుల్లో భారత జట్టు ఓవల్ ఫైట్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఇంగ్లండ్ తుది జట్టును ప్రకటించడంతో.. టీమిండియా ఎవరెవరితో ఆడనుంది? అనేది ఉత్కంఠ రేపుతోంది. ఈ నేపథ్యంలో మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన శుభ్‌మన్ గిల్.. జట్టు కూర్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. పేసర్లకు అనుకూలించే పిచ్ సిద్ధం చేసిన ఇంగ్లండ్‌కు కౌంటర్‌గా తమ లైనప్ ఉంటుందని తెలిపాడు. ఓవల్ టెస్టుకోసం ఇంగ్లాండ్ నాలుగు మార్పులు చేయగా.. కనీసం రెండు మూడు మార్పులతో భారత జట్టు ఆడనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. గాయం నుంచి కోలుకున్న లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్షదీప్ సింగ్ అరంగేట్రం, బుమ్రాను ఆడిస్తారా? అనేది అంతుచిక్కడం లేదు. అయితే.. సారథి గిల్ దాదాపు ఈ ఇద్దరిని ఆడించనున్నట్టు చెప్పాడు. 'అర్షదీప్ సింగ్‌ను సిద్ధంగా ఉండాలని చెప్పాం. అతడు అరంగేట్రం చేయడం దాదాపు ఖాయమే. అయితే.. తుది జట్టులో ఎవరిని తీసుకోవాలి అనేది పిచ్‌ను చూశాకే నిర్ణయిస్తాం. ఇంగ్లాండ్ ఎంపిక చేసిన పదకొండు మందిలో ప్రధాన స్పిన్నర్ లేదు. జో రూట్, జాకబ్ బెథెల్ పార్ట్ టైమ్ స్పిన్నర్లు మాత్రమే. జడేజా, సుందర్ రూపంలో మాకు నిఖ్సాన స్పిన్ ఆల్‌రౌండర్లు ఉన్నారు. వీళ్లిద్దరూ బ్యాటుతో, బంతితో రాణించగలరు' అని గిల్ వెల్లడించాడు. బుమ్రాను ఆడిస్తారా? అనే ప్రశ్నకు మాత్రం భారత కెప్టెన్ స్పష్టత ఇవ్వలేదు. 'బుమ్రా మా ప్రధాన పేసర్. ఓవల్ వికెట్ మీద పచ్చిక ఎక్కువ ఉంది. చూస్తుంటే పేసర్లకు అనుకూలించేలా రూపొందించారని అనిపిస్తోంది. అందుకే.. గురువారం పిచ్‌ను పరీక్షించాకే తుది జట్టును ప్రకటిస్తాం అని గిల్ వివరించాడు. అంతేకాదు ఎనిమిదో స్థానంలో సుందర్ చక్కగా సరిపోయాడని.. ఆపద్బాంధవుడిలా అతడు అవతరించిన తీరు జట్టుకు ఎంతో లాభిస్తోంద'ని కెప్టెన్ తెలిపాడు. పాదం గాయంతో ఐదో టెస్టుకు దూరమైన పంత్ బదులు జగదీశన్‌ను తీసుకునే అవకాశం కూడా లేకపోలేదు. కానీ, మాంచెస్టర్ టెస్టులో విఫలమైన శార్దూల్ ఠాకూర్, అన్షుల్ కంభోజ్‌లపై మాత్రం వేటు పడడం ఖాయం.

**భారత తుది జట్టు అంచనా :** యశస్వీ జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్(కెప్టెన్), ధ్రువ్ జురెల్ / జగదీశన్(వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా / ఆకాశ్ దీప్, సిరాజ్, అర్షదీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ.

## సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియా పర్యటన..

### అండర్-19 స్క్వాడ్‌లో వైభవ్..!




ఇంగ్లాండ్ గడ్డపై దుమ్మురేపిన భారత అండర్ 19 జట్టు త్వరలోనే ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. సెప్టెంబర్‌లో మూడు వన్డే మ్యాచ్‌లు, రెండు మల్టీ డే మ్యాచ్‌ల కోసం కుర్రాళ్లతో కూడిన టీమిండియా కంగారూ గడ్డపై అడుగుపెట్టనుంది. ఈ టూర్‌కు నెల రోజుల సమయం మాత్రమే ఉన్నందున బుధవారం సెలెక్టర్లు స్క్వాడ్‌ను ప్రకటించారు. ఆయుష్ మాత్రే కెప్టెన్‌గా, విహాన్ మల్హోత్రా వైస్ కెప్టెన్‌గా ఎంపికవ్వగా.. ఇంగ్లాండ్ గడ్డపై మెరుపు సెంచరీతో చెలరేగిన వైభవ్ సూర్యవంశీ స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నాడు. అభిజ్ఞాన్, హర్వాన్ష్ వికెట్ కీపర్లుగా స్థానం సంపాదించారు. మరో ఐదుగురిని స్టాండ బైగా ఎంపిక చేశారు సెలెక్టర్లు.

**భారత అండర్ -19 స్క్వాడ్ :** ఆయుష్ మాత్రే(కెప్టెన్), విహాన్ మల్హోత్రా(వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, వేదాంత్ త్రివేది, రాహుల్ కుమార్, అభిజ్ఞాన్ కుందు(వికెట్ కీపర్), హర్వాన్ష్ సింగ్(వికెట్ కీపర్), ఆర్ ఎస్ అంబ్రిష్, కనిష్క్ చౌహాన్, నమన్ పుష్పక్, హెనిల్ పటేల్, డీ దీపేశ్, కిషన్ కుమార్, అన్మోల్‌జిత్ సింగ్, ఖిలాన్ పటేల్, ఉద్ధవ్ మోహన్, అమన్ చౌహాన్.

స్టాండ్ బై ప్లేయర్స్ : యుధజిత్ గుహా, లక్ష్మణ్, బీ.కే. కిశోర్, అలంక్రిత్ రపోలే, అర్ణవ్ బుగ్గా.

# ఫోకస్ కళారంగం

## బలపడుతున్న ధిక్కార కళారూపాలు

ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ధిక్కార కళారూపాలు (Rebel Art Forms) బలపడుతున్నాయి. సాంప్రదాయ కళలకు భిన్నంగా, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక నిబంధనలను సవాలు చేసే, స్వేచ్ఛ,



వ్యక్తీకరణ, ప్రతిఘటనలను ప్రోత్సహించే కళారూపాలు విస్తరిస్తున్నాయి. ఈ కళలు తరచూ అణచివేత, అసమానతలు, అన్యాయాలను ఎదిరించడానికి మాధ్యమంగా ఉపయోగపడతాయి. ఇలాంటి ధిక్కార కళారూపాల్లో స్ట్రీట్ ఆర్ట్, గ్రాఫిటీది అగ్రస్థానం. గోడలపై రాసే గ్రాఫిటీ, స్టెన్సిల్ ఆర్ట్, మ్యూరల్స్ వంటివి ప్రజల దృష్టిని ఆకర్షించి సామాజిక సందేశాలను అందిస్తాయి. బాంక్సీ వంటి కళాకారులు రాజకీయ, సామాజిక విమర్శలను తమ గ్రాఫిటీ ద్వారా వ్యక్తం చేశారు. బెర్లిన్ గోడపై గ్రాఫిటీ, పాలస్తీనాలోని విభజన గోడలపై మ్యూరల్స్ ఇలాంటి గ్రాఫిటీ ఆర్ట్‌కు ఉదాహరణలు. ఇవి ప్రభుత్వ విధానాలు, అసమానతలపై చర్చను ఆహ్వానిస్తాయి. సంగీతం ద్వారా అణచివేతకు వ్యతిరేకంగా గళం వినిపించడాన్ని ప్రొటెస్ట్ మ్యూజిక్‌గా పేర్కొంటున్నారు. బాబ్ డైలాన్, బాబ్ మార్లే, ఫెలా కుటి వంటి కళాకారులు తమ సంగీతంతో సామాజిక మార్పులను ఈ ప్రక్రియ ద్వారా ప్రేరేపించారు. అమెరికాలో జరిగిన సివిల్ రైట్స్ ఉద్యమంలో 'వియ్ షల్ ఓవర్‌కమ్', దక్షిణాఫ్రికాలో అపార్టహీడ్ వ్యతిరేక గీతాలు ఈ తరహా సంగీతానికి ఉదాహరణలు. ఇవి ప్రజలను ఏకం చేసి, సామూహిక ప్రతిఘటనకు బలం చేకూర్చాయి. కాగా, శరీరం, స్థలం, సమయాన్ని ఉపయోగించి సామాజిక సమస్యలపై ధిక్కార స్వరాన్ని వ్యక్తం చేయడమే పర్ఫార్మెన్స్ ఆర్ట్స్ లక్ష్యం. ఇది తరచూ ప్రేక్షకులను అసౌకర్యానికి గురిచేస్తుంది. ఉదాహరణకు మరీనా అబ్రమోవిక్, పెట్రస్ పావ్లెన్స్కీ వంటి కళాకారులు తమ శరీరాన్ని సామాజిక విమర్శకు సాధనంగా ఉపయోగించారు. సామాజిక నిషేధాలను ప్రశ్నించడం, చర్చలను రేకెత్తించడం వంటి ప్రభావాలు కనిపిస్తాయి. డాడాయిజం ప్రక్రియ 20వ శతాబ్దంలో సాంప్రదాయ కళా నియమాలను తిరస్కరించి, యుద్ధం, సామ్రాజ్యవాదంపై విమర్శలను వ్యక్తం చేసింది. ఈ విధానం కళ నిర్వచనాన్ని మార్చి, సామాజిక నిబంధనలను సవాలు చేసింది. ఇలాంటి విభిన్నమైన కళా రూపాలు, విధానాలు కొత్త పుంతలు తొక్కుతూ, ప్రజా చైతన్యానికి పునాదులు వేస్తున్నాయి. సోషల్ మీడియా రంగం ప్రవేశంతో ధిక్కార కళలు కొత్త రూపాన్ని సంతరించుకొని, సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నాయి.

## సొహ్రాయ్, ఖోవర్ పెయింటింగ్స్‌తో ఆకట్టుకున్న కళా ఉత్సవ్



న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వేదికగా జరిగిన కళా ఉత్సవ్ 2025 సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. 'ఆర్టిస్ట్స్ ఇన్ రెసిడెన్స్ ప్రోగ్రామ్' అనే పేరుతో జరిగిన ఈ ఉత్సవంలో, ప్రాయ్, పట్టచిత్ర, పటువా వంటి సాంప్రదాయ చిత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం భారత జీవన కళా సంప్రదాయలను గౌరవించడమేగాక, జానపద, గిరిజన, సాంప్రదాయ కళాకారులకు తమ ప్రతిభ నిరూపించుకునే వేదికను కల్పించింది. ఇక్కడ ప్రదర్శనకు ఉంచిన చిత్రాల్లో సొహ్రాయ్ పెయింటింగ్ అనేదిది జార్ఖండ్‌లోని హజారీబాగ్ ప్రాంతంలోని కుర్మి, సంతల్, ముండా, ఒరాన్, అగారియా, ఘట్వాల్ సమూహాలతో సహా వివిధ గిరిజన వర్గాల మహిళలు ఆచరించే సాంప్రదాయ స్వదేశీ కళారూపం. పంటకోత కళగా పిలువబడే ఇది వ్యవసాయం మరియు పశువుల పెంపకంతో లోతుగా ముడిపడి ఉంది. 'సోహ్' లేదా 'సోరో' అనే పదానికి తరిమికొట్టడం అని అర్థం. 'రాయ్' అంటే క్రను సూచిస్తుంది. ఈ ఆచారంలో భాగంగా, పశువులను ఇళ్లలోకి స్వాగతించడానికి మండలాలు లేదా అరిపాన్‌లను బియ్యం పిండితో గీస్తారు. ఈ పనిని గ్రామీణ మహిళలు స్వయంగా నిర్వహిస్తారు. సొహ్రాయ్ ఖోవర్ పెయింటింగ్ 2020 సంవత్సరంలో భౌగోళిక సూచిక (జియో ఇండెక్స్ లేదా జిఐ) ట్యాగ్‌ను పొందింది.



ఇక పట్ట చిత్ర ఒడిశాలో ఉద్భవించింది. ఇది పూరీలోని జగన్నాథ ఆలయంతో దగ్గరి సంబంధం కలిగి ఉంది. ఇక్కడ దీనిని సాంప్రదాయకంగా గర్భగుడి అలంకరించడానికి ఉపయోగిస్తారు. సుద్ద పొడి, చింతపండు గింజల జిగురుతో పూత పూసిన వస్త్రం (పాటా)పై వేసే పెయింటింగే పట్టచిత్ర. కూరగాయలు, మట్టి, ఖనిజ వనరుల నుండి సహజ రంగులను మాత్రమే దీనికి వాడతారు. ఈ పెయింటింగ్ ఇతివృత్తాలలో మతపరమైన, పౌరాణిక, జానపద కథలు ఉన్నాయి. పెన్సిళ్లు లేదా బొగ్గు లేకుండా , కళాకారులు సరిహద్దులతో ప్రారంభించి, లేత ఎరుపు, పసుపు బ్రష్‌లతో నేరుగా స్కెచ్ వేస్తారు. మెరుపు, వాటర్ ప్రూఫ్ కోసం లక్క పూతతో ముగిస్తారు.

పటువా పెయింటింగ్ పశ్చిమ బెంగాల్ నుండి వచ్చిన జానపద కళా సంప్రదాయం. దీనిని పటువా లేదా చిత్రకార్ సమాజం (హిందూ, ముస్లిం ఇద్దరూ)ఆచరిస్తారు. పటువా కళాకారుల సమూహాలు మన దేశంలోని బిహార్, జార్ఖండ్, ఒడిశాతోపాటు బంగ్లాదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలో కూడా కనిపిస్తాయి. పాత చీర బట్టతో వెనుకకు, వెదురుమేక వెంట్రుకలతో కూడిన బ్రష్‌లతో బొమ్మలు వేస్తారు. కూరగాయల రంగులను ఉపయోగించి, పాటి లేదా పట్టా అని పిలువబడే వస్త్ర స్క్రోల్‌లపై పెయింట్ చేస్తారు. ముఖ్యంగా కాళీఘాట్, కుమార్తులిలలో హిందూ పటువాలు మంగళ్ కథను వివరించడానికి దీనిని ఉపయోగిస్తారు. పర్యావరణానికి ఏమాత్రం హాని కలిగించని, సహజసిద్ధమైన రంగులను వినియోగించడం నేటి ప్రపంచానికి గొప్ప సందేశాన్నిస్తున్నది.

## గెరిల్లా థియేటర్ నిర్మాణ

బహిరంగ ప్రదేశాలలో ఆకస్మిక నాటక (ఫ్లాష్ ప్లేస్) ప్రదర్శనల ద్వారా సామాజిక, రాజకీయ సందేశాలను అందించడాన్ని గెరిల్లా థియేటర్‌గా పేర్కొంటున్నారు.ఉదాహరణకు 1960లలో యుఎస్‌లో వియత్నాం యుద్ధ వ్యతిరేక నాటకాలు, భారతదేశంలో 'నుక్కడ్ నాటక్' (స్ట్రీట్ ప్లే). గెరిల్లా థియేటర్ సామాన్య ప్రజలను నేరుగా ఆకర్షించి, అవగాహన కల్పిస్తుంది. అదే సమయంలో, పోస్టర్ ఆర్ట్, ప్రాపగండా ఆర్ట్స్ ద్వారా కూడా సమాజిక చైతన్యాన్ని కలిగిస్తున్నారు. పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాల ద్వారా సామాజిక సందేశాలను వ్యాప్తి చేయడం ఈ కళా విధానాల లక్ష్యం. ఇవి తరచూ ప్రభుత్వాలు, సంస్థలపై విమర్శలను వ్యక్తం చేస్తాయి.



## సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

### సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్




**ప్రజాపక్షం/తాండూర్:** ఈ ప్రాంత ప్రజాసమస్యల పరిష్కారానికి రాజీలేని ఉద్యమాలు చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ తెలిపారు. సిపిఐ తాండూర్ పట్టణ, మండల మహసభ చాకలి యాదప్ప అధ్యక్షతన బుధవారం జరిగింది. సభకు ముఖ్యఅథిధిగా విజయలక్ష్మి పండిత్ హాజరై మాట్లాడారు. తాండూర్ ప్రాంతంలో మొదటి నుండి సిపిఐ, ప్రజాసంఘాలకు ఈప్రాంత ప్రజలు అండగా నిలిచారన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఆలోచన చేస్తూ వారికి అండగా నిలబడేది కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. తాండూర్ ప్రాంతంలో సిపిఐ నాయకత్వం నిజాయితీతో ఉన్నందువల్లే ఈ రోజుకి అన్ని వర్గాల ప్రజల్లో పార్టీకి ఆదరణ ఉందన్నారు. దాన్ని అదే విధంగా కొనసాగించాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఈ ప్రాంత సమస్యల విషయమై నిర్మాణాత్మక పోరాటాలను రూపొందించాన్నారు. నేటి రాజకీయ వాతావరణంలో మనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. మతతత్వ రాజకీయాలపై ప్రజలను చైతన్య పరుస్తూ, సమస్యలను తీరుస్తూ ప్రజల పక్షాన నిలబడే బాధ్యత మనపై ఉందన్నారు. పార్టీ ప్రజా సంఘాల నిర్మాణం సరిగ్గా ఉంటే పార్టీ బలంగా ఉంటుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సభలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రవీందర్, సిపిఐ మండల కార్యదర్శి దస్తప్ప, పట్టణ కార్యదర్శి మునీర్, జగదాంబ, లక్ష్మణ్, దశరథ్ గౌడ్, దస్తప్ప, చంద్రమ్మ, విజయ్, రాజేందర్, మీనాజుద్దీన్, అశోక్, విజలక్ష్మి , దేవి పాల్గొన్నారు.

## 'పవర్‌లూమ్'ను వదలని విద్యుత్‌గండం

### చేనేత పవర్‌లూమ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రవి




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** పవర్‌లూమ్ పరిశ్రమకు విద్యుత్ గండం వదులుతలేదని చేనేత పవర్‌లూమ్‌కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పంతం రవి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సుభాష్ నగర్ పవర్ లూమ్ కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంతం రవి మాట్లాడారు. విద్యుత్ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కెటిఆర్ స్పందించకపోవడం బాధాకరమన్నారు. పవర్లూమ్ పరిశ్రమకు గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ చెల్లించాల్సిన బ్యాక్ బిల్లింగ్ డబ్బులు చెల్లించాలన్నారు. సిరిసిల్లలోని పవర్లూమ్ వస్త్ర పరిశ్రమకు బ్యాక్ బిల్లింగ్ పేరుతో అధికారుల వేధింపులు తప్పడం లేదని మండిపడ్డారు. సుమారు 50 వరకు పవర్లూమ్ పరిశ్రమల విద్యుత్ కనెక్షన్లు తొలగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. స్థానిక నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి ఈ విషయంపై ప్రత్యేకమైన దృష్టి పెట్టి సెస్ కు చెల్లించాల్సిన బ్యాక్ బిల్లింగ్ డబ్బులు చెల్లించి సెస్ పాలకవర్గం మరియు అధికారుల నుండి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను కాపాడాలని కోరారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, పవర్లూమ్ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'మధ్యాహ్న' కార్మికులకు బిల్లులు ఇవ్వండి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య డిమాండ్

### కార్మికుల రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని ఎఐటియుసి నిజామాబాద్ జిల్లా ప్రదాన కార్యదర్శి వై.ఓమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ధర్నా చౌక్‌లో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల రిలేనిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య, ఎండిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి దీక్షలో కూర్చున్న వారికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ దీక్షలు ఆగస్టు 1 వరకు నాలుగురోజుల పాటు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ ప్రభు త్వ పాఠశాలల్లో చదువుకోవడానికి వస్తున్న పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు మధ్యాహ్నం ఆహారాన్ని అందించే కార్మికులు సైతం అదే వర్గానికి చెందిన వారై ఉన్నారన్నారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా చదువుకునే బడుగు బలహీన వర్గాల పిల్లలు ఆకలి చదువులు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం తలపెట్టిన పథకం ప్రభుత్వ అధికారుల నిర్వాకంతో విద్యార్థులకు అందని ద్రాక్షలా అవుతుందని ఆరోపించారు. పేద విద్యార్థులకు మధ్యాహ్న బోజనాన్ని వండిపెట్టే కార్మికులు కూడా అదే సామాజిక వర్గానికి చెందిన పేదవారేనని ప్రభుత్వం ఈ విషయాన్ని గ్రహించాలన్నారు. ఆరునెలల నుండి కార్మికులు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెట్టినా బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోతే ఏరకంగా భోజనాన్ని వండి పెడతారని ప్రశ్నించారు. ప్రభుత్వం పెట్టిన మెనుప్రకారం ఒక విద్యార్థికి నాణ్యమైన భోజనం అందించాలంటే 25 రూపాయలు ఖర్చవుతుందని, ప్రభుత్వం మాత్రం 11 రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకుంటుందని, ఆ డబ్బులు కూడాసరైన సమయంలో ఇవ్వడం లేదన్నారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే రూ.ఆరుకోట్లు బకాయి ఉందంటే ప్రభుత్వ పనితీరును అర్థం చేసుకోవచ్చన్నారు. జిల్లాకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని, గుడ్లు, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, కార్మికులకు పిఎఫ్, ఇఎస్‌ఐ ఇన్సురెన్సు సౌకర్యాలు కల్పించాలని, యూనిఫారం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా పదివేల రూపాయల వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షలో యూనియన్ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు సాయమ్మ, లతా, నాగలక్ష్మి , సాయిలత, సాయమ్మ, గంగామణి, నరేష్ కూర్చున్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం : ఎఐఎస్‌ఎఫ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని ఎఐఎస్‌ఎఫ్ స్టేట్ వైస్‌ప్రెసిడెంట్ గ్యార క్రాంతికుమార్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని లక్ష్మణాచారి భవనంలో ఎఐఎస్‌ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వద్దనే విద్యాశాఖ ఉన్నా నేటికి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి శూన్యమన్నారు. గురుకులాల్లో నాణ్యతలేని బియ్యం, శుభ్రతలేని వంటకాలతో రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గోరటి నరేష్, ప్రేమ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




## 'ధర్మస్థల' నిందితులకు కఠిన శిక్షలు

### జాతీయ మహిళా సమాఖ్య డిమాండ్

### జిల్లాకేంద్రంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు నిరసన

**ప్రజాపక్షం/నల్లగొండ :** కర్ణాటక రాష్ట్రంలోనీ మంజునాథ దేవాలయం ధర్మస్థలం నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌డబ్ల్యు) జిల్లా కన్వీనర్ గిరి రమ డిమాండ్ చేశారు. ధర్మస్థలం హత్యోదంత ఘటనలపై వేగవంతంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తూ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గిరి రమ మాట్లాడుతూ మంజునాథ దేవాలయం ధర్మస్థలంలో గత వారం రోజులుగా వెలుగులోకి వస్తున్న ఘటనలు భయానకంతో పాటు తీవ్రమైన ఆవేదనను, ఆందోళనను కల్గిస్తున్నాయన్నారు. ఈ హత్యోదంత పరంపర మనసును కలిచి వేస్తుందని, ఆశ్రమాల పేరుతో, ఆలయాల పేరుతో, ఆధ్యాత్మిక చింతన పేరుతో, భక్తి పేరుతో మహిళలను వంచిస్తూ సమాజంలో పెద్ద మనుషులుగా మతగురువులుగా, చెలామణి అవుతూ మహిళల మాన ప్రాణాలను హరించివేస్తున్నారన్నారు. తమకున్న అధికార బలం అండబలం, డబ్బు పలుకుబడితో చేసిన నేరాలు బయట పడకుండా నిర్దోషులుగా చెలామణి అవుతున్నారనడానికి ప్రత్యక్ష సాక్ష్యం ధర్మస్థల ఉదంతాలు అన్నారు. 1998 నుండి 2014 వరకు దాదాపు 500 పైగా అమ్మాయిలు శవాలు పూడ్చిపెట్టారంటే ఆ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు అధికారులు చూపిన నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. ధర్మస్థల యాజమాన్యం నేరాల సాక్ష్యాధారాలను కూడా లేకుండా చేశారని, ప్రభుత్వం కూడ తమ కనుసన్నలలో ఉండేలా చేసుకున్నారనే అభిప్రాయం కలుగుతోందన్నారు. ఈ కేసు మొదట జూన్ 22న, దాదాపు ఒక నెల క్రితం వెలుగులోకి వచ్చిందినీ, ప్రభుత్వం ఆలస్యంగా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. జూలై 14న మాత్రమే అని, అదికూడా ఓ మాజీ పారిశుధ్య కార్మికుడు బయటకు వచ్చి తను చేసిన పాపాలను చెప్పుకోవాలి అనే భావంతో తనతో బలవంతంగా ఖననం చేయించిన మృతదేహాలను బయటకు తీయమని కోరగా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు పారిశుధ్య కార్మికుడి ఒప్పుకోలు స్టేట్మెంట్‌లో లైంగిక దాడులు, హత్యలు, ఖననాలు దహన సంస్కారాల లాటి భయంకరమైన నిజాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఈ సంఘటనలపై సమగ్ర విచారణ జరిపి నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు దాసర్ల దుర్గమ్మ, షేక్ సెమిమ్, ఎర్రబోతు పద్మ, డి శాంత, లింగంపల్లి అనిత,కౌన్సల్య, విజయ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులైన డ్వాక్రా మహిళలకు రుణం ఇవ్వాలి




ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు వినతి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులైన డ్వాక్రా మహిళలకు రూ.2 లక్షల రుణం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ , భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు)ల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి , సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరై డ్వాక్రా గ్రూపులలో ఉన్న మహిళలందరికీ ప్రభుత్వం ఇస్తామన్న రెండు లక్షల రూపాయల డబ్బులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన కొంతమంది నిరుపేదలు పెట్టుబడి పెట్టలేక ఇల్లు నిర్మించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం గమనించి ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి డ్వాక్రా గ్రూపులలో ఉన్న మహిళలు ఎవరికైతే ఇందిరమ్మ ఇల్లు వచ్చాయో వారికి ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తుందని తెలిపారన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇల్లు మంజూరై నిర్మించుకోలేని స్థితిలో ఉన్న డ్వాక్రా మహిళలందరికీ రెండు లక్షల రూపాయలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సాంబలక్ష్మి డిమాండ్ చేశారు. లబ్ధిదారులు ఎవరైతే డ్వాక్రా గ్రూపులలో ఉన్నారో వారికి ఎటువంటి కొర్రీలు పెట్టకుండా బ్యాంకు వారు స్త్రీ నిధి మరియు ఇతర పద్ధతిలో రెండు లక్షల రూపాయలు ఇచ్చి ఆదుకోవాలని ఆమె కోరారు. స్పందించిన మెప్మా అధికారి విజయ అర్హులై ఇల్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్న డ్వాక్రా గ్రూప్ సభ్యులకు రెండు లక్షల రూపాయలు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సిపిఐ పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు వెలుగు శ్రవణ్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, రాంప్రసాద్, డి రమేష్, జలగం ప్రవీణ్, చిలువేరు వికాస్, బోళ్ల భద్రయ్య, జూలకంటి వేణు, నవీన్, శ్రీధర్ మహిళా సమాఖ్య నాయకులు ఎర్రోజు పద్మ, కవిత, శారద, తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
## గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఎలివేటెడ్ ప్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలని కేంద్రమంత్రికి ఎంపి ఈటల రాజేందర్ వినతి



**ప్రజాపక్షం /హయత్ నగర్ :** చింతలకుంట నుండి ఆటో నగర్ వరకు ఎలివెటెడ్ ప్లై ఓవర్ బ్రిడ్జ్‌ను నిర్మించాలని కోరుతూ ఢిల్లీలో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గట్కరేను బుధవారం కలిసి మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ వినతిపత్రం అందజేశారు. బ్రిడ్జి లేకపోవడం కారణంగా స్థానిక వ్యాపారులు, చుట్టుపక్కల ఉన్న కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారన్నారు. స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి వినతి మేర మంత్రిని కలిసి కొత్త బ్రిడ్జ్‌ని తొందరగా నిర్మించాలని వినతిపత్రం అందజేశారు.

## కాలనీ సంఘాలతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాలనీ సంక్షేమ సంఘాలతోనే కాలనీలు అభివృద్ధి చెందుతాయని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని చైతన్య నగర్ కాలనీలో కాలనీ సంక్షేమ భవనంపై అదనపు ఫ్లోర్ నిరాణం చేయడంతో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ డివిజన్ అద్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనిల్ చౌదరి, కాలనీ అధ్యక్షులు జలందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నరసింహస్వామి కళ్యాణ మండపం ప్రారంభం...**బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ లోని శ్రీశ్రీలక్ష్మి నరసింహ స్వామి కళ్యాణ మండపం ప్రారంభోత్సవంలో ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమిరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీదర్ రావు, కాలనీ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్ రావు, ఇందిరారెడ్డి, శ్రీనివాసరావు, కాంతరావు, వెంకట హరి తదితరులు ఉన్నారు.

**పార్కుల అభివృద్ధికి కృషి...**పార్కుల అభివృద్ధి తన సహకారం ఎల్లప్పుడూ



ఉంటుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని వైదేహి నగర్ నార్త్ ఆధ్వర్యంలో పార్కు మంజూరు చేసి అభివృద్ధి చేయడంతో ఎంఎల్‌ఎకు అభినందన సభ కాలనీవాసులు నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనిల్ చౌదరి, శివశిందు పాఠశాల చైర్మన్ లక్కరాజు ప్రశాంత్, సుమన్ గౌడ్, సతీష్ గౌడ్, పోగుల రాంబాబు, రాజేందర్‌రెడ్డి, అన్నం రాజు శ్రీనివాస్, రమనాథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్ కార్డులు

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** అర్హులైన ప్రతి నిరుపేదకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శాస్త్రా గార్డెన్‌లో ఇబ్రహీంపట్నం మండలం, మున్సిపాలిటీ,ఆదిభట్ల మున్సిపాలిటీ ల పరిధిలోని నిరుపేదలకు రేషన్ కార్డుల పంఫిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై అర్హులైన నిరుపేదలకు మంజూరి పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామలలో కార్యదర్శులు, మున్సీపాలిటీలలో వార్డు అధికారులు పర్యటించి అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకు అందచేయాలని సూచించారు. ప్రజా అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు చిలుక మదుసూధన్ రెడ్డి, కె.గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్, తహసీల్థార్ సునితారెడ్డి, మున్సీపల్ కమిషనర్లు సత్యనారాయణరెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తహసీల్దార్‌కు వినతి

**ప్రజాపక్షం/యాచారం :** ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తు తహసీల్థార్‌కు ఉద్యమకారులు వినతిపత్రం అందచేశారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా యాచారం మండలం టియుఎఫ్ అధ్యక్షులు సమక్షంలో యాచారం మండల తహసీల్థార్‌కు రెండు వందల గజాల ఇంటి స్థలంతో పాటు ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా టియుఎఫ్ అధ్యక్షులు కొంతం యాదిరెడ్డి, పి కిషన్ శ్యామల, చిక్కుడు గుండాలు, జంగయ్య, రాములు పాల్గొన్నారు.

## పార్లమెంట్ సమావేశాల్లో బిసి బిల్లు ఆమోదించాలి

కుంట రవీందర్ యాదవ్ డిమాండ్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** కేంద్రప్రభుత్వం 42శాతం బిసిల రిజర్వేషన్ బిల్లును తక్షణమే రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో ప్రవేశపెట్టి పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు కుంట రవీందర్ యాదవ్ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సమితి జాతీయ ఉపాధ్యక్షులు ఎర్రం స్వామి యాదవ్, ప్రధానకార్యదర్శి నక్క రాములు యాదవ్, జాతీయ అధికార ప్రతినిధి కుమార స్వామి యాదవ్ లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బిసిల అభ్యున్నతికోసం కాంగ్రెస్ పార్టీ కృషిచేస్తుందన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం బిసిలను అణగదొక్కిందన్నారు. ప్రస్తుతం ఎంఎల్‌సి కవిత బిసిల మీద కపట ప్రేమ చూపిస్తుందని మండిపడ్డారు. బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు బిసిలపై ప్రేమ ఉన్నట్టు నటిస్తూ డ్రామాలు ఆడుతున్నాయని ధ్వజమెత్తారు. 42శాతం రిజర్వేషన్ బిల్లు అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం జంతర్‌మంతర్ వద్ద చేపట్టబోయే ధర్నాలో బిసిలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి సభ్యులు తెనుగు రాజు ముదిరాజ్, విలాస్ యాదవ్, అమర్ యాదవ్, మహేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వాస్తవ పరిస్థితులకనుగుణంగా మార్గదర్శకాలు అమలు

పురపాలక శాఖ కార్యదర్శి టికె.శ్రీదేవి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పట్టణ ప్రణాళిక(టౌన్ ప్లానింగ్)లో జాతీయ మార్గదర్శకాలను రాష్ట్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా అన్వయించుకోవాల్సిన అవసరం ఉందని పురపాలక శాఖ కార్యదర్శి టి.కె. శ్రీదేవి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్(ఎన్ఐయుఎం), కమిషనర్ అండ్ డైరక్టర్ ఆఫ్మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్(సిడిఎంఎ) సంయుక్తంగా హైదరాబాద్‌లో బుధవారం 2025–26 సంవత్సరానికి ప్రత్యేక మూలధన పెట్టుబడి సహాయం(ఎస్ఎఎస్‌సిఐ) ద్వారా నగర ప్రణాళిక సంస్కరణలపై భాగస్వామ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గృహనిర్మాణం, పట్టణ వ్యహారాల మంత్రిత్వ శాఖ(ఎంఓహెచ్‌యుఎ)కి చెందిన అధికారులు, తెలంగాణ మున్సిపల్ శాఖకు చంఎదిన అధికారులు పాల్గొన్నారు. సమావేశానికి టికె. శ్రీదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ జాతీయ మార్గదర్శకాలను రాష్ట్ర స్థాయిలో వాస్తవపరిస్థితులకు అనుగుణంగా అన్వయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం డిజిటల్ ఈ గవర్నెన్స్ అమలు, పట్టణ ఆవిష్కరణల్లో తీసుకుంటున్న ముందడుగుకు సంబంధించిన అంశాలను వివరించారు. ల్యాండ్ పూలింగ్, స్పాంజ్సిటి విధానాలు, గ్రీన్ బిల్డింగ్ ప్రణాళికలను తెలిపారు. డిసెంబర్ 20లోగా అన్ని సంస్కరణల వివరాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించే లక్ష్యాన్ని సాధించేందుకు తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా ఉన్నదని శ్రీదేవి తెలిపారు. రాష్ట్రం ప్రతి సంస్కరణకు అర్హత సాధించే దిశగా కృషి చేస్తూ, ప్రోత్సహకలను వినియోగించుకునే లక్ష్యంతో ముందుకు వెళ్లుతుందన్నారు.

**తెలంగాణ సంస్కరణలు అచరనీయం...** ఎంహెచ్‌యుఎ మొహ్మద్‌నిస్థాన్, అదనపు చీఫ్ ప్లానర్ సుదీప్ రాయ్, అసోసియేట్ టిసిపి కిషోర్ అవద్‌లు మాట్లాడుతూ ఎస్ఎఎస్‌సిఐలో భాగమైన కేటగిరి ఎక్స్ కింద ఉన్న సంస్థాగత సమార్థ్యాన్ని పెంపొందించుకోవడం, జిఐఎస్ ఆధారిత ఆస్తుల మ్యాపింగ్, సమగ్ర ఆస్తిపన్ను నిర్వహణ, స్టాట్యూటరీ టౌన్‌ప్లానింగ్ పథకాల అమలు, సిబిడిల పునరుద్ధరణ, వాతావరణ అనుకూల మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. ఈ పథకం కింద తెలంగాణ రాష్ట్రం 2051 కోట్ల మూలధనం కేటాయించగా, తెలంగాణ రాష్ట్రం దాదాపు 1800 కోట్ల వరకు వచ్చే అవకాశం ఉందన్నారు. తెలంగాణ కొత్త రాష్ట్రం అయినప్పటికీ పట్టణ సంస్కరణల అమలులో దేశవ్యాప్తంగా ముందుండటం ప్రశంసనీయమన్నారు. తెలంగాణలో అమలుచేస్తున్న టిడిఆర్, బిల్డ్‌నౌ డిజిటల్ ప్లాట్‌ఫామ్ వంటి ఆవిష్కరణలు ఇతర రాష్ట్రాలలో కూడా అమలు చేయాలని తాము సూచిస్తున్నామని చెప్పారు. ప్రాథమిక స్థాయి అంచనాలు, సంస్కరణలు, సామర్థ్య నిర్మాణ విధానాలపై సాంకేతికపరమైన చర్చ జరిగింది. ప్రణాళికల రంగ నిపుణులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. డైరక్టర్ ఆఫ్‌టౌన్ కంట్రి ప్లానింగ్(డిటిసిపి) సంస్కరణల అమలుపై వివరాలను సమర్పించేందుకు రాష్ట్ర నోడల్ సంస్థగా వ్యవహరించింది. హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఎఫ్‌సిడిఏ కమిషనర్ శశాంక, జలమండలి ఈ.డి. మాయంక మిట్టల్, హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చయత్బజపాయ్, కెఎంసి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, రామగుండం కమిషనర్ అరుణశ్రీ, డిటిసిపి డైరక్టర్ ఎస్. దేవేందర్ రెడ్డి, జిహెచ్ఎంసి చీఫ్ సిటీ ప్లానర్ కె.శ్రీనివాస్, హెచ్ఎండిఏ డైరక్టర్ ఎం.రాజేంద్ర ప్రసాద్ నాయక్, పురపాలకశాఖకు చెందిన సిడిఎంఎ, హెచ్ఎండిఏ, డిటిసిపి, హైడ్రా, జిహెచ్ఎంసి, ఎఫ్‌సిడిఏ, పిహెచ్ఈడి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి, టిజిఐఐసి, యుడిఏ, పట్టణాల కమిషనర్లు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ముమ్మరంగా రోడ్ సేఫ్టీ పనులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాలం నేపథ్యంలో నగరంలో ఏర్పడుతున్న రోడ్లపై గుంతలు పూడ్చివేత కార్యక్రమాన్ని జిహెచ్ఎంసి ముమ్మరంగా చేపట్టింది. వర్షాలతో ప్రజలకు కలిగే అసౌకర్యాలను నివారించేందుకు ఈ పనులను వేగంగా అధికారులు చేపట్టారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఇప్పటి వరకు నగరంలో 10,110 గుంతలను గుర్తించగా, వాటిలో 6,380 పాట్ హోల్స్ మరమ్మత్తులు పూర్తయ్యాయి. గత రోజుతో పోలిస్తే, మంగళవారం నాటికి పూర్తైన 5,893 గుంతలకు తోడు, బుధవారం 497 గుంతల రోడ్లను మరమ్మతు చేశారు. 296 క్యాచ్ పిట్స్ మరమ్మతు చేశామని అధికారులు తెలిపారు. 92 క్యాచ్ పిట్ కవర్స్‌ను ఏర్పాటు చేశారు. 3 సెంట్రల్ మీడియన్ పనులు పూర్తి చేశారు. జిహెచ్ఎంసి విభాగాల మధ్య సమన్వయంతో వేగవంతంగా ఈ ప్రక్రియ కొనసాగుతోందని కమిషనర్ కర్ణన్ తెలిపారు.

## పటిష్టంగా వర్షాకాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాదును ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దేందుకు వర్షాకాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ క్షేత్ర అధికారులు, పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణ కోసం జిహెచ్ఎంసి చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమ అమలును జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ బుధవారం ఉదయం కూకట్‌పల్లి, ఖైరతాబాద్ జోన్‌లలో జోనల్ కమిషనర్లు అపూర్వ్ చౌహాన్, అనురాగ్ జయంతి లతో కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. మొదట ఆకస్మిక తనిఖీ లో భాగంగా కమిషనర్ కూకట్ పల్లి జోన్‌లో ప్రధానంగా మునిసిపల్ వ్యర్థాల సకాలంలో తొలగింపు, దోమల నివారణ స్ప్రేలు (ఫాగింగ్, యాంటీ లార్వా), పార్కులు, కాలనీలు, నీరు నిలిచే ప్రదేశాల్లో పరిశుభ్రత చర్యలు, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఖైరతాబాద్ సర్కిల్‌లో అమీర్‌పేట్, పంజాగుట్ట, బేగంపేట్ ప్రాంతాలను జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి కమిషనర్ వర్షాకాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షించారు. గ్రేటర్ హైదరాబాద్ ఆరోగ్య పరిరక్షణకు ఈ నెల 29 నుంచి ప్రారంభమైన వర్షాకాల ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ఆగస్ట్ 8 వరకూ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనీ 150 వార్డులలో చేపడుతున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణ, సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి పౌరుడు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు.

## స్వచ్ఛ తులిప్ ఇంటర్న్‌షిప్‌తో యువతకు సాధికారత

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్‌బిఎం యు 2.0 కింద ప్రారంభించిన స్వచ్ఛ తులిప్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ ద్వారా జిహెచ్ఎంసి యువతను పట్టణ పారిశుద్ధ్యంలో చురుకుగా పాల్గొనేలా చేస్తుందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ఇంటరన్ షిప్ పూర్తి చేసిన అప్రెంటిస్‌లకు సర్టిఫికేట్‌లను మేయర్ విజయలక్ష్మి అందచేశారు. ఎఐసిటిఇ పోర్టల్ ద్వారా ఎనిమిది మంది ఇంటర్న్‌లను ఎంపిక చేసి జిహెచ్ఎంసి ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్య వ్యవస్థలలో నిర్మాణాత్మక శిక్షణ అందించామని చెప్పారు. ఫతుల్లగూడ సి అండ్ డి వేస్ట్ ప్లాంట్, జవహర్‌నగర్ ఎంఎస్‌డబ్ల్యూ ఫెసిలిటీకి క్షేత్ర సందర్శనల ద్వారా వారు ఆచరణాత్మక అనుభవాన్ని పొందారన్నారు. శిక్షణ కాలంలో అప్రెంటిస్‌లు ఘన వ్యర్థాలను వేరు చేయడం, నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధ అవగాహన, సమాజ పరిశుభ్రతను ప్రోత్సహించే ఐఈసి ప్రచారాలలో చురుకుగా పాల్గొన్నారన్నారు. వ్యర్థాల నిర్వహణ పద్ధతులను మెరుగుపరచడానికి కార్యాచరణ సిఫార్సులతో కూడిన ప్రాజెక్ట్ నివేదికను ఇంటర్న్‌లు సమర్పించారని మేయర్ తెలిపారు.

## నిరంతరాయంగా పూడికతీత పనులు

హైడ్రా చర్యలతో ఊపిరి తీసుకుంటున్న నాలాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని నాలాలు, క్యాచ్‌పిట్లు, కల్వర్టులలో కొన్ని ఏళ్లుగా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడుకుపోయిన వరద కాలువలను హైడ్రా యంత్రాంగం శుభ్రం చేసే పనులు చేపట్టింది. ఏమాత్రం వర్షం పడినా నాలాలు, క్యాచ్‌పిట్స్ నుంచి ఉబికి వచ్చిన వరదతో ఉక్కిరిబిక్కిరి అయిన నగర రహదారులు, నివాస ప్రాంతాలు ఇప్పుడు ఆ ముప్పు నుంచి బయటపడుతున్నాయి. చెత్త, పూడిక తొలగింపు పనులు నిరంతరంగా జరగడంతో వర్షాలు పడినప్పుడు వరద సాఫీగా పారుతోంది. హైడ్రా డిఆర్ఎఫ్, ఎంఈటిలు నిరంతరాయంగా పని చేసి చెత్తను తొలగిస్తున్నాయి. వర్షం ఉన్నప్పుడు వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో సేవలందించే ఈబృందాలు, నగర వ్యాప్తంగా పూడిక తీత పనులు కళ్లకు కట్టినట్టు కనిపిస్తున్నాయి. పూడిక తీయక ముందు, తర్వాతలా నాలాలు, కల్వర్టులు, క్యాచ్‌పిట్లు ఇప్పుడు కనిపిస్తున్నాయి.

**లారీల కొద్దీ పూడిక..**కల్వర్టులు, క్యాచ్‌పిట్లు, వరద కాలువల వద్ద లారీల కొద్దీ పూడిక బయట పడుతోంది. చాలా చోట్ల పూడికతో మొత్తం వరద వెళ్లని పరిస్థితి నెలకొంది. అల్వాల్‌లోని బృందావన్ కాలనీలోని కల్వర్టులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, సిల్ట్‌ను హైడ్రా తొలగించడంతో వరద సాఫీగా సాగుతోంది. బుల్కాపూర్ నాలాలో దశాబ్దాలుగా పేరుకుపోయిన సిల్ట్‌తో పాటు చెత్తను తొలగించే పనులు కొనసాగుతున్నాయి. టోలీచౌక్ ప్రాంతంలోని హకీంపేట, హఫీజ్ బాబా నగర్, సాబాజ్‌కాలనీ అయేషా మసీద్ రోడ్డు తదితర ప్రాంతాల్లో టన్నుల కొద్దీ చెత్త బయట పడుతోంది. ఎల్.బి. నగర్ క్రాస్‌రోడ్సులోని సాయి సదన్ కాంప్లెక్స్, వివేకానంద్ కాలనీలోని క్యాచ్‌పిట్స్ నుంచి మట్టిని తొలగిస్తున్నారు. శివరాంపల్లిలోని ఇందిరా నగర్ కాలనీలో నాలా నుంచి తీసిన పూడికను లారీలతో తరలిస్తున్నారు. బోరబండలోని పెద్దమ్మనగర్ పెద్దమ్మనగర్లో వర్షం పడితే వరద నీరు రహదారులను ముంచెత్తేది, సిల్ట్ తొలగించడంతో నీరు సాఫీగా సాగిపోతోంది. కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్ రోడ్డులోని కూడికుంట లేక్ ఔట్ లెట్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించి వరద బయటకు పోయేలా చేశారు.

## ప్రజల సంక్షేమానికి సర్కార్ కట్టుబడి ఉంది

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నేతల సన్న బియ్యం భోజనాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాపాలనలో ప్రతి ఒక్కరూ పౌష్టిక ఆహారం తీసుకోవాలన్న సంకల్పంతో సర్కారు అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకాన్ని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు హైదరాబాద్ నగరంలో అధికార పార్టీ నేతలు సన్న బియ్యంతో వడ్డించిన భోజనం చేశారు. త్వరలో ఉప ఎన్నిక జరగనున్న జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలోని రెహమత్ నగర్ డివిజన్ కమలానగర్‌లో కాంగ్రెస్ సీనియర్ దళిత నేత యాదయ్య నివాసంలో సన్న బియ్యంతో వండిన భోజనాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత గుర్రం మురళి గౌడ్ నేతలు ఎం.డి. గౌస్, యాదగిరి, చంద్రమౌళి, కొండపల్లి రమేశ్ తదితరులు కలిసి సహపంక్తి భోజనం చేశారు. యాదయ్య దంపతులు వారికి భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మురళి గౌడ్ మాట్లాడుతూ జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ విజయం సాధించటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గతంలోనే కాంగ్రెస్ హయంలో వేలాది మంది పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనత దక్కిందన్నారు. ప్రస్తుతం సిఎం రేవంత్ నేతృత్వంలోని ప్రజాపాలన అందిస్తున్న ప్రజాసర్కారు ఇప్పటికే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయటంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డులను, ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని వివరించారు. నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సర్కారు కట్టుబడి పనిచేస్తుందని మురళిగౌడ్ తెలిపారు.

# వంద శాతం లక్ష్యాలు సాధించే దిశగా కృషి

జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** బ్యాంకర్లు వంద శాతం లక్ష్యాలను సాధించే దిశగా కృషిచేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయల సముదాయంలో బ్యాంకర్లతో జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణ పంపిణీలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిగా సాధించడానికి అంకితభావంతో పని చేయాలని, తద్వారా ఆయావర్గాల అభ్యున్నతికి దోహదపడాలని బ్యాంకు నియంత్రణ అధికారులకు సూచించారు. పంట రుణ లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించడానికి,రుణ వితరణ లక్ష్యాన్ని అధిగమించడానికి,కొన్ని బ్యాంకులు తమ లక్ష్యాలను ఎందుకు అధిగమించ లేదో తెలియజేయడానికి బ్యాంకర్లు చొరవ తీసుకోవాలన్నారు. ఆయా రంగాలలోని అనేక బ్యాంకులు లక్ష్యాల ప్రకారం రుణాలు అందిస్తున్నప్పటికీ, కొన్ని బ్యాంకులు వెనుకబడి ఉన్నాయని చెప్పారు. బ్యాంకర్లు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించి వంద శాతం లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని స్పష్టం చేశారు. ఉన్నత విద్యను అభ్యసించడానికి విద్యార్థులకు అందుబాటులో ఉన్న రుణ సౌకర్యాల గురించి వారికి అవగాహన కల్పించడం ద్వారా ఆసక్తి,అర్హత కలిగిన విద్యార్థులకు విద్యా రుణాలు అందించడానికి చొరవ తీసుకోవాలని తెలిపారు. అంతేకాకుండా వివిధ వర్గాల అభ్యున్నతి, ఆర్థిక పురోగతి కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల కింద బ్యాంకర్లు రుణాలు మంజూరు చేసి మద్దతు అందించాలని పేర్కొన్నారు. వీధి వ్యాపారులకు సూక్ష్మ రుణాలు త్వరగా మంజూరు చేయాలని, తద్వారా వారు వ్యాపార లావాదేవీలు నిర్వహించడానికి ఆర్థికసహాయం అందించవచ్చన్నారు. ఇందిరా మహిళా శక్తి సంఘాలకు అవసరమైన రుణాలు అందించాలని, ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వికలాంగులు ఉన్న గ్రూపులకు బ్యాంకు ఖాతాలు తెరిచి రుణ సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ప్రభుత్వ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు వ్యవసాయ శాఖ, ఇతర పశుసంవర్ధక, ఎస్.సి ,ఎస్.టి,బి సి, మైనారిటీ,ఇతర శాఖల సమన్వయంతో స్వయం ఉపాధిలో సహాయం చేయడానికి సకాలంలో రుణాలు అందించాలని ఆయన తెలిపారు. రుణగ్రహీతలు యూనిట్లు స్థాపించారా లేదా,వారి అభివృద్ధిని నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను కోరారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలను పూర్తిగా పంపిణీ చేయాలని మరియు సబ్సిడీ రుణాల పంపిణీలో జాప్యం చేయరాదని సూచించారు.మరో సమావేశం నాటికి లక్ష్యాన్ని అధిగమించకపోతే, వ్యవసాయేతర రుణాలలో తక్కువ రుణ సౌకర్యాలు అందించిన బ్యాంకులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి హెచ్చరించారు.ఈ సమావేశంలో ఎల్‌డిఎం సుశీల్ కుమార్,ఆర్‌బిఐ రెహమాన్,నాబార్డ్ ఎజిఎం అఖిల్, వ్యవసాయ శాఖ అధికారి ఉష, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నవీన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి, బ్యాంకు నియంత్రణ అధికారులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## విద్యుత్ సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు జాప్యం లేకుండా పరిష్కరిస్తూ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని జిల్లా విద్యుత్ విభాగ చీఫ్ ఇంజనీర్ కామేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జనప్రియ 33/11కెవి సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసారు.ఈ సందర్భంగా ఎలాంటి సమస్యలు ఉన్నాయని అధికారులను అడిగి అవసరమైన సూచనలిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రతీమా షామ్, హబ్సిగూడ, డీఈ అన్వర్, సైనిక్‌పురి ఏడిఈ రామమూర్తి,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## మహాసభలకు విరాళాల సేకరణ

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** ఆగస్టులో జరుగనున్న సిపిఐ రాష్ట్ర మహాసభలకు సిపిఐ జవహర్‌నగర్ మండల కార్యదర్శి దర్శనం యాదగిరి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికి తిరిగి విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యల కోసం నిరంతరం తపించే పార్టీకి అండదండలుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, నిమ్మల నర్సింలు, మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, డిహెచ్‌పిఎస్ మండల అధ్యక్షులు నర్సింహ్మా, తదితరులు పాల్గొన్నారు.




## క్రీడల్లో రాణించిన విద్యార్థులకు అభినందనలు

**ప్రజాపక్షం/శామీర్‌పేటః** మేడ్చల్ జిల్లాలో ఇటీవల నిర్వహించిన అథ్లెటిక్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను మూడుచింతలపల్లి మున్సిపల్ కేశవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు అభినందించారు. బుధవారం కేశవరం పాఠశాల విద్యార్థులు హకింపేటలోని స్పోర్ట్స్ స్కూల్లో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి సర్టిఫికెట్‌లను పొందారు. దీంతో పిఇటి వరలక్ష్మి తో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సస్పెన్షన్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడి పదవి నుంచి కీసరి బానుచందర్‌ను సస్పెండ్ చేస్తున్నామని మేడ్చల్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రసిడెంట్ తోటకూర రాహుల్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్‌లో ఇటీవల ఆర్‌టిఎ, మైనింగ్ అధికారులమని టిప్పర్‌లు ఆపుతూ గొడవకు దిగి టిప్పర్ డ్రైవర్, యజమానిపై దాడి చేసిన ఘటనలో శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. దీంతో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ యువజన ఉపాధ్యక్షుడు పదవి నుంచి కీసరి భానుచందర్‌ను సస్పెండ్ చేస్తున్నామని మేడ్చల్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ ప్రసిడెంట్ రాహుల్‌యాదవ్ తెలిపారు.



## సమస్యల పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపాలిటిలోని జగ్గంగూడలో పేరుపోయిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని మాజీ సర్పంచ్ చందుపట్ల విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి కమిషనర్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంగూడ సంపన్‌బోల్ గ్రామ పరిధిలో మంచినీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, మ్యాన్‌హోల్స్ మరమ్మత్తులు, శ్మశాన వాటికలో నీటి సమస్య, విద్యుత్ సమస్య, ప్రభుత్వ పాఠశాలలో సిసి రోడ్డు, తదితర సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు జహంగీర్, నాగరాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# కొలిక్కి వచ్చిన రైల్వే సమస్యలు

### రైల్వే, జిహెచ్‌ఎంసి అధికారుల నిర్ణయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:**గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ల తొలగింపు ,ఇతర పెండింగ్ సమస్యలపై దక్షిణ మధ్య రైల్వే, జిహెచ్‌ఎంసి అధికారులు బుధవారం సంయుక్త సమన్వయ సమావేశం సికింద్రాబాద్ సంచాలన్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్, దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ కె. ముత్యాల నాయుడు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పాల్గొన్నారు. గ్రేటర్‌లో లెవల్ క్రాసింగ్ (ఎల్‌సి)ల తొలగింపు జిహెచ్‌ఎంసి, రైల్వే అధికారుల మధ్య ఒక ముఖ్యమైన చర్చనీయాంశంగా మారింది. ఈ ఎల్‌సిలు రెండు సంస్థలకు ఆందోళనలను కలిగిస్తున్నాయి. గ్రేటర్‌లో గ్రేడ్ సెపరేట్ల నిర్మాణం ద్వారా ఎల్‌సిలను తొలగించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో హైదరాబాద్ యార్డ్ మౌలాఅలీ యార్డ్, హాఫీజ్‌పేట్ యార్డ్‌లలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యలపై కూడా అధికారులు చర్చించారు, ఇక్కడ వర్షాకాలంలో రైల్వే ట్రాక్‌లపైకి నేరుగా డ్రైనేజీ నీటిని విడుదల చేయడం వల్ల ట్రాక్ వరదలతో నిండిపోతున్నాయి. ఇది రైళ్ల సురక్షిత నిర్వహణకు ప్రమాదాన్ని కలిగిస్తుందని అధికారులు అభిప్రయాపడ్డారు. ఈ ప్రదేశాలను పరిశీలించి, సమస్యను తగ్గించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంయుక్తంగా నిర్ణయించారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని రాణిగంజ్ ఆర్‌యుబి, సనత్‌నగర్ ఆర్‌యుబి , ఫతేనగర్ వద్ద అదనపు ఆర్‌ఒబి, గుండ్లపోచాంపల్లి వద్ద ఆర్‌యుబి, మల్కాజ్‌గిరి వద్ద ఆర్‌యుబి వంటి అనేక రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, రోడ్ అండర్ బ్రిడ్జిలు నిర్మాణంకోసం ప్రస్తుతం జిహెచ్‌ఎంసి పరిధిలోని భూసేకరణ , యుటిలిటీ షిఫ్టింగ్‌లో జాప్యం కారణంగా నిలిచిపోయింది. ఈ సమస్యల పరిష్కారాన్ని జిహెచ్‌ఎంసి వేగవంతం చేస్తుందని, పనులను ప్రారంభించడానికి సైట్ క్లియరెన్స్ అందించాలని సంయుక్తంగా నిర్ణయించారు. ఈ సమావేశంలో జిహెచ్‌ఎంసి ఆధీనంలో ఉన్న రైల్వే భూమికి సంబంధించిన అపరిష్కృత భూ సమస్యపై అధికారులు చర్చించారు. వీలైనంత త్వరగా సామరస్యపూర్వక పరిష్కారానికి కృషి చేయాలని సంయుక్తంగా నిర్ణయించారు. ట్రాఫిక్‌ను సులభతరం చేయడానికి, ఇరువైపులా సమస్యలను పరిష్కరించడానికి జిహెచ్‌ఎంసితో సహకరిస్తామని రైల్వే అధికారులు హామీ ఇచ్చారు.

## విద్యార్థులకు సాంకేతికతతో కూడిన బోధన

### కలెక్టర్ మనుచౌదరి సూచన



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కాలానుగుణంగా సాంకేతికను పెంపొందించుకొనే విధంగా విద్యార్థులకు బోధన అందించాలని, దీంతోపాటు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. కీసరలోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను ఆయన సందర్శించి విద్యా బోధన, భోజనాలు ఏ విధంగా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెల్సుకొన్నారు. గురుకుల పాఠశాల ప్రాంతంలో దీపాల వ్యవస్థ సరిగ్గా లేవని విద్యార్థులు, ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. హాస్టల్‌లోని వంట గది, డైనింగ్ హాళ్లను పరిశీలించారు. అనంతరం కీసరలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఎరువులు, క్రిమి సంహారక మందులను రైతులకు అందించటంలో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. నకిలీ మందులు, ఎరువులు విక్రయించకుండా వ్యవసాయాధికారులు తనిఖీలు చేస్తుండాలని ఆదేశించారు. దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకటరెడ్డి, జిల్లా పాఠశాలల కన్వీనర్ రజనీకాంత్, ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కొండగల్ ప్రభుత్వ వైద్య కళాశాల పనులు త్వరితగతిన పూర్తి

### రాష్ట వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కిస్టినీ జెడ్ చోగ్థు



**ప్రజాపక్షం/తాండూర్:**తాండూర్‌లో కొడంగల్ ప్రభుత్వ వైద్య కళాశాల పనులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి పరిశిలించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సంబంధించిన మ్యాపును పరిశీలించి అన్ని రూములకు సీరియల్ నెంబర్లు వేయాలని, సిసి రోడ్లు కాంపౌండ్ వాల్, సిసి టివి లు ఏర్పాటు, సెక్యూరిటీ కూమ్ ఏర్పాటు వాటర్ లైట్స్ అన్ని మౌలిక సౌకర్యాలతో ఒక వారము పూర్తి చేయాలని సంబంధిత అధికాలకు ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ప్రతి రూమ్‌ను, ప్రతి వార్డును తిరిగి అక్కడి సిబ్బందితో మాట్లాడాడు రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆసుపత్రి కి వచ్చే రోగులకు వైద్యధికారులు, సిబ్బంది అందుబాటలో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ఐసియు, డయాగ్నోస్టిక్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ ఎమర్జీన్సీ వార్డ్, జనరల్ వార్డ్, ఐసిటిసి ల్యాబ్ గర్భిణీలకు చికిత్స అందించే సెంటర్‌ను గొంతు, చెవి, ముక్కు సంబంధించిన ఓపిలను, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్, డెంటల్, ఐసియు, ఆసుపత్రిలో ఉన్న అన్ని విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగంలో పనిచేస్తున్న సిబ్బందితో ఎంతకాలం నుండి పని చేస్తున్నారు, మీకు ఇంకా ఏమైనా పరికరాలు అవసరమున్నాయా అని పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్స్ సమయ పాలన పాటించాలని అదేశించారు. అత్యవసర విభగం సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం మాత శిశు ఆరోగ్య కేంద్రంను పరిశీలించారు. వివిధ విభాగాల కు సంబంధించిన గదులను పరిశీలించారు. రోజు ఎంత మంది గర్భిణీలు వస్తున్నారని అన్ని విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్, ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్ చౌదరి, కొడంగల్ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి జిజి ఎచ్ మాలతి సూపరింటెండెంట్ సునీత, తహసీల్దార్ తారసింగ్, ఆనంద్, గోపాల్ రెడ్డి, విక్రమ్‌సింగ్‌రెడ్డి, రాజు, పద్మ, తదితరులు పాల్గోన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ అందజేత



**ప్రజాపక్షం/దోమ:**పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఘువేందర్‌రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రొసిడింగ్ అందజేసి ఇండ్ల నిర్మణ పను లను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ప్రొసిడింగ్ అందజేసినట్లు తెలిపారు. ఇండ్లులేని నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నాణ్యతతో ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## డబుల్ బెడ్‌రూమ్ బాధితులకు న్యాయం చేయించండి

### సిపిఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్‌లు ఇప్పిస్తానని చెప్పి ప్రజల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేసిన శ్రీధర్ ముదిరాజ్ నుండి మోసపోయిన బాధితులకు న్యాయం చేయించాలని నేడు సిపిఐ నాయకులు జీడిమెట్ల గడ్డం మల్లేష్ కి బాధితులతో కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని గత ప్రభుత్వ హయాంలో కొంత మంది ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల సంబంధాలను చూపి డబుల్ బెడ్ రూమ్ లు ఇప్పిస్తానని చెప్పి అమాయక ప్రజల వద్ద నుండి లక్షల రూపాయలను వసూలు చేయడం నేడు అది నకిలీగా తెలియడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ వ్యవహారం వెనకాల ఉన్న వారందరినీ పట్టుకొని చట్ట ప్రకారం మోసపోయిన బాధితులకు సహాయం చేయాలని, వారికి సాయం అందేంతవరకు సిపిఐ మద్దతుగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా సిఐ గడ్డం మల్లేష్ మాట్లాడుతూ, బాధితులకు చట్ట ప్రకారంగా న్యాయం జరిగేలా చూస్తానని, ఇంకెవరైనా బాధితులు ఉంటే నిర్భయంగా రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యేసురత్నం, సిపిఐ మండల కార్యదర్శి కె.స్వామి, ఎఐటియుసి అధ్యక్షులు హరినాథ్ రావు, సిపిఐ నాయకులు మధు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.



## మానవ అక్రమ రవాణా నిలువరించడం ప్రతీ ఒక్కరి బాధ్యత : ఎస్‌పి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** మానవ అక్రమ రవాణా నిలువరించేందకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం సాధన ఎన్జీఓ జిల్లా కో ఆర్డినేటర్ రమేష్‌తో కలిసి మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి నడుం బిగించాలని తెలిపారు. బాలల అక్రమ రవాణా పిల్లలపై లైంగిక అఘాయిత్యాలకు వ్యతిరేకంగా సాధన సంస్థ పనిచేయడం హర్షణీయం అన్నారు. పిల్లలు అక్రమ రవాణాకు గురికాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాధన ఎన్జీఓ ప్రతినిధులు నర్సింహ్మాలు, అంజయ్య, రోజా, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నుంచి బిఆర్‌ఎస్‌లోకి వలసలు

**ప్రజాపక్షం/కొడంగల్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని వీడి మాజీ ఎంఎల్‌ఏ పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో బిఆర్‌ఎస్ పార్టీలోకి దాదాపు 50 మంది కార్యకర్తలు చేరినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. బుధవారం బోంరాస్‌పేట మండల పరిధిలోని బొట్లోనితండాలో బిఆర్‌ఎస్ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅథితిగా విచ్చేసిన మాజీ ఎంఎల్‌ఏ పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడి దాదాపు 20 నెలలు గడుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా తిర్చిదిద్దిన ఘనత కేసిఆర్‌కే దక్కుతుందని ఆ గ్రామంలో చూసిన, తండాలలో చూసిన కేసిఆర్ పథకాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయని అన్నారు. కేసిఆర్ రైతులకు ఏం చేస్తే బాగుపడుతారని ఆలోచించి రైతు బంధు, రైతు భీమా, సకాలంలో ఎరువులు ఇలా చెప్పకుండానే చేయడం జరిగిందన్నారు. కాని రేవంత్ ప్రభుత్వం రైతులకు నట్టేంట ముంచే ప్రయత్నాలు సాగుతున్నాయని ఆరోపించారు. ప్రతి కార్యకర్తకు నేను అండగా ఉంటానని రాబోయో స్థానిక ఎన్నికలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు భారీ మొత్తంలో బిఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. అందుకు కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్‌ఎస్ పార్టీలో దాదాపు 50 మంది కార్యకర్తలు పార్టీ కండువాలు చేసుకోవడంతో వారికి ఘన స్వాగతం పలికారు.

# ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ రహదారిలో నరక యాతన

- అరగంట ప్రయాణానికి మూడు గంటలు
- ఎనిమిదేళ్లు పూర్తయినా సగం సైతం పూర్తికాని పిల్లర్లు
- గుంతలు, పూడికలతో నిలుస్తున్న నీరు
- ప్రమాదాలకు నిలయం








**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ఎనిమిదేళ్లపై బడి నత్త నడకతో కొనసాగుతూ అర్థాంతరంగా వదిలేసిన 6.2 కిలోమీటర్ల ఉప్పల్‌నారపల్లి ఎలవేటెడ్ కారిడార్ (ఫ్లైఓవర్ బ్రిడ్జి) నిత్యం వేలాదిమంది ప్రజలకు, వాహనదారులకు నరక యాతన చూపిస్తోంది. దుమ్మూ ధూళి, బురద, కంకర తేలి గుంతలకు ఏర్పాటి వానొస్తే నిలిచే నీటితో వర్షాకాలంలో కుంటలను తలపిస్తాయి. ఈ మార్గంలో రాకపోకలు చేసే వాహనదారులు ఎక్కడ గొయ్యి ఉందో తెలియక ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన దుస్థితి ఏర్పడింది. రోడ్డుపై ఇదిగో అదిగో త్వరలోనే పూర్తి చేస్తామంటూ సంబంధిత కేంద్ర మంత్రి నడ్డాతో పాటు రాష్ట్ర మంత్రులు అప్పుడప్పుడు చెబుతున్న మాటలు నీటిమీదే తిరుగుతున్నాయే తప్ప ఆ దిశగా పనులు మాత్రం సాగక ఎక్కడ గొంగడి అక్కడే అన్న విధంగా ఉంటోంది. ఈ ప్రాంతంలో ఎంపి ఈటెల రాజేందర్‌తో కల్సి గత ఏడాది ఆగస్టులో పర్యటించిన రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పి వారం రోజుల క్రితం మరోసారి పర్యటించిన సందర్భంలో మూడు నెలల్లో దసరా నాటికి ప్రారంభిస్తామని ప్రకటించారు. మరో పక్క అంబర్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభానికి వచ్చిన కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ నాలుగు మాసాల్లో ఉప్పల్-నారపల్లి-కారిడార్ పూర్తి చేస్తామని చెప్పారే తప్ప ఆ దిశగా మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కంట్రాక్టర్‌తో తలెత్తిన వివాదాలు, వివిధ కారణాలతో సగం వరకే వేసిన పిల్లర్లు, గుంతలు, రహదారి పొడుగునా పగుళ్లతో ప్రమాదకరంగా మారిన ఈ మార్గంలో మీదుగా రాకపోకలు చేసే వారికి అరగంటకు బదులుగా మూడేసి గంటలు పడుతోంది. వరంగల్ హైవేగా ఉన్న ఈ రహదారి చుట్టుపక్కలా వేలాదికాలనీలు, పలు వాణిజ్య సంస్థలు, కంపనీలే కాకుండా ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటి ఉన్నత విద్యా సంస్థలతో పాటు పలు పాఠశాలలు వేలాది సంఖ్యలో ఉన్న కారణంగా రేయింబవళ్లు ఈ మార్గంలో వేలాది సంఖ్యలో తిరిగే ప్రజా రవాణా సంస్థతో పాటు ప్రైవేట్ వాహనాలు, భారీ వాహనాలు, సొంత కార్లు, క్యాబ్‌లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రతి రోజు లక్ష ల సంఖ్యలో సంచరిస్తుంటారు. వరంగల్ జాతీయ రహదారి లో ఉప్పల్ నుండి ఘట్‌కేసర్ మార్గంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.625 కోట్ల అంచనా వ్యయంతో 6.2కిలో మీటర్ల మేర 148 పిల్లర్లతో ఎలివేటెడ్ కారిడార్ పనులకు 2018లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేసా రు.

ఒప్పందం ప్రకారం రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉండగా ఎనిమిదేళ్లు కావస్తున్నా ఇప్పటికీ పూర్తికాలేదు. ఫలితంగా గ్రేటర్ మహానగరంలో అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన ఉప్పల్ ప్రాంతంలోని వరంగల్ జాతీ య రహదారిలో తరచు ప్రమాదాలు చోటు చేసుకొంటున్నా యి. ఉప్పల్ సర్కిల్ సమీపంలో మెట్రో, మినీ శిల్పారామం, స్కైవాక్ వంతెన, జాతీయ రహదారి సమీప ప్రాంతాల్లో వందలాది విద్యా సంస్థలతో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతం ఎనిమిదేళ్లుగా నరకయాతన అందిస్తోంది.

**కాంట్రాక్ట్ రద్దు అయింది**

ఒప్పందం ప్రకారం ఎలివేటెడ్ నిర్మాణ పనులు పూర్తి చేయటంలో విఫలమైన టెండర్‌ను దక్కించుకొన్న కంట్రాక్టర్ గాయత్రి కన్‌స్ట్రక్షన్స్ సంస్థ కాంట్రాక్టును ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని, ఆ కంట్రాక్టర్ స్థానంలో మరో సంస్థ పనులు తిరిగి ప్రారంభించి దసరాలోపుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని గత వారం ఎలివేటెడ్ పనులు పరిశీలించిన రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేసారు.

న్యాయపరమైన చిక్కుల కారణంగా కంట్రాక్టర్‌ను మార్చటంలో ఏర్పడ్డ జాప్యమే ఆలస్యానికి దారి తీసిందని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయాలని కోరుతున్నా రు.

# రీల్



## ప్రభాస్‌తో పూరి ముచ్చట్లు

ప్రభాస్ హీరోగా రాజా సాబ్ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో రెగ్యులర్‌గా జరుగుతోంది. ఈ సినిమాకు మారుతీ దర్శకత్వం వహిస్తున్నారు. డిసెంబర్ లేదా వచ్చే యేడాది జనవరిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఆగమేఘాల మీద షూటింగ్ చేస్తున్నారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా నిర్మిస్తున్న చిత్రం షూటింగ్ కూడా హైదరాబాద్‌లోనే జరుగుతోంది. ఈ రెండు పెద్ద షూటింగ్ లు ఒకే దగ్గర జరుగుతుండటంతో పూరి జగన్నాథ్, ప్రభాస్ ఇద్దరూ కలుసుకున్నారు. చాలా సేపు ముచ్చట్లు పెట్టుకున్నారు. రాజా సాబ్ సెట్ లోకి వెళ్లి ప్రభాస్‌ను కలిశారు. గతంలో పూరి జగన్నాథ్, ప్రభాస్ కలిసి ఏక్ నిరంజన్ సినిమా చేశారు. ప్రభాస్‌ను కలిసిన వారిలో చార్మి కూడా ఉన్నారు.

## బ్రహ్మాండ ఫస్ట్ లుక్

మమత ఆర్ట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆమని ప్రధాన పాత్రలో మమత సమర్పించు చిత్రం 'బ్రహ్మాండ'. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ టీజర్ డిజైన్స్ చూశాను చాలా బాగా ఉన్నాయి సినిమా యూనిట్ అందరికి అల్ ది బెస్ట్ చెప్పారు. నిర్మాత దాసరి సురేష్ మాట్లాడుతూ మా బ్రహ్మాండ చిత్రాన్ని అఖండ చిత్ర ప్రొడ్యూసర్ ఫస్ట్ లుక్ పోస్టర్ ఆవిష్కరించిన మిర్యాల రవీందర్ రెడ్డి కి నేనెప్పుడూ రుణపడి ఉంటాను అన్నారు. చిత్ర దర్శకుడు రాంబాబు మాట్లాడుతూ మా సినిమా టైటిల్ని ఆవిష్కరించిన రవీందర్ రెడ్డికి థాంక్స్ చెప్తూ ఇది మొదటి విజయంగా భావిస్తున్నానని చెప్పారు. మొట్టమొదటిసారిగా ఒగ్గు కళాకారుల నేపథ్యంలో వారి సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్న చిత్రం ఇది. ఒగ్గు కథ తెలంగాణ జానపద కళారూపం. ఒగ్గు అంటే శివుని చేతిలోని ఢమరుకం అని అర్థం. ఈ పదం కేవలం తెలంగాణ ప్రాంతంలోనే వినిపిస్తుంది. ఇది అచ్చమైన దేశీపదం. ఈ చిత్ర కథ, స్క్రీన్ ప్లే ప్రేక్షకులను తప్పకుండా రంజింప చేస్తుంది. యాక్షన్స్ అన్ని డివోషనల్ థ్రిల్లింగ్ ప్రేక్షకులకు గూస్ బంప్స్ వచ్చే విధంగా ఉంటాయి. సినిమాటోగ్రాఫర్ కాసుల కార్తీక్ మాట్లాడుతూ అఖండ ప్రొడ్యూసర్ చేతుల మీదుగా రిలీజ్ చేయటం చాలా ఆనందం గా ఉంది. అని అన్నారు. సినిమా హీరో బన్నీ రాజు మాట్లాడుతూ నేను హీరోగా చేసిన సినిమా టైటిల్ ని రవీందర్ రెడ్డి రిలీజ్ చేయడం చాలా ఆనందం వేసింది ఈ బ్రహ్మాండ సినిమా కూడా అఖండ లా విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని చెప్పారు.





## సతీ లీలావతి టీజర్ విడుదల

లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'సతీ లీలావతి'. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. భార్య, భర్త మధ్య ఉండే అనుబంధాన్ని ఎమోషనల్‌గానే కాకుండా ఎంటర్‌టైనింగ్‌గానూ తెరకెక్కించిన ఫన్నీ ఎంటర్‌టైనర్ 'సతీ లీలావతి'. మూవీ టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌ను గమనిస్తే లావణ్య, దేవ్ మోహన్ జంట పెళ్లి చేసుకుని ఆనందంగా ఉంటుంది. కానీ నెక్ట్స్ సీన్‌లోనే దేవ్ మోహన్‌ను లావణ్య కొట్టి కట్టేసుంటుంది. వారి మధ్య జరిగే గొడవకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను టీజర్‌లో మనం గమనించవచ్చు. అలాగే భార్య భర్తల మధ్య జరిగే గొడవలో వి.కె.నరేష్, వి.టి.వి.గణేష్, సప్తగిరి, జాఫర్, మొట్ట రాజేంద్రన్ ఎందుకు ఇన్ వాల్వ్ అయ్యారు. అసలు గొడవేంటి? అనే విషయాలను తెలుసుకోవాలంటే సినిమా చూడాల్సిందేనంటున్నారు దర్శక నిర్మాతలు. షూటింగ్ పూర్తి చేసుకున్న 'సతీ లీలావతి' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి.




## ఈ చిత్రంలో భావోద్వేగాలు కట్టిపడేస్తాయ్

– విజయ్ దేవరకొండ



'కింగ్డమ్' ప్రేక్షకుల ముందుకు వస్తున్న నేపథ్యంలో తాజాగా చిత్ర బృందం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కథానాయకుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. 'సినిమా అవుట్ పుట్ పట్ల మేము చాలా సంతృప్తిగా ఉన్నాము. బుకింగ్స్‌కి వస్తున్న అద్భుతమైన స్పందన చూసి మాకు సంతోషంగా ఉంది. తెలుగు ప్రేక్షకులు ఇస్తున్న భరోసాతోనే.. మేము సినిమా విడుదల ముందు ఇంత ప్రశాంతంగా ఉండగలుగుతున్నాము. 'జెర్సీ' సినిమా తీసిన గౌతమ్ తిన్ననూరి 'కింగ్డమ్' ఇది. ఈ చిత్రంలో భావోద్వేగాలు కట్టిపడేస్తాయి. చరిత్రలో ఏ యుద్ధం చూసుకున్నా.. కుటుంబం కోసమో, పుట్టిన నేల కోసమో, ప్రేమ కోసమో ఉంటుంది. ఈ యుద్ధం కూడా అలాంటిదే. కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. సినిమా మొదలైన రెండు నిమిషాలకే ప్రేక్షకులు 'కింగ్డమ్' ప్రపంచంలోకి వెళ్తారు. థియేటర్‌కి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం మంచి అనుభూతిని ఇస్తుంది.' అన్నారు.నిర్మాత సూర్యదేవర నాగ వంశీ మాట్లాడుతూ.. 'ఈమధ్య కాలంలో సినిమాలకు ఓపెనింగ్స్ రాబట్టడం పెద్ద ఛాలెంజ్ అయిపోయింది. ఆ పరంగా చూస్తే మేము పాస్ అయ్యాము. బుకింగ్స్ బాగున్నాయి. మంచి వసూళ్లతో సినిమా ఘన విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను. కథానాయిక భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ.. 'కింగ్డమ్'లో మధు అనే కథకు కీలకమైన పాత్ర పోషించాను. గౌతమ్ గారు పాత్రను అద్భుతంగా మలిచారు అని అన్నారు.

## పాయల్ రాజ్‌పుత్ తండ్రి కన్నుమూత



టాలీవుడ్ హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ ఇంట విషాదం నెలకొంది. ఆమె తండ్రి విమల్ కుమార్ రాజ్ పుత్ (68) కన్నుమూశారు. హైదరాబాద్‌లో అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. ఢిల్లీలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. పాయల్ రాజ్‌పుత్ తన తండ్రితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ 'నా పక్కన లేకపోయినా, మీ ప్రేమ నన్ను ప్రతిరోజూ నడిపిస్తుంది. మీ చిరునవ్వు, మీ గొంతు, మీ ఉనికి నాకు చాలా గుర్తుంది. మీరు ఈ ప్రపంచం నుండి వెళ్ళిపోవచ్చు, కానీ నా హృదయం నుండి ఎప్పటికీ వెళ్ళిపోరు. లవ్ యు నాన్న..' అంటూ పోస్టు చేసింది.

## భార్యా భర్తల మధ్య అనుబంధమే సార్ మేడమ్



తమిళ హీరో విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ జంటగా నటించిన ఫ్యామిలీ డ్రామా 'సార్ మేడమ్'. ఏ రగ్డ్ లైవ్ స్టోరీ అనే ట్యాగ్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పాండిరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సత్యజ్యోతి ఫిలిమ్స్ బ్యానర్ పై సెందిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించారు. ఇటివలే తమిళ్‌లో విడుదలైన ఈ చిత్రం అక్కడ సూపర్ హిట్ అయింది. ఆగస్ట్ 1న తెలుగులో విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ ల్యాబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ ఈ సినిమా తమిళ్‌లో చాలా పెద్ద హిట్ అయింది. తెలుగులో కూడా పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. ఈ సినిమాకి తెలుగు పాటలు రాంబాబు చాలా చక్కగా రాశారు. విన సొంపుగా వున్నాయి. హీరోయిన్ నిత్యా మీనన్ మాట్లాడుతూ తెలుగులో సినిమా చేసి చాలా రోజులు అయింది. అందుకే ఈ సినిమాకి తెలుగులో నేనే డబ్బింగ్ చెప్పాలని అనుకున్నాను. ఈ సినిమా విషయంలో చాలా ఆనందంగా ఉంది. విజయ్‌తో నేను ఆల్రెడీ ఒక సినిమా కలిసి చేశాను. ఇది అందరికీ కనెక్ట్ అయ్యే స్టోరీ. తమిళ్ లాగే తెలుగులో కూడా పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నాను'అన్నారు. డైరెక్టర్ పాండిరాజ్ మాట్లాడుతూ కార్తి నటించిన చిన్న బాబు సినిమా తెలుగులో చాలా పెద్ద హిట్ అయింది. ఆ సినిమాకి నేనే దర్శకత్వం వహించాను. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బి నందిని రెడ్డి, డిఓపి సుకుమార్, పాటల రచయిత రాంబాబు గోసాల, ఎన్ వి ఆర్ సినిమాస్ సురేష్, ప్రొడ్యూసర్ త్యాగరాజన్ పాల్గొన్నారు .

## రిషబ్ శెట్టితో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ చిత్రం

ప్రేక్షకులకు వైవిధ్యభరితమైన చిత్రాలను అందిస్తూ, వరుస ఘన విజయాలతో దూసుకుపోతోంది ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్. ఇప్పుడు ఈ సంస్థ మరో భారీ చిత్రానికి శ్రీకారం చుట్టింది. 'కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కన్నడ అగ్ర కథానాయకుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి రిషబ్ శెట్టితో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓ భారీ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించింది. ప్రస్తుతం 'కాంతార 2' చిత్ర పనుల్లో నిమగ్నమై ఉన్న రిషబ్, ఒక ఫిక్షనల్ హిస్టారికల్ యాక్షన్ డ్రామా కోసం సితారతో చేతులు కలిపారు. 18వ శతాబ్దంలో భారత్‌లోని అల్లకల్లోలంగా ఉన్న బెంగాల్ ప్రావిన్స్‌లో ఒక తిరుగుబాటుదారుడు ఎదిగిన క్రమం నేపథ్యంలో ఈ చిత్ర కథ ఉంటుంది. మంచి కథకుడిగా పేరు గాంచిన, ప్రతిభావంతులైన అశ్విన్ గంగరాజు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈసారి ఆయన ఓ అద్భుతమైన కథతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం తెలుగు, కన్నడ భాషలలో ఏక కాలంలో చిత్రీకరించబడుతుంది. తెలుగు, కన్నడతో పాటు తమిళం, హిందీ, మలయాళం భాషల్లో విడుదల కానుంది. ప్రొడక్షన్ నెం.36గా రూపుదిద్దుకోనున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ప్రముఖ నటీనటులు, ప్రతిభగల సాంకేతిక నిపుణులు ఈ చిత్రం కోసం పని చేయనున్నారు.




## ఢిల్లీలో ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

రోజుల ఉద్యమ కార్యాచరణను పకడ్బందీగా చేపట్టాలని ప్రణాళిక రూపొందించింది. ఆగస్టు 5,6,7 తేదీలలో సిఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు తమతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులను జిల్లాకు 50 మంది చొప్పున ఢిల్లీకి తీసుకెళ్లాలని, అక్కడే మకాం వేసి ఉద్యమాన్ని చేపట్టాలని టిపిసిసి వ్యూహ రచన చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్ గౌడ్ హైదరాబాద్ బుధవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో బుధవారం వారు భేటీ అయ్యారు. దాదాపు గంటన్నర పాటు జరిగిన ఈ సమావేశం తెలంగాణలో పార్టీ నిర్మాణం, 'జనహిత' పాదయాత్ర, బిసి రిజర్వేషన్లపై ఢిల్లీలో పోరాడేందుకు కార్యాచరణపై వారు చర్చించారు. ఈ నెల 31వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు యథావిధిగా కాంగ్రెస్ పాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో 42 శాతం బిసి రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం ఢిల్లీలో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రత్యేకంగా చర్చించారు. ఆగస్టు 6వ తేదీన జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, పార్టీ నేతలు, బిసి సంఘాల నేతలు పాల్గొంటారు. ఏడవ తేదీన రాష్ట్రపతిని కలిసి వినతి పత్రం అందజేస్తారు. ఢిల్లీ పర్యటన తర్వాత పాదయాత్ర యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించినట్లు టిపిసిసి తెలియజేసింది.




## పక్కా ఇండ్లు నిర్మించాలి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఊడిగం చేస్తూ, పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని చాడ వెంకట్ రెడ్డి అన్నారు. మోదీ పాలనలో అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని అమలు చేయకుండా ప్రజాస్వామ్యం గొంతునొక్కుతూ ప్రజల హక్కులను కాలరాస్తున్నారన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను తుంగలో తొక్కతూ రచయితలను, కవులను, కళాకారులను, విద్యావేత్తలను అణిచివేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను మంటగలుపుతున్నారని, నిరుద్యోగం, ఆకలి, దారిద్రం నిరంతరం పెరుగుతూ పేదలకు విద్య, వైద్యం అందక ప్రజలు ఆందోళనకు గురవుతున్నా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. కమ్యూనిస్టులు అన్ని దేశాలలో ఉన్నారన్న విషయం రాష్ట్రంలో బిజెపి అధ్యక్షుడు రామ్ చందర్ రావు గుర్తెరగాలని, అసలు కమ్యూనిస్టులకు బద్ధ శత్రువే బిజెపి అని అన్నారు. పేదప్రజలపై దోపిడీ ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారని, వామపక్షాల దారులు వేరైనా గమ్యం ఒకటేనని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వ్యవస్థను కాపాడుకునేందుకు వామపక్ష, ప్రగతిశీల శక్తులు కలిసి ముందుకు సాగాలని అన్నారు. వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లాలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

**వరంగల్ నగరంలో సిపిఐ భారీ ప్రదర్శన...**

సిపిఐ జిల్లా ద్వితీయ మహాసభల సందర్భంగా వరంగల్ నగరంలో బుధవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. శివనగర్‌లోని సిపిఐ కార్యాలయం తమ్మెర భవన్ నుండి వరంగల్ చౌరస్తా మీదుగా పోచమ్మ మైదాన్ వరకు ప్రదర్శన కొనసాగించారు. ఈ ప్రదర్శన,అనంతరం జరిగిన సభలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర నాయకులు టి.వెంకట్రాములు, సిరబోయిన కరుణాకర్, పంజాల రమేష్, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, పల్లె నర్సింహా, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కే బాష్ మియా, పనాస ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణమ్మ పరవళ్లు



### జలకళతో ఉట్టిపడుతున్న సాగర్

### 26 గేట్ల ద్వారా నీటి విడుదల

ప్రజాపక్షం/నందికొండ: శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు భారీగా వరద ప్రవాహం కొనసాగుతుంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాజెక్టుల నుంచి శ్రీశైలంకు భారీగా వరద వచ్చి చేరుతుండటంతో మొత్తం 2,82,364 క్యూసెక్కుల నీరు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి సాగర్‌కు వచ్చి చేరుతుంది. దీనితో రిజర్వాయర్ నీటిమట్టం నిండుకుండను తలపిస్తూ ఉండటంతో ప్రాజెక్ట్ అధికారులు బుధవారం 10 గేట్లను 10 అడుగుల మేర 16 గేట్లను 5 అడుగుల మేర పైకి లేపి మొత్తం 26గేట్ల ద్వా రా నీటిని విడుదల చేస్తున్నారు.

**సాగర్ రిజర్వాయర్ సమాచారం..**

నాగార్జున సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసిలు ప్రస్తుత రిజర్వాయర్ నీటిమట్టం 586.20 అడుగులకు 301.3570 టిఎంసిల నీటి నిల్వతో ఉన్నది. కుడి కాలువ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7272 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బిసిఏఎంఆర్‌పి ద్వారా 1800 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండగా ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 28,826 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌కు 2,82,364 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లోగా వచ్చి చేరుతూ ఉంటే 312158 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా దిగువకు విడుదలవుతుంది.

### పర్యాటకుల సందడే.. సందడి



సాగర్ అందాలను తిలకించడానికి పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. దీనితో వాహనాల రద్దీ పెరగడంతో హిల్ కాలనీలో ఉన్న లాంచీ స్టేషన్, ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం, కొత్త, పాత వంతెనల వద్ద పర్యటకులతో నిండి పోయింది? దీనితో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడింది పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరిస్తూ ఉన్నారు. అయితే భద్రతా కారణాల దృష్ట్యా ప్రాజెక్టు అందాలను దగ్గర నుండి తిలకించడానికి ప్రాజెక్టు పైకి ఎవరిని అనుమతించకపోవడంతో పర్యాటకులు తీవ్ర నిరాశతో వెను తిరుగుతున్నారు. దీనితో పర్యాటకులు పవర్ హౌస్ వద్దకు చేరుకుని సెల్ఫీలతో సాగర్ అందాలను బంధిస్తున్నారు.

## మరో కొత్త డిస్కమ్

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఎన్‌పిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ తోపాటు కొత్తగా ఏర్పాటు చేసే డిస్కమ్ పరిధిలోకి వ్యవసాయ ఉచిత విద్యుత్, 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్, స్కూళ్లు, కాలేజీలకు ఉచిత విద్యుత్ పథకాలన్నీ తీసుకురావాలని సూచించారు. రాష్ట్రమంతా ఒకే యూనిట్‌గా కొత్త డిస్కమ్ పరిధి ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ఫలితంగా ఇపుడున్న డిస్కమ్‌ల పనితీరు మెరుగుపడుతుందని, జాతీయ స్థాయిలో రేటింగ్ పెరుగుతుందన్నారు. ఇంధన శాఖపై హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో విద్యుత్ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, టిజి జెన్‌కో సిఎండి హరీష్, టిజి ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్, టిజి ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, సింగరేణి సిఎండి బలరామ్, టిజి రెడ్‌కో విసి, ఎండి అనిల, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ డిస్కమ్‌ల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు సంస్కరణలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. డిస్కమ్‌ల పునరవ్యవస్థీకరణతో పాటు విద్యుత్ సంస్థలపై ఇప్పుడు ఉన్న రుణ భారం తగ్గించాలని అధికారులకు సిఎం సూచించారు. రుణాలపై వడ్డీ భారం తగ్గించేందుకు వెంటనే ప్రణాళిక సిద్ధం చేయాలని అదేశించారు. సుమారు 10 శాతం వరకు వడ్డీపై తీసుకున్న రుణాలతో డిస్కమ్‌లు ఇబ్బందులు పడుతున్నాయని, ఈ రుణాలను తక్కువ వడ్డీ ఉండేలా రీస్ట్రక్చర్ చేసుకోవాలని సిఎం అదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ విద్యుత్ వినియోగాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సిఎం సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని, జిల్లాల వారీగా అనువైన భవనాలను గుర్తించే బాధ్యతను సంబంధిత జిల్లాల కలెక్టర్లకు అప్పగించాలని, యుద్ధప్రాతిపదికన అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సిఎం ఆదేశించారు

## సమాన వేతనం

(మొదటి పేజీ తరువాయి)

కోసం ఫీల్డ్ అసిస్టెంట్లకు మొబైల్ ఫోన్ల మంజూరు తదితర అంశాలను క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క హామీనిచ్చారు. హైదరాబాద్, సచివాలయంలో బుధవారం మంత్రి సీతక్కతో ఫీల్డ్ అసిస్టెంట్లు సమావేశమై వారు తమ సమస్యలను వివరించారు.దీనిపై స్పందించిన మంత్రి సీతక్క సర్క్యూలర్ 4779ను రద్దు చేయాలని, ఈ సర్క్యూలర్ ద్వారా గత ప్రభుత్వంలో తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్ల పునర్ నియామకానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలపై సమగ్రంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మండల ఆఫీసుల్లో ఉపాధి హామీ విభాగంలో పని చేస్తున్న 540 మంది ఎంసిసి అటెండర్‌ల జీతాలను వారి విజ్ఞప్తి మేరకు నేరుగా వారి సొంత ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లను ఫిక్స్‌డ్ టెన్యూర్ ఉద్యోగులుగా మార్చే అంశం, వేతనాల పెంపు, తదితర న్యాయపరమైన, ఆర్థికపరమైన అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అంశాలను కేబినెట్‌లో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. ఉపాధి హామీ నిధుల్లో కేంద్ర ప్రభుత్వం భారీ కోతలు విధించడంతో రాష్ట్రాలు నష్టపోతున్నాయని, ఫీల్డ్ అసిస్టెంట్ల జీతల భారాన్ని కేంద్రం ప్రభుత్వం పూర్తిగా రాష్ట్రాలపై మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని కష్టనష్టాల మధ్యలోనూ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిరంతరం సానుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. వేతన సవరణ,ఆరోగ్య భద్రత, బదిలీ అవకాశాలు, బీమా కల్పన వంటి పలు కీలక డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు సంతృప్తి వ్యక్తం చేశారు.

## మోదీ ఎందుకు చెప్పట్లేదు

(మొదటి పేజీ తరువాయి)

మోదీ జంకుతున్నారని రాహుల్ అభిప్రాయపడ్డారు. భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ తీసుకురావడంలో కీలక పాత్ర పోషించానని ట్రంప్ తన వాదనను పునరావృతం చేసిన తర్వాత, ప్రతిపక్ష పార్టీ ప్రధాని మోదీపై తీవ్ర విమర్శలు చేసింది. అమెరికన్ నాయకుడు ప్రధానమంత్రి చుట్టూ పాములా చుట్టుకుని చేదు నిజాలను తన చెవిలో గుప్పించుకుంటున్నారన్నారు. ట్రంప్ తన వాదనలను పునరావృతం చేస్తున్న తాజా వ్యాఖ్యలు, భారతదేశం 20 నుండి 25 శాతం మధ్య అధిక అమెరికా సుంకాలను ఎదుర్కోవడానికి సిద్ధమవుతోందని రాహుల్‌ను మీడియా ప్రశ్నించగా, 'ట్రంప్ అబద్ధం చెబుతున్నారని ప్రధాని చెప్పలేరని స్పష్టంగా తెలుస్తుంది. ఏమి జరిగిందో స్పష్టంగా ఉంది. అందరికీ తెలుసు, ఆయన దానిని చెప్పలేకపోతున్నారు. అదే వాస్తవం' అని అన్నారు. ప్రధాన మంత్రి అలా చెబితే మోదీ బండారం బయటపడుతుందని, అందుకే ప్రధాని ఏమీ చెప్పలేకపోతున్నారని రాహుల్ ఎద్దేవా చేశారు. వాణిజ్య ఒప్పందం కోసం భారత ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని రాహుల్ గాంధీ అన్నారు. ఇప్పుడు, ఎలాంటి వాణిజ్య ఒప్పందం జరుగుతుందో అందరూ చూస్తున్నారని ఆయన పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో అన్నారు. ట్రంప్ అబద్ధం చెబుతున్నారని చెప్పే దమ్ము ప్రధాని మోదీకి లేదని, ఇందులో ఏదో అనుమానం కలుగుకుతుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. భారత్, పాక్ మధ్య మధ్యవర్తిత్వానికి మూడవ పక్షాన్ని తాము ఎప్పుడూ అంగీకరించలేదని చెబుతున్న కేంద్రం ప్రభుత్వం, మరి ట్రంప్ మధ్యవర్తిత్వాన్ని ఎందుకు అంగీకరించారని, కారణాలు ఏమితో వారు దేశానికి చెప్పాలని ఖర్గే పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చ సందర్భంగా లోక్‌సభలో మోదీ చేసిన రెండు గంటల ప్రసంగంలో ఒక్కసారి కూడా ట్రంప్ పేరును ప్రస్తావించలేదన్నారు. ట్రంప్ అబద్ధం చెబుతున్నారని, అలాంటి అర్థంలేని మాటలను సహించబోమని' చెప్పే ధైర్యాన్ని ఆయన ఎందుకు చేయలేకపోయారని ఖర్గే నిలదీశారు. ట్రంప్ వ్యాఖ్యలను ఆయన ఖండించి, దేశ ప్రతిష్టను వక్రీకరించడానికి ప్రయత్నిస్తున్నారని చెబితా యావత్ దేశం హర్షించేదన్నారు. కాగా, ట్రంప్ తాజా వ్యాఖ్యల వీడియోను ట్యాగ్ చేస్తూ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ మోదీకి మంచి మిత్రుడైన ట్రంప్ అమెరికా, సౌదీ అరేబియా, ఖతార్, యుకెలో 30 సార్లు చెప్పిన విషయాన్ని ప్రధాని ఎందుకు నిస్సందేహంగా, నిర్ద్వంద్వంగా తిరస్కరించడం లేదని ప్రశ్నించారు. మోదీ చాలా బలహీనమైన స్థితిలో ఉన్నారని, తన తప్పులను కప్పిపుచ్చడానికి ప్రయత్నిస్తున్నారని జైరామ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి ఉపయోగించిన పదాలను జాగ్రత్తగా వింటే, అవి అస్పష్టంగా ఉన్నాయని, వారు పలు విషయాలను నేరుగా స్పష్టం చేయాలన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com